RNI.No.TELTEL/2013/52694

Estd.: 2000

www.voodayam.com /voodayam /Voodayam




# వుదయం

Simultaneously published from Adilabad, Hyderabad, Khammam, Karimnagar,Guntur & Warangal

**రిపోర్టర్లు కావలెను...**

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో వుదయం తెలుగు దిన పత్రికకు రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తిగల, అనుభవజ్ఞులైన అభ్యర్థులు కావలెను.

- సిరికొండ అగస్టిన్
BA.L.LB., M.C.J.
వుదయం ఎడిటర్

సెల్: 9247698676

సంపుటి : 13 || సంచిక : 198 || ఆదిలాబాద్ || గురువారం, నవంబర్ 27 , 2025 || VOODAYAM Telugu Daily || వెల : రూ. 3.00 || పేజీలు : 12

## హైదరాబాద్‌లో శాఫ్రాన్ ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్ సర్వీసెస్‌ను ప్రారంభించిన మోదీ



హైదరాబాద్ : హైదరాబాద్‌లో శాఫ్రాన్ ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్ సర్వీసెస్ ఫెసిలిటీని ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శాఫ్రాన్ సంస్థకు కేంద్రం సహాయ సహకారాలు అదస్తుందని చెప్పారు. కొన్నేళ్లుగా ఏవియేషన్ రంగం వేగంగా అభివృద్ధి చెందుతోందని తెలిపారు. ఇప్పటికే భారత్ 1500 ఎయిర్‌క్రాఫ్ట్‌లకు ఆర్డర్ ఇచ్చిందని వివరించారు. ఎయిర్‌క్రాఫ్ట్‌ల సర్వీస్ సెంటర్ భారత్‌లో ఏర్పాటు కావడం ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ఎంఎస్‌ఎంఈలను ప్రోత్సహించే విధానంలో ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. కొన్ని రంగాల్లో 100 శాతం విదేశీ పెట్టుబడులను అనుమతించినట్లు చెప్పారు. ఏరోస్పేస్, ఏవియేషన్ హబ్‌గా హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డిశాఫ్రాన్ సంస్థ హైదరాబాద్‌ను ఎంచుకున్నందుకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఇది నగర అభివృద్ధికి మరింత దోహదం చేస్తుందని చెప్పారు. ఏరోస్పేస్, ఏవియేషన్ హబ్‌గా హైదరాబాద్ ఎదుగుతోందని వివరించారు. ఏవియేషన్ రంగానికి చెందిన ఎన్నో సంస్థలు ఇప్పటికే హైదరాబాద్‌లో ఉన్నాయని, ఎంతో మంది నిపుణులు ఇక్కడ ఉన్నారని పేర్కొన్నారు. శాఫ్రాన్ సంస్థకు అవసరమైన సహకారాన్ని అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. భవిష్యత్తులో ఎయిర్‌క్రాఫ్ట్‌ల తయారీ ఖర్చు భారీగా తగ్గుతుంది: రామ్మోహన్ నాయుడుశాఫ్రాన్ ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్ సర్వీసెస్ ఏర్పాటు వల్ల భవిష్యత్తులో ఎయిర్‌క్రాఫ్ట్‌ల తయారీ ఖర్చు భారీగా తగ్గుతుందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. దీని వల్ల ఆ లాభం ప్రయాణికులకు కూడా బదిలీ అవుతుందని పేర్కొన్నారు. ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్ సర్వీసెస్ కోసం సింగపూర్, మలేసియా వంటి దేశాలపై అధికంగా ఆధారపడుతున్నట్లు తెలిపారు. భారత్‌లో ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్ సర్వీసెస్ ప్రారంభం కావడం సంతోషకరమన్నారు. ప్రధాని మోదీ చేపట్టిన ఆత్మనిర్భర్ భారత్ వల్లే ఇది సాధ్యమవుతోందని వివరించారు. హైదరాబాద్ నగరం ఏవియేషన్ హబ్‌గా ఎదుగుతోందని చెప్పారు.

# సంవిధాన్ సదన్‌లో రాజ్యాంగ దినోత్సవం


దిల్లీ : భారత రాజ్యాంగాన్ని ఆమోదించిన తేదీకి గుర్తుగా ఏటా నవంబరు 26న 'జాతీయ రాజ్యాంగ దినోత్సవం'గా నిర్వహిస్తున్నారు. ఇందులోభాగంగా బుధవారం సంవిధాన్ సదన్ (పాత పార్లమెంటు భవనం)లోని చారిత్రక సెంట్రల్ హాల్‌లో ఈ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము నేతృత్వం వహించారు. ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ప్రధాని మోదీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, ఉభయసభల్లో ప్రతిపక్ష నేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ తదితరులు ఈ వేడుకలో పాల్గొన్నారు. రాష్ట్రపతి ఆధ్వర్యంలో రాజ్యాంగ ప్రవేశిక సామూహిక పఠనాన్ని చేపట్టారు. తెలుగు, మలయాళం, మరాఠీ, నేపాలీ, పంజాబీ, బోడో, కశ్మీరీ, ఒడియా, అస్సామీ భాషల్లోకి అనువదించిన రాజ్యాంగ ప్రతులను విడుదల చేశారు. ఈసందర్భంగా రాష్ట్రపతి మాట్లాడారు.ఆ క్షణాలు ఇంకా గుర్తున్నాయి: దేశ ప్రజలకు మోదీ లేఖ

"ఈ చరిత్రాత్మక దినోత్సవం సందర్భంగా మీ అందరి మధ్య ఉండటం నాకు సంతోషంగా ఉంది. 1949, నవంబర్ 26న రాజ్యాంగసభ సెంట్రల్ హాలులో రాజ్యాంగ సభ సభ్యులు భారత రాజ్యాంగాన్ని రూపొందించే పనిని పూర్తి చేసి ఆమోదించుకున్నారు. ముసాయిదా కమిటీ ఛైర్మన్ బీఆర్ అంబేడ్కర్ మన రాజ్యాంగ వాస్తుశిల్పుల్లో ముఖ్యులు. ట్రిపుల్ తలాక్‌ను రద్దు చేయడం ద్వారా మన సోదరీమణుల సాధికారతకు పార్లమెంట్ చర్యలు తీసుకుంది. జీఎస్టీ ద్వారా ఆర్థిక సమైక్యతను ప్రోత్సహించారు. ఆర్టికల్ 370తో రాజకీయ సమైక్యతకు ఉ



న్న ఆటంకం తొలగిపోయింది" అని స్వాతంత్ర్యం అనంతరం ప్రభుత్వాలు తీసుకున్న చర్యల గురించి ప్రస్తావించారు. కాగా.. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వశాఖలు, విభాగాలు, వాటి అనుబంధ కార్యాలయాలు, రాష్ట్ర, కేంద్ర పాలిత ప్రాంత ప్రభుత్వాలు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాయి.ఈ రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాహుల్ గాంధీ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. రాజ్యాంగం అంటే ఒక పుస్తకం కాదని దేశ ప్రజలకు లభించిన వాగ్దానమని పేర్కొన్నారు. దీనిద్వారా ప్రాంతం, మతం, కులం, సంపదతో సంబంధం లేకుండా ప్రతిఒక్కరికీ న్యాయం, సమానత్వం, గౌరవం లభిస్తుందని, అది పేదలు, అణగారిన వర్గాల రక్షణ కవచం అని రాసుకొచ్చారు.

## అఫ్గాన్‌తో ఉద్రిక్తతలు తగ్గేలా లేవు



### : పాక్ రక్షణ మంత్రి

ఇస్లామాబాద్: అఫ్గానిస్థాన్-పాకిస్థాన్ సరిహద్దుల్లో కాల్పుల విరమణ, సీమాంతర ఉగ్రవాదం.. తదితర అంశాలపై ఇటీవల జరిగిన శాంతి చర్చలు విఫలమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పాక్ రక్షణమంత్రి ఖవాజా ఆసిఫ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయని.. అవి తగ్గే అవకాశాలు కనిపించట్లేదన్నారు. అఫ్గాన్‌తో సంబంధాల పునరుద్ధరణకు 2021 తర్వాత నుంచి చేసిన యత్నాలు విఫలమైనట్లు వెల్లడించారు. ఇకపై తాలిబన్ల మీద ఏమాత్రం ఆశలు లేవని జియోన్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. పాకిస్థాన్ తమపై బాంబు దాడులు చేసిందని బుధవారం తెల్లవారుజామున అఫ్గాన్ తాలిబన్ పరిపాలన ప్రతినిధి జబీవుల్లా చేసిన ప్రకటనను ఖవాజా ఆసిఫ్ కొట్టిపడేశారు.



## ఛత్తీస్‌గఢ్‌లో 41 మంది మావోయిస్టుల లొంగుబాటు

చర్ల : ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల లొంగుబాటు పర్వం కొనసాగుతోంది. బీజాపూర్ జిల్లాలో ఎస్పీ డాక్టర్ జితేంద్ర కుమార్ యాదవ్ ఎదుట బుధవారం 41 మంది మావోయిస్టులు లొంగిపోయారు. లొంగిపోయిన వారిపై రూ.1.19 కోట్ల రివార్డ్ ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. వీరిలో 12 మంది మహిళలు సహా 29 మంది పురుష మావోయిస్టులు ఉన్నారన్నారు. లొంగిపోయిన వారిలో కీలక పీఎల్‌జీఏ ( పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ) నంబర్ వన్ బెటాలియన్, వివిధ ఏరియా కమిటీలు, ప్లాటూన్లు, కంపెనీ, మిలీషియా యూనిట్ల సభ్యులు ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. సౌత్ సబ్ జోనల్ బ్యూరో నుంచి 39 మంది, తెలంగాణ రాష్ట్ర కమిటీ, దమ్తారి.. గరియా బంద్, నువపాడ డివిజన్ సభ్యులు ఉన్నట్లు ఎస్పీ వెల్లడించారు.

ఇప్పటివరకు జిల్లాలో 790 మంది మావోయిస్టులు ప్రధాన జీవన స్రవంతిలో చేరారని, 1031 మందిని అరెస్టు చేశామని, వివిధ ఎన్‌కౌంటర్లో 202 మంది మావోయిస్టులు మృతి చెందారని ఎస్పీ పేర్కొన్నారు.

## చట్టాన్ని తప్పించుకొని పారిపోయేవారిని వెనక్కి రప్పించే హక్కు కేంద్రానికి ఉంది



దిల్లీ: చట్టాన్ని తప్పించుకొని విదేశాలకు పారిపోయే నేరగాళ్లను వెనక్కి తెచ్చే హక్కు కేంద్రానికి ఉందని సుప్రీంకోర్టు పేర్కొంది. తన అప్పగింతను సవాల్ చేస్తూ విజయ్ మురళీధర్ అనే పిటిషనర్ దాఖలు చేసిన వ్యాజ్యంపై బుధవారం కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది.

అక్రమ రవాణా, ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాల కింద గుజరాత్‌కు చెందిన విజయ్ మురళీధర్ ఉద్వానీపై 153 కేసులు నమోదయ్యాయని అధికారులు వెల్లడించారు. అతడు 2022లో దుబాయ్‌కు పారిపోయాడు. తనపై జారీ చేసిన రెడ్ కార్నర్ నోటీసును వెనక్కి తీసుకోవాలని, తన అప్పగింత కోసం యూఏఈ ప్రభుత్వానికి చేసిన అభ్యర్థనను ఉపసంహరించుకోవాలని విజయ్ వేసిన పిటిషన్‌ను గతంలో గుజరాత్ హైకోర్టు తిరస్కరించింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ అతడు అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. "మీపై ఎన్నో కేసులు నమోదై ఉన్నాయి. స్వదేశానికి తిరిగిరండి. చట్టాన్ని తప్పించుకొని పారిపోయేవారిని వెనక్కి రప్పించే హక్కు కేంద్రానికి ఉంటుంది" అని విచారణలో భాగంగా సుప్రీం వ్యాఖ్యలు చేసింది. కస్టడీ మరణాలు వ్యవస్థకే మచ్చపిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. విజయ్‌పై 38 నేరాలు నమోదై ఉన్నాయని, వాటి వివరాలు ఏవీ అతడికి తెలియవని కోర్టుకు వెల్లడించారు. ఈ వ్యాఖ్యలను కోర్టు ఆక్షేపించింది. ఆ వివరాలు కావాలంటే సంబంధిత ట్రయల్ కోర్టును ఆశ్రయించాలని సూచించింది. అదేమీ రాకెట్ సైన్స్ కాదని, అతడికి వ్యతిరేకంగా అరెస్టు వారెంట్ ఉందని గుర్తుచేసింది. "దుబాయ్ లో ఉన్న మీకు ఈ వివరాలన్నీ ఒక పళ్లెంలో పెట్టి అందించాలని అనుకుంటున్నారా..?ఇక్కడికి రండి.. పూర్తి వివరాలు అందుతాయి" అని మందలించింది.విజయ్ వద్ద అతడి పాస్‌పోర్టు లేదని, సహనిందితుడు ఒకరు కస్టడీలో చనిపోయాడని న్యాయవాది కోర్టుకు వెల్లడించగా.. "అతడిని అధికారులు తీసుకువస్తారులే" అని సుప్రీం వ్యాఖ్యానించింది. ఆ నిందితుడిది సహజ మరణం అని పోలీసులు న్యాయస్థానానికి వెల్లడించారు. ఈ వాదనల తర్వాత పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించడంతో.. విజయ్ తరఫు లాయర్ దానిని ఉపసంహరించుకున్నారు.

## ఐఏఎస్, ఎన్ఐఏ అధికారినంటూ మోసాలు

### నిందితుడు అరెస్టు



హైదరాబాద్ : ఐఏఎస్, ఎన్ఐఏ అధికారినంటూ మోసాలకు పాల్పడుతున్న బత్తిని శశికాంత్‌ను పోలీసులు అరెస్టు చేశారు. కేసు వివరాలను వెస్ట్‌జోన్ డీసీపీ శ్రీనివాసులు మీడియాకు వెల్లడించారు. శశికాంత్ తమిళనాడుకు చెందిన ఇద్దరు గన్‌మెన్లను వెంట పెట్టుకొని ఐఏఎస్, ఎన్ఐఏ అధికారినంటూ మోసాలకు పాల్పడ్డాడు. వాహనాలకు పోలీసు సైరన్లతో పాటుగా వాకీటాకీలను పెట్టుకొని అందరినీ నమ్మించాడు. టీఎస్ఐఐసీకి చెందిన ఫోర్జరీ లెటర్‌ను దగ్గర పెట్టుకొని, అందులో స్థలం ఇప్పిస్తానని చెప్పి గోల్డ్ జిమ్ ఓనర్‌తోపాటు పలువురిని మోసం చేశాడు. గోల్డ్ జిమ్ నిర్వాహకుడు అలీ హసన్ దగ్గర రూ.10లక్షలు, జిమ్ సూపర్‌వైజర్ వద్ద రూ.8లక్షలు తీసుకున్నాడు. ఇంటి యజమానిని కూడా నమ్మించి డబ్బులు వసూలు చేశాడు.బాధితుల ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసి.. శశికాంత్‌ను అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి రెండు మొబైల్ ఫోన్లు, వాకీటాకీలు, నకిలీ గుర్తింపు కార్డులు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. తమిళనాడుకు చెందిన లైసెన్స్ హోల్డర్లే ఇక్కడ శశికాంత్‌కు గన్‌మెన్లుగా వ్యవహరించారని తెలిపారు. వీరిపై కూడా కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

## విదేశీ విద్యార్థులకు అమెరికా భారీ ఊరట


వాషింగ్టన్: ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లాలనుకునే విద్యార్థులకు అగ్రరాజ్యం భారీ ఊరట కల్పించేందుకు సిద్ధమైంది. ఇందుకోసం ఎఫ్-1 విద్యార్థి వీసాల్లో కీలక మార్పులు తీసుకురానుంది. ఈ వీసాల జారీలో ప్రస్తుతం అనుసరిస్తున్న 'ఇంటెంట్ టు లీవ్' నిబంధన రద్దు దిశగా డిగ్నిటీ యాక్ట్-2025ను చట్టసభ్యులు ప్రతిపాదించారు. అంటే, ఇకపై విదేశీ విద్యార్థులు తమ గ్రాడ్యుయేషన్ పూర్తయిన తర్వాత తప్పనిసరిగా స్వదేశానికి తిరిగెళ్తామని నిరూపించుకోవాల్సిన అవసరం ఉండదు.ప్రస్తుతం ఎఫ్-1 వీసా దరఖాస్తుల్లో చాలావరకు 'ఇంటెంట్ టు లీవ్' రూల్ కిందే తిరస్కరణకు గురవుతున్నాయి. ఈ నిబంధన ప్రకారం దరఖాస్తుదారులు తాత్కాలిక స్టే తర్వాత (చదువు పూర్తయిన వెంటనే) అమెరికా విడిచివెళ్లిపోతామని కాన్సులర్ అధికారి వద్ద నిరూపించాల్సి ఉంటుంది. ఇందుకోసం దరఖాస్తుదారులు తమ స్వదేశంలో ఉన్న తమ ఆస్తులు లేదా ఉద్యోగావకాశాలకు సంబంధించిన పత్రాలను చూపించాల్సి ఉంటుంది.'చెన్నైలో హెచ్-1బీ వీసా భారీ కుంభకోణం'..!విదేశీ విద్యార్థులకు ముఖ్యంగా భారతీయులకు ఈ నిబంధన కఠినంగా మారింది. ఈ ఏడాది భారత విద్యార్థులకు ఎఫ్-1 వీసాల జారీ సంఖ్య భారీగా తగ్గింది. ఈ వీసాల తిరస్కరణల్లో అత్యధికం 'ఇంటెంట్ టు లీవ్'ను నిరూపించుకోలేని అభ్యర్థులవే ఉండటం గమనార్హం. ఈ క్రమంలోనే తాజా చట్టం ఇలాంటి విద్యార్థులకు ఊరట కల్పించే అవకాశం ఉంది. 'తిరిగెళ్లే ఉద్దేశం ఉందా?' అనే ప్రశ్న లేకుండా వీసాలు జారీ చేస్తే.. అమెరికాకు వచ్చే విదేశీ విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని ట్రంప్ యంత్రాంగం భావిస్తోంది.అయితే, ప్రస్తుతం ఈ ప్రతిపాదనలు బిల్లు దశలోనే ఉన్నాయి. అమెరికా కాంగ్రెస్ ఉభయసభల్లో ఇది ఆమోదం పొంది అధ్యక్షుడు సంతకం చేసిన తర్వాత ఈ డిగ్నిటీ చట్టం అమల్లోకి రానుంది.

## రేర్ ఎర్త్ మాగ్నెట్స్ విషయంలో కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయం



దిల్లీ: రేర్ ఎర్త్ మాగ్నెట్స్ విషయంలో కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. వీటి కొరతను అధిగమించేందుకు కొత్త పథకం తీసుకొచ్చింది. 'సింథర్డ్ రేర్ ఎర్త్ పర్మినెంట్ మాగ్నెట్స్'ను తయారీని ప్రోత్సహించేందుకు రూ.7280 కోట్లు వెచ్చించేందుకు ఆమోదం తెలిపింది. ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశం వివరాలను కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. ఏడాదికి 6 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యాన్ని సాధించాలనేది లక్ష్యంగా పెట్టుకున్నారు. రేర్ ఎర్త్ మాగ్నెట్స్ విషయంలో స్వావలంబన సాధించడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకుంది.విద్యుత్ వాహనాలు, పునరుత్పాదక ఇంధనం, ఎలక్ట్రానిక్స్, ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల్లో రేర్ ఎర్త్ పర్మినెంట్ మాగ్నెట్స్ కీలకం. ప్రస్తుతం అవసరాలు 2030 నాటికి రెట్టింపు కానున్నాయనేది అంచనా. ప్రస్తుతం వీటి కోసం దిగుమతులపై ఆధారపడుతున్నాం. దీన్ని అధిగమించేందుకు క్యాబినెట్ ఈ నిర్ణయం తీసుకుంది. దీనివల్ల ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయని మంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. గ్లోబల్ పోటీ బిడ్డింగ్ ద్వారా ఐదుగురు లబ్ధిదారులకు కేటాయించనున్నారు. ప్రతి లబ్ధిదారుడికి గరిష్ఠంగా సంవత్సరానికి 1200 మెట్రిక్ టన్నుల సామర్థ్యాన్ని నిర్దేశిస్తారు. ఈ పథకం ఏడు సంవత్సరాలు ఉంటుంది. మొదటి రెండేళ్ల ఇంటిగ్రేటెడ్ రేర్ ఎర్త్ పర్మినెంట్ మాగ్నెట్స్ తయారీ యూనిట్ ఏర్పాటు చేయడానికి గెస్టేషన్ పీరియడ్ ఉంటుంది. తర్వాత 5 ఏళ్లు వీటి అమ్మకాలపై ప్రోత్సాహకాలు చెల్లిస్తారు.

## మరో కేసులో ఇమంది రవికి 14 రోజుల రిమాండ్



హైదరాబాద్ : ఐ-బొమ్మ ప్రధాన నిర్వాహకుడు ఇమంది రవిని సైబర్ క్రైమ్ పోలీసులు మరోసారి కోర్టులో హాజరుపర్చారు. మరో కేసులో అతనికి నాంపల్లి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. ఇమంది రవిపై ఇప్పటి వరకు సైబర్ క్రైమ్ పోలీసులు మొత్తం 5 కేసులు నమోదు చేశారు. మిగిలిన 3 కేసులకు సంబంధించి కూడా పీటీ వారెంట్ దాఖలు చేశారు. కోర్టు అనుమతితో ఆ మూడు కేసుల్లో కూడా అరెస్టు చూపనున్నారు. రవిని పోలీసు కస్టడీకి ఇవ్వాలంటూ పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై వాదనలు ముగిశాయి. మరి కాసేపట్లో నాంపల్లి కోర్టు తీర్పు ఇవ్వనుంది.

## శ్రీశ్రీశ్రీ వల్లి దేవసేన, సమేత శ్రీ సుబ్రమణ్యేశ్వర స్వామి వారి కళ్యాణం



కాజీపేట, నవంబర్ 26(వుదయం జిల్లా ప్రతినిధి) : బుధవారం రోజున శ్రీ హరి హర పుత్ర శ్రీ ధర్మశాస్త్ర వారి దేవాలయం లో( 31)వ మండ ల పూజల సందర్భంగా శ్రీశ్రీశ్రీ వల్లి దేవసేన, సమేత శ్రీ సుబ్రమణ్యేశ్వర స్వామి వారి కళ్యా ణం దేవాలయం పూజారి ఉదుతల శ్రీనివాస్ శర్మ, జాగర్లపూడి శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో కళ్యాణం జరిగినది. ఉదయము కన్నె స్వాములు దేవాలయము నుండి పాల పన్నీరు కావల్లతో శివాలయ మునకు వెళ్లి శివాలయములో విశేష పూజలు అనంతరం తిరిగి దేవాలయాలకు రావడం జరిగింది దేవాలయంలో అమ్మ వార్లకు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి మంగళ స్నానా లు చేయించడం జరిగింది. మంగళ స్నానము అనంతరం అలంకరణ చేసిన తదనంత రము ఎదురుకోళ్లు తంతు జరి గినది తరువాత కళ్యాణవేదిక మీదికి రావడం జరిగినది కళ్యాణములో భక్తులు అయ్య ప్పలు సుమారు 2000 మంది కళ్యా ణమును తిలకించడం జరిగింది అయ్య ప్పలకు భక్తులకు మహాఅన్న ప్రసాద వితరణ జరిగినది. ఈ కళ్యా ణంలో హనుమకొండ వరంగల్ కాజీపేట చుట్టు పక్కల అయ్య ప్పలు అందరూ పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్ ను కలిసిన నూతన ఎస్పి సంగ్రామ్ సింగ్ గణపట్ రావు పాటిల్



నాగర్ కర్నూల్ నవంబర్ 26(వుదయం ప్రతినిధి)ఇటీవలే నాగర్ కర్నూల్ జిల్లా నూతన ఎస్పీ గా బాధ్యతలు చేపట్టిన సంగ్రామ్ సింగ్ గణపట్ రావు పాటిల్ బుధవారం ఉదయం జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ను మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్చం అందజేశారు. జిల్లాలో మూడు విడతల్లో నిర్వహించాల్సిన స్థానిక సంస్థల ఎన్నికలు, శాంతి భద్రతలు, నేరాల నియంత్రణ, ప్రజల రక్షణ కార్యక్రమాల అమలు, ప్రజా సేవల సమన్వయం వంటి అంశాలపై ఎస్పీ కలెక్టర్ చర్చించారు.

2015 బ్యాచ్ కు చెందిన ఐపీఎస్ అధికారి హైదరాబాద్ సిఐడి డీసీపీగా విధులు నిర్వహిస్తూ నాగర్ కర్నూలు జిల్లాకు ఇటీవలే జిల్లా ఎస్పీగా వచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎస్పీకి శుభాకాంక్షలు తెలిపారు.

## డిసిసి అధ్యక్షులు ఇనగాలకు ఘన సన్మానం- సన్మానించిన కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా కమిటీ



హనుమకొండ, నవంబర్ 26(వుదయం ప్రతినిధి): వరంగల్ కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి హనుమకొండ డీసీసీ అధ్యక్షులుగా నియమితులైన సందర్భంగా బుధవారం రోజున కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బొచ్చు చందర్ ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ఇనగాల వెంకట్రాంరెడ్డిని శాల్వతో ఘనంగా సన్మానించారు. పూలబొకతో శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ అధ్యక్షుడు తాళ్లపల్లి రాజు, ఉపాధ్యక్షులు గోవిందు మహాభాను, నిట్టి బాల రాజు, జిల్లెల కృష్ణమూర్తి, సము ద్రాల సోమయ్య, జనరల్ సెక్రెటరీ తాటికొండ ప్రసాద్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ రాజు, పరకాల మండల అధ్యక్షుడు దుమల కిషోర్, నడుకుడ మండల అధ్యక్షుడు మేకల కుమారస్వామి, పరకాల బ్లాక్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు పల్లె రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## భారత రాజ్యాంగ రక్షణకై పోరాడుదాం: కల్లెపల్లి అశోక్ KVPS జిల్లా కార్యదర్శి



పెద్దపల్లి నవంబర్ 26(వుదయం ప్రతినిధి) పెద్దపల్లి జిల్లా కేంద్రములో అంబేద్కర్ విగ్రహం ముందు KVPS జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రియాంబుల్ పఠనం చేయించడం జరిగింది. రాజ్యాంగ పీఠికను కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు మోదుంపల్లిశ్రవణ్ చదివి పఠానం చెప్పించడం జరిగిందినవంబర్ 26, 1949 భారతదేశ భారత రాజ్యాంగం ఆవిష్కరించుకోవడం జరిగింది. భారత రాజ్యాంగం సర్వసత్తా సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, పౌరులందరికీ సాంఘిక, ఆర్థిక రాజకీయ, న్యాయాన్ని ఆలోచన స్వేచ్ఛ, భావ ప్రకటన, ఎవ్వరి విశ్వాస నమ్మకం ఆరాధనలో స్వతంత్రాన్ని హోదాల్లో అవకాశాల లోనూ సమానత్వాన్ని వ్యక్తి గౌరవాన్ని జాతి ఐక్యతను, సమగ్రతను సౌభ్రాతృత్వాన్ని తేడా వివక్ష లేకుండా మనకు మనమే అందరము రాజ్యాంగం సమర్పించుకోవడం జరిగింది ఈ సందర్భంగా KVPS జిల్లా కార్యదర్శి కల్లేపల్లి అశోక్ మాట్లాడుతూ బీజేపీ పాలిత ప్రాంతాలలో ఇప్పటికే దళితుల పైన అట్టడుగు వర్గాలకు చెందిన ప్రజల పైన దాడులు దౌర్జన్యాలు హత్యలు విపరీతంగా పెరిగిపోయిన పరిస్థితి ఉన్నది బిజెపి ఎంపీలు బహిరంగంగానే రాజ్యాంగాన్ని మారుస్తామని ప్రకటన చేస్తున్న సందర్భం ఉంది కాబట్టి దేశ ప్రజలందరూ రాజ్యాంగాన్ని కాపాడుకోవడం కోసం మరో పోరాటం చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. కేంద్ర బిజెపి ప్రభుత్వం 400 మను ధర్మశాస్త్రం అమలు జరిగితే. ప్రజలందరూ అన్ని రకాల వివక్షలకు దాడులకు దౌర్జన్యాలకు అనుభవించవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. భారత రాజ్యాంగం భారత ప్రజలకు కల్పించిన ప్రాథమిక హక్కులు తొలగించబడతాయి.. బిజెపి ప్రభుత్వం కార్మికులకు ఉన్న 29 లేబర్ చట్టాలను తొలగించి 4 కోడ్సను తెచ్చారు.. రోజుకు8 గంటలు పని దినానికి బదులు 12 గంటల పని దినా న్ని పెంచారు. అందుకే బీజేపీని మనువాదాన్ని మట్టు పెడదాం రాజ్యాంగాని కాపాడుకుందాం అని అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు సెపెల్లి రవీందర్, కుమ్మరి నవీన్, ఇమ్రాన్, శ్రీనివాస్ రెడ్డి, సాయి తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ పెండింగ్ సమస్యల కోసం పిఆర్ టియు ఆధ్వర్యంలో నిరాహారదీక్ష



మధిర,నవంబర్ 26 (వుదయం ప్రతినిధి) ఉపాధ్యాయ పెండింగ్ బిల్లులు పెండింగ్ డిఎలు, పిఆర్సి పిఆర్సి, పెన్షనర్స్ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ పిఆర్ టియు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈనెల 27 ఉదయం 10 గంటల నుండి 28 సాయంత్రం నాలుగు గంటల వరకు చేపట్టిన 30 గంటల నిరాహార దీక్షకు మధిర డివిజన్ నుంచి పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు తరలివచ్చి తమ మద్దతును తెలియ జేయాలని జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ఆర్, బ్రహ్మారెడ్డి పిలుపునిచ్చారు. నిలబెట్టుకుంటుందని రెండు సంవత్సరములుగా ఎదురు చూస్తూ వచ్చామని కానీ ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ఎలాంటి మార్పు రాలేదని ఉద్యోగ విరమణ చెందిన వందలాదిమంది ఉపాధ్యాయులకు పెన్షన్ బకాయిలను చెల్లించలేదని, పెండింగ్ డిఎలు, పిఆర్సి ఊసే లేదని ఉపాధ్యాయులు దాచుకున్న జిపిఎఫ్, టీఎస్ జిఎల్ఐ డబ్బులు, మెడికల్ బిల్లులు నెలలు గడిచినా విడుదల చేయకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. ఈ నెల 27 మరియు 28 తేదీల్లో జిల్లా శాఖ చేపట్టిన 30 గంటల నిరాహార దీక్ష రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి నాంది పలుకుతుందని ఇప్పటికైనా ప్రభుత్వం ఉపాధ్యాయ ఉద్యోగుల పెన్షనర్ల బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రకటన విడుదల చేసిన వారిలో జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ వి రవికుమార్, మధిర మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిలుకూరి సత్యనారాయణరెడ్డి పోలే సుధాకర్, మండల బాధ్యులు పిల్లి నరసింహారావు ఎండి జమీర్, ఎల్.అప్పారావు, కె.శాంత బాబు, తెల్ల మేకల శ్రీనివాసరావు, మల్లెల శ్రీనివాస్, ఎం.బాబు రాజా, పిడిపి జ్యోతి, టి.అనసూయ, డి.శ్యామలరావు, చెడే సతీష్, టి అజయ్ కుమార్, ఎం నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

## కెసిఆర్ నాయకత్వంలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశాం..మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్

మహబూబ్ నగర్ నవంబర్ 26 (వుదయం ప్రతినిధి)రాష్టాన్ని సాధించిన పార్టీ టిఆర్ఎస్ పార్టీ అని పదెండ్లలో కేసీఆర్ నాయకత్వంలో దేశంలోనే ఆదర్శవంతగా రాష్టాన్ని అన్ని రంగాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధి చేసిందని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని న్యూ టౌన్ లో గల బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యమ సమయంలో నవంబర్ 29న మాజీ సీఎం కెసిఆర్ దీక్షా దివాస్ పేరుతో ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారని, కేంద్రం కదిలి వచ్చి స్వరాష్ట్రాన్ని ప్రకటించిందని పేర్కొన్నారు. ఉద్యమ సమయంలో అనేక బెదిరింపులు వచ్చిన వెనక్కి తగ్గకుండా పోరాటం చేసామని, ఉద్యోగులకు జరుగుతున్న అన్యాయాన్ని కెసిఆర్ దృష్టికి తీసుకెళ్ళగా 14ఎఫ్ కి వ్యతిరేకంగా ఉద్యోగులు పోరాటం చేస్తుంటే కెసిఆర్ పిలిపించుకొని మద్దతు తెలిపారని గుర్తు చేశారు. 14 ఎఫ్ రద్దు కోసం సిద్ధిపేట సభ ఏర్పాటు చేస్తే అక్కడే అమరానిరాహార దీక్ష చేస్తామని కెసిఆర్ ప్రకటన చేసారు.

తెలంగాణ ప్రకటన వచ్చే వరకు దీక్ష విరమణ చేయనని కెసిఆర్ ప్రకటన వచ్చిన తరువాత మా చేతుల మీదుగా దీక్ష విరమణ చేసి తెలంగాణ రాష్ట్రము సాధించడం మరుపురని ఘట్టం ఇది చరిత్రలో నిలిచిపోతుందని మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రములో 50 రూపాయల పెన్షన్,కరెంటు లేక రైతు ఆత్మహత్యలు ఉండేవి.రాష్ట్రము వచ్చినందుకే కరెంట్, సాగు నీరు, మంచి నీళ్లు 2 వేల పెన్షన్స్ వచ్చాయని, భవిష్యత్ లో కెసిఆర్ మళ్ళీ ముఖ్యమంత్రి అవుతారని అలాంటి నాయకుడు నాయకత్వంలో పని చేసినందుకు గర్వంగా ఉందని ఆయన దీమా వ్యక్తం చేశారు.

## కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలి ఏ ఐ ఎఫ్ టి యు రాష్ట్ర నాయకులు చంద్రగిరి శంకర్ డిమాండ్



భూపాలపల్లి నవంబర్ 26 వుదయం ప్రతినిధి: కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలని -29. కార్మిక చట్టాలను అమలు పర్చాలని ఏఐఎఫ్టీయు. రాష్ట్ర. ప్రధాన కార్యదర్శి. ఎం రాయమల్లు రాష్ట్ర నాయకులు. చంద్రగిరి శంకర్డిమాండ్ చేయడం జరిగింది కేంద్రంలో మూడోసారి అధికారం లోకి వచ్చిన భారతీయ జనతా పార్టీ మోడీ ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాలను అనుసరిస్తూ. కార్మికులు అనేక ఉద్యమాలు ప్రాణ త్యాగాలు చేసి సాధించుకున్న 29. కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్ గా మార్చి కేంద్ర ప్రభుత్వం దేశంలో ఉన్న పరిశ్రమంలో అమలు చేయడానికి చేస్తున్న ప్రయత్నాలను వ్యతిరేకిస్తూ అఖిల భారత స్థాయిలో అన్ని కార్మిక సంఘాలు ఫెడరేషన్లు కార్మిక ఉద్యోగ సంఘాలు అనేక నిరసనలు భారత్ బందులు, టోకెన్ సమ్మెలు నిర్వహించి కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి చేసి నప్పటికీ కార్మికుల అభిష్టానికి వ్యతిరేకంగా మోడీ ప్రభుత్వం పెడచెవిన పెట్టి కార్మిక వ్యతిరేక ఈ నాలుగు లేబర్ కోడ్స్ ను (21/11/25) రోజు నుండి అమలులోకి తెచ్చి మోడీ ప్రభుత్వం బడా కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలను కాపాడడానికి భారత రాజ్యాంగంలో కార్మిక వర్గ ప్రయోజనాల కోసం పొందుపరచుకున్న కార్మిక చట్టాలను హిందుత్వ మతోన్మాద బిజెపి మోడీ ప్రభుత్వం భారత కార్మిక వర్గ ప్రయోజనాల కోసం పనిచేస్తున్నమని చెప్తూ మరోవైపు లాభాల లో నడుస్తున్న ప్రభుత్వ రంగ పరిశ్రమలను మూసివేస్తూ అదాని-అంబానీ-బడా పారిశ్రామిక వేత్తలకు అమ్మివేస్తూ కార్మికులను కార్మిక కుటుంబలను రోడ్డు మీదికి నేటి వేస్తూ అన్ని రంగాల ప్రజలను సంక్షోభ ములకు నెడుతు భారత కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్ గా మార్చి భారత కార్మిక వర్గం ప్రశ్నించే హక్కు లేకుండా ప్రశ్నించే కార్మికులను ఎలాంటి సమాధానాలు లేకుండా నేరుగా ఉద్యోగం నుండి తొలగించే విధంగా బ్రిటిష్ వారిని మై మరిపించే విధంగా కార్మిక చట్టాలను మారుస్తు కార్మిక వ్యతిరేక. చట్టాలను అమల్పరుస్తూ కార్మిక వర్గాన్ని కట్టుబానిసలుగా మార్చడానికి ప్రయత్నం చేస్తున్నా మోడీ విధానానకు వ్యతిరేకంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు కార్మిక వర్గానికి ఇచ్చిన హామీలను అమలు పర్చాలని నాలుగు లేబర్ కోడ్స్ కు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపియాలని కార్మికులు కార్మిక సంఘాలు ఐక్యంగాక నాలుగు లేబర్ కోడ్స్ ను ఎత్తివేసి29 కార్మిక చట్టాలను అమలుపరిచే వరకు ఉద్యమించాలని పిలుపు నివ్వడం జరిగిందని తెలియజేశారు.


## గ్రామపంచాయతీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి.. జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్





నాగర్ కర్నూల్ నవంబర్ 26(వుదయం ప్రతినిధి)జిల్లాలో సాధారణ గ్రామపంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదల అయినందున అన్ని మండలాలు, గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నికల ప్రవర్తన నియమావళిని అధికారులు పకడ్బందీగా అమలుంచేయాలని నాగర్ కర్నూలు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ గణపట్ రావు పాటిల్, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దేవ సహాయం లతో కలిసి జిల్లా ఎన్నికల అథారిటీ, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ క ఎన్నికల నోడల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి ఎన్నికల ప్రవర్తన నియమావళి, నామినేషన్ల ప్రక్రియపై దిశా నిర్దేశం చేశారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిలో భాగంగా 1977 ఎన్నికల యాక్టు ప్రకారం మొదటి 24, 48, 72 గంటల్లో అమలు చేయాల్సిన నియమాలను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆదేశించారు. నాగర్ కర్నూల్ జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలు మూడు విడుతల్లో నిర్వహించడం జరుగుతుందని, మొదటి విడతలో కల్వకుర్తి, ఊర్కోండ, వెల్దండ ,వంగూరు తాడూరు తెలకపల్లి మండలాల్లోని 151 గ్రామ పంచాయతీల్లో ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని, ఇందుకు గాను రేపు గురువారం ఉదయం 10 లోపు ఫార్మా1 ద్వారా ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసి ఆర్. ఒ కార్యాలయంతో పాటు సంబంధిత 151 గ్రామ పంచాయతీలలో అతికించాల్సి ఉంటుందని ఆదేశించారు. నవంబర్, 27న ఉదయం 10.30 నుండి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని, నామినేషన్లు వేసేందుకు చివరి తేదీ నవంబర్ 29న సాయంత్రం 5.00 గంటలకు ముగుస్తుందన్నారు. నవంబర్ 30న నామినేషన్ల పరిశీలన ఉంటుందని నామినేషన్లు తిరస్కరణకు గురైన వారు డిసెంబర్ 1న ఆర్డీఓ కార్యాలయము అప్పీల్ చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. అభ్యర్థిత్వం ఉపసంహరణ డిసెంబర్ 3న మధ్యాహ్నం 3.00 గంటల లోపు ఉంటుంది. మొదటి విడత ఎన్నికలు డిసెంబర్ 11న ఉదయం 7.00 గంటల నుండి మధ్యాహ్నం 2.00 గంటల వరకు నిర్వహించడం జరుగుతుంది. అదేరోజు ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటించడం జరుగుతుంది. నామినేషన్లు క్లస్టర్ కేంద్రాల్లో రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో మాత్రమే నామినేషన్లు స్వీకరించడం జరుగుతుంది. అభ్యర్థులు ప్రచారం నిర్వహించుకోవడానికి ఉదయం 6 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు అవకాశం ఉంటుందని, లౌడ్ స్పీకర్లు మాత్రం ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6.00 గంటల వరకు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. లౌడ్ స్పీకర్లు, ఇతర సభలు సమావేశాలకు అభ్యర్థులు తహసిల్దార్ నుండి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. మొదటి విడత ఎన్నికలు నిర్వహించే 780 పోలింగ్ కేంద్రాలను ఎంపీడీఓ లు ముందుగానే పరిశీలించి వాటిలో కనీస మౌలిక సదుపాయాలు ఉండే విధంగా చూసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ రోజు నుంచే ఎస్.ఎస్.టి, ఎఫ్.ఎస్.టి బృందాలను ఏర్పాటు చేసి జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి పై నిఘా పెట్టడం జరుగుతుందన్నారు. అధికారులు చాలా జాగ్రత్తగా ఎన్నికల విధులు నిర్వహించాలని, లేని పక్షంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అనుసరించి కఠినంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు.బ్యాలెట్ పత్రాల ప్రింటింగ్, బ్యాలెట్ బాక్స్ ల ఏర్పాట్లను సంబంధిత నోడల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా కాకుండా చూడాల్సిన బాధ్యత ఉంటుందని కలెక్టర్ తెలిపారు. జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ గణపట్ రావు పాటిల్ మాట్లాడుతూ... జిల్లాలో అవసరమైన చెక్ పోస్టులు ఏర్పాటు చేసి ఈరోజు నుంచే నిఘా పెట్టడం జరిగిందని, ఎఫ్.ఎస్.టి., ఎస్.ఎస్.ఎస్.టి బృందాల్లో అనుభవజ్ఞులైన పోలీస్ అధికారులను నియమించినట్లు తెలిపారు. నామినేషన్ కేంద్రంలో వంద మీటర్ల లోపు ఎవరిని అనుమతించబడదని, నామినేషన్ వేసేందుకు వచ్చే అభ్యర్థితో పాటు మరో ఇద్దరు మాత్రమే ఆర్.ఓ కార్యాలయంలో వెళ్లేందుకు అనుమతి ఉంటుందన్నారు. పోలింగ్ రోజున సమస్యాత్మక ప్రాంతాల్లో గట్టి పోలీస్ భద్రత చేయడం జరుగుతుందని, ఎన్నికలు ప్రశాంతంగా పారదర్శకంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ తరపున అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతోందని తెలియజేశారు. ఈ సమావేశంలో జిల్లా ఎన్నికల నోడల్ అధికారులు జిల్లా పంచాయతీ అధికారి శ్రీరాములు, డిప్యూటీ సీఈఓ గోపాల్, సిపిఓ సంధ్యారాణి, డిఇఓ రమేష్ కుమార్, లేబర్ ఆఫీసర్ రాజ్ కుమార్, జిల్లా రవాణా అధికారి చిన్న బాలు నాయక్, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిని రాజేశ్వరి, జిల్లా యువజన క్రీడల అధికారి సీతారాం నాయక్, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి రాజేందర్ సింగ్, జిల్లా సర్వేర్ నాగేందర్, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి యాదగిరి, ఎస్బి సిఐ కనకయ్య, నోడల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ ఎన్నికల ఏర్పాట్లు పూర్తి
## తొలి విడతలో 151 సర్పంచులు, 1326 వార్డు మెంబర్ల స్థానాలకు ఎన్నికలు.. జిల్లా కలెక్టర్

నాగర్ కర్నూల్ నవంబర్ 26(వుదయం ప్రతినిధి)బుధవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (SEC) ఐ. రాణి కుముదిని ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ గణపట్ రావు పాటిల్ , అదనపు కలెక్టర్ దేవ సహాయం డిప్యూటీ సీఈవో గోపాల్ నాయక్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీరాములు,ఇతర ఎన్నికల నోడల్ అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొదటి విడతలో జరిగే గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లు ఎన్నికల నిర్వహణ, మోడల్ ప్రవర్తనా నియమావళి అమలు, లా అండ్ ఆర్డర్ నిర్వహణ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై మొదటి విడతలో జరిగే ఎన్నికల నిర్వహణ గ్రామపంచాయతీ సర్పంచ్, వార్డు మెంబర్ల ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లా ఎన్నికల యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆమె కలెక్టర్లును ఆదేశించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో ఎన్నికల నిర్వహణ, మోడల్ ప్రవర్తనా నియమావళి అమలు, లా అండ్ ఆర్డర్ పరిస్థితుల పర్యవేక్షణ వంటి అంశాలపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.ఈ నెల 27వ తేదీ నుండి తొలి విడుదల జరిగే ఎన్నికల నామినేషన్ ప్రక్రియను సజావుగా సాగేందుకు పోలీస్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. జిల్లా కలెక్టర్లకు ఎస్పీలకు పలు సూచనలు సలహాలు అందించారు.వీడియో కాన్ఫరెన్స్‌లోపాల్గొన్నా నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ.... నాగర్ కర్నూల్ జిల్లాలోని 20 మండలాల్లో 460 జీపీలు, 4,102 వార్డు వున్నాయని. డిసెంబర్ 11వ తేదీన నిర్వహించే గ్రామ పంచాయతీ ఎన్నికల మొదటి విడతలో కల్వకుర్తి, ఊర్కోండ, వెల్దండ, వంగూరు, తాడూరు, తెలకపల్లి 6 మండలాల్లోని 151 గ్రామపంచాయతీలు, 1326



వార్డులు, డిసెంబర్ 14వ తేదీన నిర్వహించే గ్రామ పంచాయతీ ఎన్నికల రెండో విడతలో బిజినపల్లి, నాగర్ కర్నూల్, తిమ్మాజిపేట, కొల్లాపూర్, పెంట్లవెల్లి, కోడేరు, పెద్ద కొత్తపల్లి 7 మండలాల్లోని 151 గ్రామపంచాయతీలు, 1412 వార్డులు, అదేవిధంగా డిసెంబర్ 17వ తేదీన నిర్వహించే గ్రామ పంచాయతీ ఎన్నికల మూడో విడతలో అచ్చంపేట, అమ్రాబాద్, బల్మూర్, లింగాల, పదరా, ఉప్పునుంతల, చారకొండ 7 మండలాల్లోని 158 గ్రామపంచాయతీలు, 1364 వార్డులకు రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన ఎన్నికల షెడ్యూల్ ప్రకారం నాగర్ కర్నూల్ జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికలను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు.గ్రామపంచాయతీ ఎన్నికలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని, నామినేషన్ల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు ఎన్నికల సిబ్బందికి శిక్షణ తరగతులను అందించి ఎన్నికల ప్రక్రియ నిర్వహణ ఏర్పాట్లపై ప్రత్యేక శ్రద్ధ వహించేలా చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ వివరించారు. జిల్లాలో మొదటి విడతలో 151 సర్పంచుల స్థానాలకు, 1326 వార్డు మెంబర్ల, స్థానాలకు జరిగే ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేయడం జరిగిందని కలెక్టర్ వివరించారు. ఎన్నికల నిర్వహణలో బాధ్యతలు నిర్వహించే రిటర్నింగ్ అధికారులకు శిక్షణ తరగతుల ద్వారా స్పష్టమైన ఎన్నికలకు సంబంధించిన అన్ని అంశాలను క్షుణ్ణంగా అవగాహన కల్పించడం జరిగిందని,నామినేషన్ల ప్రక్రియకు సంబంధించిన ప్రక్రియను తాను అధికారులు సందర్శించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.నేడు ఎన్నికల అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు కలెక్టర్ ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల అధికారికి వివరించారు. జిల్లాలో గుర్తించిన సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలకు ఎస్ ఎస్ టి, వి ఎస్ టి టీముల తోపాటు వీడియో చిత్రీకరణ ఏర్పాట్లు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. తొలి విడత ఎన్నికలకు 46 క్లస్టర్లలో రేపు గురువారం నామినేషన్ల ప్రక్రియ స్వీకరించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ ఈ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివరించారు.

## బీసీ రిజర్వేషన్లపై మాట తప్పిన కాంగ్రెస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఎం శ్రీనివాస్ సాగర్

మహబూబ్ నగర్ నవంబర్ 26 (వుదయం ప్రతినిధి)బిసి రిజర్వేషన్ల విషయంలో రేవంత్ సర్కార్ అన్ని తెలిసి బీసీలకు ఆశలు రేపి మాటతప్పి నయవంచనకు గురి చేసిందని బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి,ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షుడు మోడల శ్రీనివాస్ సాగర్ అన్నారు. బీసీ సమాజ్ ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ కామారెడ్డి డిక్లరేషన్లో 42 శాతం బీసీలకు చట్టబద్ధంగా రిజర్వేషన్లు ఇచ్చిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తామని, ప్రకటించి బీసీలను మోసం చేసిందన్నారు.అధికారంలోకి రావడానికి బీసీలను వాడుకొని తర్వాత బీసీలను మోసం చేసి 46 జీవోను తీసుకొచ్చి 17.08 శాతానికి పరిమితం చేసిన కాంగ్రెస్ పార్టీకి బీసీ సమాజం తగిన బుద్ధి చెప్తుంది అన్నారు.


కామరెడ్డి డెకరేషన్ పేరిట తర్వాత కుల సర్వే అని బిల్లుల అని తర్వాత ఢిల్లీలో ధర్నా, ఆర్డినెన్స్, జీవోల పేరిట అడుగడుగునా ఇష్ట రాజ్యాంగ ముందుకు పోయి చట్టాలను కోర్టు తీర్పుల నిబంధనలకు విరుద్ధంగా ముందుకెళ్లి ఈరోజు బీసీలను మోసం చేసిందనీ ఆరోపించారు. రేవంత్ మంత్రి మండలీ లోని బీసీ మంత్రులందరూ 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పి ఈరోజు 17.08 శాతానికి పరిమితి చేసిన మీరు బీసీ సమాజానికి ఏమి సమాధానం చెప్తారని ఆయన ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా యూత్ అధ్యక్షుడు పాలమూర్ వెంకటేష్ గౌడ్, బీసీ సమాజ్ మహబూబ్ నగర్ నియోజకవర్గ కన్వీనర్ చిట్లపల్లి దుర్గేష్, బీసీ సమాజ్ దేవరకద్ర నియోజకవర్గ కన్వీనర్ బుదిరి శేఖర్ పాల్గొన్నారు.

# జిన్‌పింగ్‌తో డొనాల్డ్ ట్రంప్ ఫోన్ కాల్.. ఏం మాట్లాడుకున్నారంటే?



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఈ విషయాన్ని ట్రంప్ తన సోషల్ మీడియాలో వెల్లడించారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్-రష్యా యుద్ధం, ఫెంటనిల్ (మత్తుమందు), సోయాబీన్స్, ఇతర వ్యవసాయ ఉత్పత్తులతో సహా పలు కీలక అంశాలపై చర్చించినట్లు తెలిపారు. ''చైనాతో మా సంబంధం చాలా బలంగా ఉంది'' అని ట్రంప్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. మూడు వారాల క్రితం దక్షిణ కొరియాలో జరిగిన సమావేశం తర్వాత ఈ సంభాషణ జరిగిందని, అప్పటి నుంచి ఇరువైపులా ఒప్పందాల అమలులో గణనీయమైన పురోగతి కనిపించిందని ట్రంప్ తెలిపారు. ఈ సంభాషణల కొనసాగింపుగా జిన్‌పింగ్ ఇచ్చిన ఆహ్వానాన్ని ట్రంప్ అంగీకరించారు. ఈ క్రమంలోనే వచ్చే ఏడాది ఏప్రిల్‌లో తాను బీజింగ్ సందర్శనకు వెళ్లనున్నట్లు ప్రకటించారు. ఆ తర్వాత 2026 చివర్లో జిన్‌పింగ్ కూడా స్టేట్ విజిట్ కోసం అమెరికాకు తన అతిథిగా వస్తారని ట్రంప్ తెలిపారు. ఇరు దేశాల నాయకులు తరచుగా సంభాషించుకోవడం చాలా ముఖ్యమని అంగీకరించామని, ఇది ద్వైపాక్షిక సంబంధాలలో లక్ష్యంగా చేసుకోవడానికి సహాయపడుతుందని ట్రంప్ స్పష్టం చేశారు.

# 12 వేల ఏళ్ల తర్వాత అగ్నిపర్వతం బద్దలు.. భారత్‌పైనా ప్రభావం!



ఇథియోపియాలోని ఎర్టా ఆలే శ్రేణిలో ఉన్న హైలే గుబ్బి అనే అగ్నిపర్వతం సోమవారం అకస్మాత్తుగా విస్ఫోటనం చెందింది. గత 12 వేల సంవత్సరాలలో ఈ అగ్నిపర్వతం పేలడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఈ విస్ఫోటనం కారణంగా భారీగా బూడిద, లావా వెదజల్లుతోంది. టౌలౌస్ వొల్కాలిన్ యాష్ అడ్వైజరీ సెంటర్ ఈ విషయాన్ని ధ్రువీకరించింది. అగ్నిపర్వతం 15 కిలోమీటర్ల ఎత్తు వరకు లావాను వెదజల్లినట్టు తెలిపింది. దీని నుంచి వెలువడిన బూడిద ఎర్ర సముద్రం మీదుగా ఒమన్, యెమెన్ వైపు విస్తరించింది. దీంతో ఆయా దేశాల అధికారులు అప్రమత్తమయ్యారు. పలు విమానాలను దారి మళ్లించగా, కొన్నింటిని రద్దు చేశారు. అగ్నిపర్వతం విస్ఫోటన ప్రభావం భారత్‌పైనా పడే అవకాశం ఉందని, ముఖ్యంగా ఉత్తర భారత్‌పై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ అగ్నిపర్వత వెదజల్లుతున్న బూడిద ఢిల్లీ, పంజాబ్, హర్యానాకు చేరుకునే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ విమానయాన సంస్థలకు అడ్వైజరీ జారీ చేసింది. రన్‌వేలను పరిశీలించాలని, అవసరమైతే విమాన కార్యకలాపాలను నిలిపివేయాలని ఆదేశించింది. ఇప్పటికే కాలుష్యంతో సతమతమవుతున్న ఢిల్లీలో బూడిద వ్యాపిస్తే పొల్యూషన్ మరింత పెరుగుతుందని ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి.

# 'బాంబు పేలినట్లే అనిపించింది'': ఇథియోపియా అగ్నిపర్వత విస్ఫోటనంపై ప్రత్యక్ష సాక్షి

సుమారు 12,000 సంవత్సరాలుగా నిద్రాణమై ఉన్న అగ్నిపర్వతం ఒక్కసారిగా విస్ఫోటనం చెందడంతో ఇథియోపియాలోని ఈశాన్య ప్రాంతంలో తీవ్ర కలకలం రేగింది. హేలీ గుబ్బి అగ్నిపర్వతం ఆదివారం రోజు ఉదయం పలు గంటల పాటు విస్ఫోటనం చెంది.. ఒక్కసారిగా దట్టమైన పొగ, బూడిదను ఎగజల్లింది. దీంతో సుమారు 14 కిలో మీటర్ల (9 మైళ్లు) ఎత్తుకు బూడిద లేసింది. ఈ బూడిద మేఘాలు ఎర్ర సముద్రాన్ని దాటి యెమెన్, ఒమన్ దేశాల వైపు ప్రయాణిస్తున్నాయి. అయితే ఈ విస్ఫోటనాన్ని కళ్లారా చూసిన ఓ వ్యక్తి.. నిజంగానే బాంబు పేలిందని తాను భావించినట్లు చెప్పారు. భూకంపాలు తరచుగా సంభవించే అఫార్ ప్రాంతంలో ఈ అగ్నిపర్వతం విస్ఫోటనంచెందడం స్థానికులను భయభ్రాంతులకు గురి చేసింది. అగ్నిపర్వతం పేలిన వెంటనే పెద్ద శబ్దం, ఒక విధమైన షాక్ వేవ్ వచ్చిందని స్థానిక నివాసి అహ్మద్ అబ్దేలా తెలిపారు. ''అకస్మాత్తుగా బాంబు పేలినట్లు అనిపించింది. ఈ ప్రాంతమంతా పొగ, బూడిదతో నిండిపోయింది'' అని ఆయన విస్ఫోటనం గురించి భయానక అనుభవాన్ని వివరించారు. ఈ విస్ఫోటనం కారణంగా.. సమీపంలోని అఫ్‌డెరా గ్రామం మొత్తం సోమవారం కూడా దట్టమైన బూడిదతో నిండిపోయింది. ఈ ప్రాంతం సాధారణంగా పర్యాటకులకు, ముఖ్యంగా సమీపంలో ఉన్న ప్రఖ్యాత దనకిల్ ఎడారికి వెళ్లే గైడ్‌లకు, పర్యాటకులకు కేంద్రంగా ఉంటుంది.

ప్రస్తుతం ఆ గ్రామంలో పర్యాటకులు, గైడ్‌లు చిక్కుకుపోయినట్లు అబ్దేలా వెల్లడించారు. అదృష్టవశాత్తు ఈ విస్ఫోటనం కారణంగా ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదని స్థానిక పరిపాలనా అధికారి మొహమ్మద్ సెయిద్ తెలిపారు. అయితే ఈ విపత్తు స్థానిక ప్రజల ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అఫార్ ప్రాంతంలోని చాలా మంది ప్రజలు ప్రధానంగా పశువుల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. బూడిద మేఘాలు పచ్చిక బయళ్లపై పడటం వలన పశువుల మేత, తాగునీరు కలుషితమై.. స్థానిక ఆర్థిక వ్యవస్థకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని తెలిపారు.

## బురఖాలో పార్లమెంటుకు.. సస్పెన్షన్ వేటు!

ఆస్ట్రేలియా పార్లమెంటులో బురఖా వివాదం తీవ్ర చర్చకు దారితీసింది. వన్ నేషన్ మైనర్ పార్టీ నేత, 71 ఏళ్ల సెనేటర్ పౌలీన్ హాన్సన్ బురఖా ధారణపై నిషేధం విధించాలనే బిల్లును తాజాగా ప్రతిపాదించారు. అయితే ఇతర సెనేటర్లు ఆ బిల్లును తిరస్కరించడంతో హాన్సన్ నిరసనగా బురఖా ధరించి పార్లమెంట్ సమావేశానికి హాజరయ్యారు.ఈ చర్యను పార్లమెంట్ నియమావళి ఉల్లంఘనగా పేర్కొంది. దాంతో ఆమెపై సస్పెన్షన్ వేటు వేసి, వరుసగా ఏడు రోజుల పాటు సెనేట్ సమావేశాలకు హాజరుకాకుండా నిషేధించింది. అధికారిక ప్రకటన ప్రకారం, ఆమెపై సస్పెన్షన్ వచ్చే సంవత్సరం ఫిబ్రవరిలో పార్లమెంట్ తిరిగి ప్రారంభమయ్యే వరకు కొనసాగనుంది. పౌలీన్ హాన్సన్ గతంలోనూ వలసదారులు, ముస్లింలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసినందుకు విమర్శల పాలయ్యారు. ఈసారి బురఖా ధరించి పార్లమెంట్ హాలులోకి వెళ్లడం విపరీత చర్చకు దారితీసింది. కొందరు దీన్ని మత స్వేచ్ఛకు అవమానమని పేర్కొంటే, మరికొందరు ఇది భద్రతా ప్రశ్నలను వెలుగులోకి తెచ్చిందని అభిప్రాయపడ్డారు. ఈ ఘటనతో ఆస్ట్రేలియాలో స్వేచ్ఛ, సమాన హక్కులు, రాజకీయ నిరసనల పరిమితులపై మరోసారి జాతీయ స్థాయిలో చర్చ మొదలైంది.

## ఆ దేశంలో 16 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియా బ్యాన్

మలేషియా ప్రభుత్వం 16 ఏళ్లలోపు పిల్లలు సోషల్ మీడియా ఉపయోగించకుండా నిషేధం విధించే నిర్ణయం తీసుకుంది. ఈ కొత్త చట్టం 2026లో అమల్లోకి రానుంది. సైబర్ నేరాలు, ఆన్లైన్ వేధింపులు, మోసాలు, మానసిక ఆరోగ్య సమస్యల నుంచి బాలలను రక్షించడమే దీనికి ప్రధాన ఉద్దేశం అని అధికారులు తెలిపారు. మలేషియా కమ్యూనికేషన్స్ అండ్ డిజిటల్ మంత్రిత్వ శాఖ ప్రకారం, చిన్నారులు సోషల్ మీడియా అకౌంట్లు ఓపెన్ చేయకుండా నిరోధించడానికి ప్రత్యేక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించనున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను సోషల్ మీడియా వేదికలకు అనుమతిస్తే, వారిపై కూడా జరిమానా విధించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఆన్‌లైన్ ప్రపంచంలో పెరుగుతున్న ప్రమాదాలు, వ్యసనాలు, అనుచిత కంటెంట్ పిల్లలపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. ఈ నేపథ్యంలో మలేషియా తీసుకున్న నిర్ణయం అంతర్జాతీయ దృష్టిని ఆకర్షిస్తోంది. ఇటీవలే ఆస్ట్రేలియాలో కూడా టీనేజ్ వయస్కులకు సోషల్ మీడియా యాక్సెస్‌పై పరిమితులు విధించాలని ప్రభుత్వాలు నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ చర్యలు ప్రపంచవ్యాప్తంగా చిన్నారుల ఆన్లైన్ భద్రతపై ప్రభుత్వాలు చూపుతున్న నూతన అవగాహనకు నిదర్శనంగా భావిస్తున్నారు.

# ఇజ్రాయెల్ ప్రధానిపై ఢిల్లీ పేలుడు ఘటన ఎఫెక్ట్ మూడోసారి ఆ కీలక పర్యటన రద్దు




ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు భారత్ పర్యటన మరోసారి వాయిదా పడింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో సమావేశం కోసం ఈ ఏడాది చివర్లో షెడ్యూల్ చేసిన ఈ పర్యటన.. రెండు వారాల క్రితం న్యూఢిల్లీలో జరిగిన భయంకరమైన ఆత్మాహుతి దాడి నేపథ్యంలో భద్రతాపరమైన ఆందోళనల కారణంగా రద్దు అయింది. అయితే ఈ పర్యటన రద్దు కావడం ఇదే తొలిసారి కాదు. గతంలోనే రెండు సార్లు పలు కారణాల వల్ల నెతన్యాహు భారత పర్యటన రద్దయింది. భారత దేశానికి రావాలన్న నెతన్యాహు ప్రణాళిక ఈ ఏడాది రద్దు కావడం ఇది మూడోసారి. దీనికి సంబంధించి ఇజ్రాయెల్ మీడియా సంస్థ ఓ నివేదిక విడుదల చేసింది. భద్రతా పరిస్థితులపై తాజా అంచనాల తర్వాత నెతన్యాహు వచ్చే ఏడాది కొత్త తేదీని ఖరారు చేసుకునే అవకాశం ఉందని ఆ నివేదిక పేర్కొంది. నెతన్యాహు 2018 జనవరిలో భారత్‌లో పర్యటించారు. గత కొంత కాలంగా ఇరు దేశాల ప్రధానులైన మోదీ, నెతన్యాహు మధ్య బలమైన వ్యక్తిగత సాన్నిహిత్యం ఏర్పడింది. 2017లో మోదీ ఇజ్రాయెల్‌లో పర్యటించిన తొలి భారత ప్రధానిగా నిలిచారు. ఈ సన్నిహిత సంబంధాల గురించి భారత, ఇజ్రాయెల్ పత్రికల్లో తరచుగా చర్చ జరుగుతుంటుంది. ఈ పర్యటన నెతన్యాహు రాజకీయ వ్యూహంలో కూడా కీలకమైంది. ఇజ్రాయెల్‌లో అసాధారణంగా పదేపదే ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో.. నెతన్యాహు ప్రపంచ వ్యాప్తంగా తనకున్న మద్దతును ప్రదర్శించడానికి ఈ పర్యటనను ఉపయోగించుకోవాలని భావించారు. గతంలో ఏప్రిల్‌లో, ఆపై సెప్టెంబర్ 9వ తేదీన ఇజ్రాయెల్‌లో జరిగిన అసాధారణ పునః-ఎన్నికల కారణంగా ఆయన తన పర్యటనలను రద్దు చేసుకున్నారు.

# 'ముస్లిం బ్రదర్‌హుడ్' సంస్థలకు ట్రంప్ షాక్



అరబ్ ప్రపంచంలో అత్యంత పురాతనమైన, ప్రభావవంతమైన ఇస్లామిక్ ఉద్యమంగా పరిగణించే 'ముస్లిం బ్రదర్‌హుడ్' సంస్థలకు.. అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు గట్టి షాక్ ఇచ్చారు.ముఖ్యంగా ఈ సంస్థను 'విదేశీ ఉగ్రవాద సంస్థ'గా ముద్ర వేసేందుకు అవసరమైన చర్యలను చేపట్టారు. ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయం కారణంగా అరబ్ ప్రపంచంలో ఈ సంస్థ కార్యకలాపాలపై తీవ్ర ఆంక్షలు పడే అవకాశం ఉంది. వైట్‌హౌస్ ఫ్యాక్ట్ షీట్ ద్వారా వెల్లడైన వివరాల ప్రకారం.. ఈ నిర్ణయానికి సంబంధించి విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో, ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్లకు ట్రంప్ ఆదేశాలు జారీ చేశారు. లెబనాన్, ఈజిప్ట్, జోర్డాన్ వంటి దేశాలలో ఉన్న ముస్లిం బ్రదర్‌హుడ్ అనుబంధ సంస్థలపై చర్యలు తీసుకునే విధంగా ఒక సమగ్ర నివేదికను సమర్పించాలని ఆదేశించారు. ఈ నివేదిక అందిన తర్వాత.. 45 రోజుల్లోపు ఆ సంస్థలపై ఎలాంటి ముద్ర వేయాలనే అంశంపై మంత్రులు ముందుకు వెళ్లాలని కార్యనిర్వాహక ఉత్తర్వుల్లో ట్రంప్ స్పష్టం చేశారు. ఈ ఉత్తర్వులపై ఇప్పటికే ఆయన సంతకాలు చేశారు. ముస్లిం బ్రదర్‌హుడ్ నెట్‌వర్క్‌పై చర్యలు తీసుకోవడానికి ట్రంప్ పరిపాలన గట్టి కారణాలను చూపిస్తోంది. ఈ సంస్థ అనుబంధ విభాగాలు ఇజ్రాయెల్, అమెరికా భాగస్వాములపై హింసాత్మక దాడులకు మద్దతు ఇవ్వడం, ప్రోత్సహించడం వంటి కార్యకలాపాలను ప్రోత్సహిస్తున్నాయని ట్రంప్ ప్రభుత్వం ఆరోపించింది. ముఖ్యంగా ఈ సంస్థ మిలిటెంట్ గ్రూప్ హమాస్‌కు మద్దతుగా వ్యవహరిస్తోందని పేర్కొంది. వైట్‌హౌస్ ఫ్యాక్ట్ షీట్ ప్రకారం..''ఈ ముస్లిం బ్రదర్‌హుడ్ నెట్‌వర్క్‌పై చర్యలు తీసుకోవాలని ట్రంప్ నిర్ణయించుకున్నారు. ఇది పశ్చిమాసియాలో అమెరికా ప్రయోజనాలు, మిత్ర దేశాలకు వ్యతిరేకంగా ఉగ్రవాదం, అస్థిరత ప్రచారాలకు ఆజ్యం పోస్తుంది'' అని వివరించింది. ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయాన్ని ఈజిప్ట్‌తో సహా అనేక అరబ్ ప్రభుత్వాలు స్వాగతించే అవకాశం ఉంది.

# పార్లమెంట్‌లో అంబేద్కర్, రాజేంద్ర ప్రసాద్ సేవలను కొనియాడిన స్పీకర్ ఓం బిర్లా



న్యూఢిల్లీ: భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా పార్లమెంట్‌లో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కీలక ప్రకటన చేశారు. ఢిల్లీలోని 'సంవిధాన్ సదన్'లో జరిగిన వేడుకల్లో పాల్గొన్న ఆయన, దేశ ప్రజలందరికీ భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాజ్యాంగ పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ బాబు రాజేంద్ర ప్రసాద్, రాజ్యాంగ ప్రధాన రూపశిల్పి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సేవలను ఆయన గౌరవపూర్వకంగా స్మరించుకున్నారు. అంబేద్కర్ అసాధారణ జ్ఞానం, దార్శనికత, నిరంతర కృషి ఫలితంగానే దేశంలోని ప్రతి పౌరుడికి న్యాయం, సమానత్వం, సౌభ్రాతృత్వం, గౌరవం, ఆత్మగౌరవాన్ని హామీ ఇచ్చే గొప్ప రాజ్యాంగం లభించిందని ఓం బిర్లా కొనియాడారు. కాగా ప్రతి సంవత్సరం నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవం జరుపుకోవడం యొక్క ప్రాముఖ్యతను ఈ ప్రకటన మరోసారి నొక్కి చెప్పింది. రాజ్యాంగ రూపకల్పనలో కీలక పాత్ర పోషించిన మహనీయుల ఆశయాలను, రాజ్యాంగ స్ఫూర్తిని ఈ సందర్భంగా దేశ ప్రజలందరూ గుర్తు చేసుకోవాలని స్పీకర్ కోరారు. పౌరులందరికీ గ్యారెంటీగా లభించే హక్కులు, గౌరవానికి మూలమైన రాజ్యాంగం విలువలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని స్పీకర్ ఓం బిర్లా ఈ సందర్భంగా తన సందేశంలో పరోక్షంగా స్పష్టం చేశారు.

# సీఎం పీఠంపై పట్టువీడని డీకే శివకుమార్.. రంగంలోకి రాహుల్ గాంధీ




న్యూఢిల్లీ: కర్ణాటక రాష్ట్రంలో సీఎం పదవి మార్పు పై జోరుగా చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రిగా ఉన్న సిద్ధరామయ్య కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయిస్తే తాను సీఎంగా కొనసాగుతానని, నాయకత్వ మార్పుపై తుది నిర్ణయం హైకమాండ్‌దేనని ఆయన తెలిపారు. కానీ మరోపక్క డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, ఆయన తరఫున ఎమ్మెల్యేలు మాత్రం ఇందుకు అంగీకరించడం లేదు. దీంతో కర్ణాటక ముఖ్యమంత్రి మార్పుపై గత ఐదు రోజులుగా కొనసాగుతున్న ఉత్కంఠ ఇప్పుడు కాంగ్రెస్ హైకమాండ్ వద్ద మరింతగా కేంద్రీకృతమైంది. ఈ సుదీర్ఘ రాజకీయ పంచాయతీపై కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఆయన కర్ణాటకకు చెందిన పలువురు మంత్రులు, సీనియర్ నేతలతో విస్తృత చర్చలు జరిపారు. అయితే, ముఖ్యమంత్రి పదవిని దక్కించుకోవాలనే విషయంలో ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఏ మాత్రం పట్టు విడవక పోవడం, అధిష్టానానికి పెద్ద సవాలుగా మారింది. ఈ కీలక పరిణామాల మధ్య ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా ఢిల్లీ చేరుకున్నారు. నిన్న మొత్తం కాంగ్రెస్ హైకమాండ్ కర్ణాటక అంశంపైనే లోతుగా చర్చలు జరిపింది. ముఖ్యమంత్రి మార్పు- అధికార పంపిణీకి సంబంధించి ఒక తుది నిర్ణయానికి రావడానికి కాంగ్రెస్ అగ్ర నాయకత్వం ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తుంది. ఈ క్రమంలో, త్వరలోనే ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, డీకే శివకుమార్‌లను ఢిల్లీకి పిలిపించి నేరుగా చర్చలు జరిపే అవకాశం ఉన్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. కర్ణాటక రాజకీయ సంక్షోభానికి మరో రెండు మూడు రోజుల్లో తెర పడుతుందని, అంతర్గత చర్చల ద్వారా ఒక పరిష్కారం లభిస్తుందని పార్టీ నాయకత్వం ధీమా వ్యక్తం చేస్తోంది.

# జుబీన్ గార్గ్‌ది హత్యే: అస్సాం సీఎం



అసోం: అస్సాం రాష్ట్రంలో అత్యంత ప్రజాదరణ పొందిన గాయకుడు జుబీన్ గార్గ్‌ది హత్యా, ప్రమాద వశాత్తు సంభవించిన మరణమా అని తేల్చేందుకు దర్యాప్తు సంస్థలు తీవ్రంగా కృషి చేస్తున్నాయి.ఇలాంటి సమయంలోనే అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ అసెంబ్లీలో.. ఓ సంచలన ప్రకటన చేశారు. జుబీన్ గార్గ్‌ది ప్రమాద వశాత్తు సంభవించిన మరణం కాదని, ఆయనను కావాలనే హత్య చేశారంటూ సీఎం అసెంబ్లీ వేదికగా స్పష్టం చేశారు. జుబీన్ మృతిపై చర్చించేందుకు ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన వాయిదా తీర్మానం సందర్భంగా సీఎం ఈ మేరకు షాకింగ్ కామెంట్లు చేశారు. 52 ఏళ్ల గాయకుడు జుబీన్ గార్గ్ సెప్టెంబర్ 19న సింగపూర్‌లో మరణించారు. స్కూబా డైవింగ్ చేస్తున్న సమయంలో జరిగిన ప్రమాదంలో ఆయన ప్రాణాలు కోల్పోయినట్లు తొలుత వార్తలు వచ్చాయి. అయితే ఆయన మరణంపై మొదటి నుంచీ పలు అనుమానాలు వ్యక్తం అయ్యాయి. గాయకుడికి అంతర్జాతీయ స్థాయిలో ఉన్న అభిమానుల నుంచి, రాజకీయ వర్గాల నుంచి కూడా ఈ మృతిపై పూర్తి స్థాయి దర్యాప్తు జరిపించాలని డిమాండ్లు వచ్చాయి. ఈక్రమంలోనే పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ కేసుతో సంబంధం ఉన్న అనేక మందిని అరెస్ట్ చేసి విచారిస్తున్నారు. ఇద్దరు పోలీసు అధికారులు సహా అనేక మందిని ఇప్పటికే విచారించారు. ఇంకా ఈ కేసు దర్యాప్తు కొనసాగుతూనే వస్తోంది. ఇలాంటి సమయంలోనే సీఎం హిమంత బిశ్వ శర్మ చేసిన హత్య వ్యాఖ్య.. అస్సాం రాజకీయాల్లో, సంగీత అభిమానుల మధ్య తీవ్ర ప్రకంపనలు సృష్టించింది. జుబీన్ గార్గ్ ప్రమాదవశాత్తూ చనిపోలేదని, ఆయన్ని ఎవరో కావాలనే హత్య చేశారని ఆయన అసెంబ్లీలో స్పష్టం చేయడంతో.. ఈ కేసు దర్యాప్తుపై మరింత ఒత్తిడి పెరిగింది.

# ఓటమి భయంతోనే మమతా బెనర్జీ రాజ్యాంగంపై అనుచిత వ్యాఖ్యలు



న్యూఢిల్లీ: తనను టార్గెట్ చేస్తే దేశాన్ని షేక్ చేస్తా అంటూ పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల సంఘం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఎస్ఐఆర్ కి వ్యతిరేకంగా బొంగావ్‌లో జరిగిన ర్యాలీలో ఆమె మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ర్యాలీ చేపడుతానని అన్నారు. బీజేపీ కేంద్ర ఎన్నికల సంఘానికి నిబంధనలు విధిస్తోందని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలపై బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ స్పందించి కౌంటర్ ఎటాక్‌చేశారు. పశ్చిమ బెంగాల్‌లో మార్పు ఖాయం అయిందని, మమతా బెనర్జీ ఓటమి భయంతోనే రాజ్యాంగంపై అనుచిత వ్యాఖ్యలు చేశారని బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ తీవ్రంగా స్పందించారు. బెంగాల్ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, మమతా బెనర్జీని గద్దె దించడానికి సిద్ధంగా ఉన్నారని ఈ సందర్భంగా అనురాగ్ ఠాకూర్ స్పష్టం చేశారు. ఆయన మీడియాతో మాట్లాడు తూ.. బెంగాల్ సీఎం ''మమతా బెనర్జీ లో కనిపిస్తున్న భయాందోళన, అసహనం ఆమె ఓటమికి సంకేతం. ఎన్నికలకు ముందే ఆమె ఓటమి ఖాయమైందని అర్థమవుతుంది,'' అని అనురాగ్ ఠాకూర్ అన్నారు. ''ఇది అవినీతి, హింస పతాక స్థాయికి చేరిన రాష్ట్రం. ఇక్కడ చొరబాటుదారులకు రక్షణ కల్పిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆమె ఓటమి స్పష్టంగా కనిపిస్తుంది. అందుకే ఆమె ఇలాంటి ప్రకటనలు చేస్తూ, సాకులు వెతుక్కుంటున్నారు,'' అని విమర్శించారు. బీహార్ ఎన్నికల ముందు రాహుల్ గాంధీ కూడా ఇలాగే సాకులు చెప్పారని, కానీ బీహార్ ప్రజలు ఎన్డీఏకి చారిత్రక తీర్పు ఇచ్చారని ఠాకూర్ గుర్తు చేశారు. ''బీహార్‌ను గెలిచాంబీ ఇప్పుడు బెంగాల్ వంతు,'' అని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# ఘోర రోడ్డు ప్రమాదం..ఐదుగురు మృతి

లక్నో: హైవేపై వెళ్తున్న కారు అదుపుతప్పి కాలువలో పడిపోవడంతో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. ఈ దుర్ఘటన ఉత్తర ప్రదేశ్‌లోని లఖింపూర్ ఖేరీ జిల్లాలో బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ధఖేర్వా గిరిజా పూరి హైవేపై వేగంగా వెళ్తున్న ఓ కారు అదుపుతప్పి కాలువలోకి పడిపోయింది. ఈ దుర్ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఐదుగురు వ్యక్తులు దుర్మరణం పాలయ్యారు. అలాగే మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే స్థానిక యంత్రాంగం, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు. ఈ రోడ్డు ప్రమాదంపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వ్యక్తికి మెరుగైన వైద్య చికిత్స అందించాలని, అలాగే సహాయక చర్యలను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి కార్యాలయం ద్వారా ఆయన స్థానిక యంత్రాంగాన్ని ఆదేశించారు. ఈ విషాద ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు ప్రారంభించారు.


# సంపాదకీయం

## పేదల విద్యకు.. నిధుల కొరతా?

ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ఉన్నత విద్య అనేది ఇప్పటికీ ఒక కల. ఆ కలను సాకారం చేయడానికి ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన ముఖ్యమైన సంక్షేమ పథకం ఫీజు రీయింబర్స్‌మెంట్. ఇది పుట్టుకతోనే సామాజిక న్యాయానికి పునాదులు వేసిన పథకం. పేద విద్యార్థుల చదువు డబ్బుల కొరతతో ఆగిపోకూడదని, ప్రతిభకు అవకాశాల ద్వారాలు తెరవాలనే లక్ష్యంతో ప్రారంభమైంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో2008లో ప్రారంభమైన ఈ పథకం నేడు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఈ పథకం ఆయా రాష్ట్రాల స్వంత పంథాలో నడుస్తోంది. ఈ పథక లక్ష్యం 'విద్య పేదలకు చేరాలంటే, డబ్బు అడ్డంకి కాకూడదు' అందుకే సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో చేరి ఉన్నత విద్య పొందేలా ప్రభుత్వమే ఫీజు భారం భరించాలనే ఆలోచన నుంచి ఇది రూపుదిద్దుకుంది. ఈ పథకం వల్ల లక్షలాది విద్యార్థులు వివిధ ప్రొఫెషనల్ కోర్సుల్లో ప్రవేశం పొందారు. ఈ పథకం వలన ప్రైవేటు కాలేజీలు కూడా వీరికి ప్రభుత్వ భాగస్వామ్య విద్యా కేంద్రాలుగా మారాయి. ఈ రీయింబర్స్మెంట్ వల్ల సమాజంలో కొన్ని గమనించదగ్గ మార్పులు చోటుచేసుకున్నాయి. పేద కుటుంబాల పిల్లలు ఇప్పుడు ప్రొఫెషనల్ కోర్సులు చదవగలుగుతున్నారు. ఉన్నత చదువు కారణంగా వారికి వృత్తి అవకాశాలు లభించి, పేదరికం నుంచి బయటపడి మధ్యతరగతిలోకి రావడం మొదలైంది. చిన్న ఊర్లలో, మారుమూల తండాల్లో, గిరిజన గూడాల్లో కూడా ఉన్నత విద్యపై ఆసక్తి పెరిగింది. పేద అమ్మాయిలను చదివించడంలో తల్లిదండ్రులు ముందుకు వస్తున్నారు. ఇటీవలి సంవత్సరాల్లో ఫీజురీయింబర్స్‌మెంట్ పథకానికి ప్రభుత్వాల నుండి నిధుల విడుదలలో భారీ ఆలస్యం జరుగుతుంది. కాలేజీలకు రెండు, మూడేళ్ల బకాయిలు పెండింగ్‌లో ఉండటం సాధారణమైపోయింది. ఈ పరిస్థితి విద్యార్థులకు, కాలేజీలకు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు తెచ్చింది. ప్రభుత్వ బడ్జెట్ లోటు, ఎన్నికల ప్రాధాన్యతలు మారడం, రుణాల బరువుతో రాష్ట్ర ఆర్థిక స్థితి దెబ్బతినడం, పథకాన్ని సరైన గణాంకాల ఆధారంగా ప్రణాళిక చేయకపోవడం, అధికార యంత్రాంగంలో ఆలస్యం, ఫైల్ ప్రాసెసింగ్‌లో నిర్లక్ష్యం ఈ పరిస్థితికి కారణాలు. దీని ఫలితంగా విద్యార్థులు సర్టిఫికేట్‌లు అందుకోలేక, ఉన్నత చదువులకు దరఖాస్తు చేయలేక, ఉద్యోగాల ఎంపికలో వెనుకబడుతున్నారు.ప్రభుత్వానికి సమాంతరంగా విద్యా సేవ అందిస్తున్న ప్రైవేటు కాలేజీలు ఎందుకు వివక్షకు గురవుతున్నాయి అనేదే ఇప్పుడు ప్రశ్న. ఇవి ప్రభుత్వం కోసం విద్యా భాగస్వాములుగా పని చేస్తున్నాయి. పేద విద్యార్థులకు ప్రభుత్వ పథకాల కింద సీట్లు ఇచ్చి, వారికి క్లాసులు, సౌకర్యాలు, సిబ్బందినీ అందిస్తున్నాయి. కానీ రీయింబర్స్మెంట్ మొత్తాలు సకాలంలో రాకపోవడం వల్ల ఈ సంస్థలు జీతాలు, ల్యాబ్ నిర్వహణ, మౌలిక వసతులు అందించడంలో ఇబ్బందులు పడుతున్నాయి. ప్రైవేట్ కాలేజీలు లాభాపేక్షతో కూడినవైనా, వాస్తవంగా ఇవి ప్రభుత్వ బాధ్యతను పంచుకుంటున్న సంస్థలు. అందుకే వీటిని వివక్షగా చూడకుండా 'భాగస్వాములు'గా గుర్తించి సహకరించడం సమాజ ప్రయోజనానికి అవసరం. ప్రైవేట్ కాలేజీలు విద్యతో పాటు నిరుద్యోగ యువతకు ఉపాధి కూడా కల్పిస్తున్నాయి.

వేలాది మంది ఈ కాలేజీల ద్వారా జీవనోపాధి పొందుతున్నారు. నిధుల విడుదలలో ఆలస్యం వలన ఈ వర్గాలపై కూడా తీవ్ర ప్రభావం పడుతోంది. జీతాల ఆలస్యం, ఉద్యోగాల కోతలు, సంస్థల మూతపడే పరిస్థితి, ఇవన్నీ సామాజిక తిరోగమన వృద్ధికి సంకేతాలు. పేద విద్యార్థులకు ఆర్థిక అడ్డంకులు లేకుండా చదివే అవకాశం ఇవ్వడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత. అందుకే ఫీజు రీయింబర్స్‌మెంట్ లాంటి పథకాలు కేవలం ప్రభుత్వ పత్రాలలో ఉండకూడదు. అవి పేద విద్యార్థి ఇంట్లో వెలిగే దీపం. ఒక కుటుంబం చదువుతో ఎదిగితే, దాని ప్రభావం తర తరాల మీద ఉంటుంది. నిధుల ఆలస్యం, వివక్ష, రాజకీయ ప్రాధాన్యతలతో ఈ దీపం ఆరిపోకుండా చూసే బాధ్యత సమాజం మొత్తం మీద ఉంది. నిధుల విడుదలలో ప్రభుత్వాలు మాటలకే పరిమితం కాకుండా, నిధులు సకాలంలో విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్తును రక్షించాలి. విద్యలో పెట్టుబడి అంటే దేశ భవిష్యత్తులో పెట్టుబడి. ప్రభుత్వం ఈ వాస్తవాన్ని మర్చిపోతే, పేద విద్యార్థుల కన్నీటి చరిత్ర మనం చదవాల్సి వస్తుంది.

# నిబద్ధత గల నేత వీపీ సింగ్



భారత దేశ రాజకీయాలలో తనదంటూ ప్రత్యేక ముద్ర వేసిన నేత విశ్వనాథ్ ప్రతాప్ సింగ్. పధాన మంత్రి కావడానికి ముందు అవినీతిపై పోరాడటానికి అధికారాన్ని త్యాగం చేసిన ఆదర్శ నేత ఆయన. వీపీ సింగ్ అవినీతిని జాతీయ సమస్యగా మార్చాడు. వివాదాస్పదమైన బోఫోర్స్ తుపాకీ ఒప్పందంపై రాజీవ్ గాంధీ ప్రభు త్వాన్ని ఇరకాటంలో పెట్టాడు. అవినీతికి వ్యతిరేకంగా తన పోరాటాన్ని వీధుల్లోకి తీసుకెళ్లడానికి కేబినెట్ నుండి రాజీనామా చేశాడు. హెచ్‌డిడబ్ల్యూ జలాంతర్గామి ఒప్పందానికి సంబంధించిన విచారణపై అప్పటి ప్రధాని రాజీవ్ గాంధీతో విభేదాల కారణంగా తాను రాజీనామా చేశానని 2005 లో శేఖర్ గుప్తాకు ఇచ్చిన ఇంట ర్వ్యూలో చెప్పాడు. రక్షణ ఒప్పం దాలలో అవినీతి 1989 లోక్‌సభ ఎన్నికలలో కేంద్ర సమస్యగా మారింది. అంతేగాక 1990 ఆగస్టులో, విపి సింగ్ పార్ల మెంటులో చాలా కాలంగా మరచిపోయిన మండల్ కమిషన్ నివేదిక సిఫారసులను ప్రవేశపెట్టి, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలలో ఓబిసి సమాజ రిజర్వేషన్లకు మార్గం సుగమం చేసిన ప్రధానిగా చరిత్రలో మిగిలి పోయాడు. వీపీ సింగ్ వర్ధంతి సందర్భంగా ఆయన జీవితంలో కొన్ని ముఖ్యాంశాలను గుర్తు చేసుకునే చిరు ప్రయత్నం. విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ (జూన్ 25, 1931 – నవంబరు 27, 2008) భారతదేశ ఏడవ ప్రధాన మంత్రిగా 1989 నుండి 1990 వరకు పనిచేసాడు. ఆ సమయంలోనే మండల్ కమిషన్ నివేదిక ప్రకారం ప్రభుత్వ ఉద్యోగాలలో వెనుకబడిన కులాలకు 27% రిజర్వేషన్ కల్పించాలని నిర్ణయించాడు. వీపీ సింగ్ 1931 జూన్ 25 న మండా ఎస్టేట్ ను పరిపాలించిన రాజపుత్ర జమీందారీ కుటుంబంలో జన్మించాడు. అయన డెహ్రాడూన్ లోని కలనల్ బ్రౌన్ కేంబ్రిడ్జ్ స్కూలులోబీ అలహాబాద్, పూణె విశ్వవిద్యాలయాలలో చదివాడు. రాజస్థాన్ లోని డియోగర్ – మడారియా రాజు కుమార్తె అయిన సితా కుమారిని 1955 జూన్ 25 న వివాహం చేసుకున్నాడు. ఇది పెద్దలు కుదిర్చిన పెళ్ళి. ఈ వివాహం జరిగినపుడు ఆయనకు 24 సంవత్సరాలు, ఆమెకు 18 సంవత్సరాలు. 1969లో ఉత్తర ప్రదేశ్ రాష్ట్ర శాసన సభకు భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ తరపున సభ్యుడయ్యాడు. 1971 లో లోక్‌సభకు ఎన్నిక య్యాడు. 1974లో ప్రధానమంత్రి ఇందిరా గాంధీ మంత్రి వర్గంలో వాణిజ్య శాఖ ఉపమంత్రిగా బాధ్యతలు స్వీకరించాడు. 1976 నుండి 1977 వరకు వాణిజ్య శాఖా మంత్రిగా తన సేవలనందించాడు. 1980లో జనతా పార్టీ తరువాత ఇందిరా గాంధీ మరల ఎన్నుకో బడినప్పుడు, ఇందిర ఆయన్ని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిని చేసింది. అలా 1980%-%82 వరకు పని చేశాడు. 1983లో తిరిగి వాణిజ్య మంత్రి పదవిని పొందాడు. 1984 సార్వత్రిక ఎన్నికల తరువాత భారతదేశ 10వ కేబినెట్ లో ఆర్థిక మంత్రిగా రాజీవ్ గాంధీచే నియ మితుడయ్యాడు. బహుశా గతంలో కాంగ్రెస్ పార్టీకి ఆర్థిక సహాయాన్ని అందించిన పారిశ్రామిక వేత్తలపై ఆదాయపు పన్ను శాఖ దాడులు జరుపుతున్నందున ఆ పదవి నుండి తొలగించ బడ్డాడు. ఆర్థిక మంత్రిత్వ శాఖనుండి ప్రక్కకు తప్పించినప్పటికీ, సింగ్ కు దేశ ప్రజలలో ఉన్న జనాదరణ కారణంగా 1987 జనవరిలో రక్షణ మంత్రి బాధ్యతలను అప్పగించారు. నాలుగు వందల 155ఎంఎం శతఘ్నులను స్వీడిష్ కంపెనీ ఏబీ బోఫోర్స్ కంపెనీ నుంచి 1437 కోట్ల రూపాయల ఖర్చుతో కొనడానికి ఒప్పందం కుదిరిన విషయంలో, భారతదేశం, స్వీడన్ ప్రభుత్వాల్లోని పెద్దల మధ్య జరిగిన అవకతవ కలపై దృష్టి సారించాడు. ఈ అంశం రాజీవ్ గాంధీ ప్రభుత్వాన్ని కుది పేసింది. దానిపై దర్యాప్తు చేయించ డానికి ముందే ఆయనను క్యాబినెట్ నుండి తొలగించారు. ఫలితంగా సింగ్ కాంగ్రెస్ పార్టీ సభ్యత్వానికి, లోక్‌సభ సభ్య త్వానికి రాజీనామా చేసాడు. 1989 ఎన్నికలలో రాజీవ్ గాంధీని పదవినుంచి తొలగించటానికి, ఆయనకు వ్యతిరేకంగా వామ పక్షాలు, భారతీయ జనతా పార్టీతో కలసి ఒక కూటమి ఏర్పాటు చేయడానికి సింగ్ బాధ్యత వహించాడు. 1989లో ఆయన పాత్ర భారత రాజకీయాల దిశను మార్చింది.కాంగ్రెస్ పార్టీ నుండి బయటికి వచ్చిన తరువాత సింగ్... అరుణ్ నెహ్రూ, అరిఫ్ మొహమ్మద్ ఖాన్ లతో కలసి జనమోర్చా పేరుతో ప్రతిపక్ష పార్టీని ప్రారంభించాడు. అలహాబాద్ లోక్‌సభకు జరిగిన ఉపన్నికలలో సునీల్ శాస్త్రిని ఓడించి తిరిగి ఎన్నికయ్యాడు. 1988 అక్టోబరు 11 న జనతాపార్టీ సంకీర్ణం నాయకుడు జయప్రకాశ్ నారాయణ్ జన్మదినం సందర్భంగా రాజీవ్ గాంధీని వ్యతిరేకించే పార్టీలైన జనమోర్చా, జనతాపార్టీ, లోక్‌దళ్, కాంగ్రెస్ (ఎస్) పార్టీలను కలిపి జనతాదళ్ పార్టీని స్థాపిం చాడు. జనతాదళ్ పార్టీకి అధ్యక్షు డైనాడు. ద్రవిడ మున్నేట్ర ఖగజం, తెలుగుదేశం పార్టీ, అసోం గణ పరిషత్ వంటి ప్రాంతీయ పార్టీలతో కలసి జనతాదళ్ పార్టీ నేషనల్ ఫ్రంట్ పేరుతో సంకీర్ణ దళం ఏర్పడినది. దీనికి వి.పి.సింగ్ కన్వీనరుగా, ఎన్.టి.రామారావు అధ్యక్షునిగా, పర్వతనేని ఉపేంద్ర జనరల్ సెక్రటరీగా నియమి తులయ్యారు. 1989 సార్వత్రిక ఎన్నికలలో నేషనల్ ఫ్రంటు, కాంగ్రెస్ వ్యతిరేక పక్షాలైన భారతీయ జనతా పార్టీ, వామపక్ష పార్టీల (రెండు ప్రధాన ప్రతిపక్ష పార్టీలను)తో కలసి సీట్ల సర్దుబాటు చేసుకొని పోటీ చేసింది. అటల్ బిహారీ వాజపేయి, లాల్ కృష్ణ అద్వానీల నాయకత్వంలోని భారతీయ జనతా పార్టీ, కమ్యూ నిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్టు), కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా వంటి వామపక్షాలు ప్రభుత్వం బయటి నుండి మద్దతు ఇవ్వడంతో ప్రభుత్వం ఏర్పడింది. పార్లమెంటు సెంట్రల్ హాల్ లో 1989 డిసెంబరు 1 జరిగిన సమవేశం ద్వారా వి.పి.సింగ్ ప్రధాన మంత్రిగా ఎన్నుకోబడి, 1989 డిసెంబరు 2 న భారత దేశ 7వ ప్రధానమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టి, 1990 నవంబరు 10 వరకు ఒక సంవత్సరం లోపే ప్రధాన మంత్రిగా పనిచేసాడు. మార్చి 1990 లో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో సింగ్ సంకీర్ణ పభుత్వం పార్లమెంటు లోని రెండు సభలలో నియంత్రణ సాధించింది. ఈ కాలంలో జనతాదళ్ పార్టీ ఐదు రాష్ట్రాలలో అధికారం చేజిక్కించు కుంది. హర్యానా రాష్ట్రంలోని ఓం ప్రకాష్ చౌతాలా ప్రభుత్వం, గుజ రాత్ లోని చిమన్ భాయ్ పటేల్ ప్రభుత్వం, ఒడిశాలోని బిజూ పట్నాయక్ ప్రభుత్వం, బీహార్ లోని లాలూ ప్రసాద్ యాదవ్ ప్రభుత్వం, ఉత్తరప్రదేశ్ లోని ములాయం సింగ్ యదవ్ ప్రభుత్వాలను జనతాదళ్ పార్టీ ఏర్పరచింది. నేషనల్ ఫ్రంటు లోని మిత్రపక్షాలైన ఎన్.టి రామరావు, ప్రఫుల్ల కుమార్ మహంతా కూడా ప్రభుత్వాలను ఏర్పరచారు. జనతాదళ్ కేరళ రాష్ట్రంలోని ఇ.కె.నాయనార్ తో, రాజస్థాన్ లో భైరాన్ సింగ్ షెకావత్ తో కూడా అధికారాన్ని పంచుకుంది. మండల్ కమిషన్ నివేదికమండల్ కమిషన్ భారత దేశంలోని సామాజిక, విద్యాపరంగా వెనుక బడిన తరగతుల పరిస్థితులని అధ్యయనం చేసే కమీషన్. దీనిని 1979 జనవరి 1న అప్పటి జనతా పార్టీ కి చెందిన భారత ప్రధాన మంత్రి మొరార్జీ దేశాయ్ చే ప్రారంభించ బడినది. ఆ కాలంలో ఏర్పాటు చేసిన కమిషన్ ఛైర్మన్ గా బి.పి.మండల్ వ్యవహరించాడు. అయన రూపొందించిన మండల్ కమిషన్ నివేదిక భారత దేశంలో వెనుక బడిన తరగతులు, యితర వెనుక బడిన తరగతులుగా సూచించ బడిన కులాలకు సామాన్య జన స్రవంతిలో అను సంధానం చేసే మార్గాలను అధ్యయనం చేసి క్రమ బద్ధము, న్యాయ బద్ధమూ అయిన విధాన నిర్మాణాన్ని ప్రభుత్వానికి సమర్పిం చింది. కానీ ఆ సమయానికి మురార్జీ దేశాయి ప్రధాని పదవి నుండి వైదొలగ వలసి వచ్చింది. తరువాత కాంగ్రెస్ పాలనలో సుమారు 10 సంవత్సరాలు మండల్ కమిషన్ నివేదిక బుట్ట దాఖలు అయిపోయింది. తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వం పతనమై వి.పి. సింగ్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత మండల్ కమీషన్ నివేదికకు తన ప్రభుత్వ ఆమోద ముద్ర వేసాడు. ఓబిసి రిజర్వేషన్లను (క్రిమీలేయర్ కంటే దిగువన) 2008 లో సుప్రీం కోర్టు సమర్థించింది. ఆయన పాలనా సమయంలో శ్రీలంక లోని తమిళ వేర్పాటు వాద ఉద్యమాన్ని ఎదుర్కోవడానికి అంతకు పూర్వం రాజీవ్ గాంధీ భారత సైన్యాన్ని పంపించి చేపట్టిన, విఫలమైన ఆపరేషన్‌కు ముగింపు పలకాలని నిర్ణయించాడు. భారత సరిహద్దులో యుద్ధాన్ని ప్రారంభించేందుకు బెనజీర్ భుట్టో నేతృత్వంలోని పాకిస్తాన్ చేసిన ప్రయత్నాలను ఆయన అడ్డుకున్నాడు.



రామ కిష్టయ్య సంగన భట్ల...

## డిజిటల్ అరెస్టుల అసలు కథ!

దేశంలో డిజిటల్ అరెస్టుల అంశంపై చర్చ జరుగుతూనే ఉంటుంది. దీనిపై ప్రజలకు ఎంత అవగాహన చేసినా సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతూనే ఉంటున్నారు. ఇటీవల డిజిటల్ అరెస్టు పేరుతో బెంగళూరులోని ఒక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ను బెదిరించి ఏకంగా రూ.32 కోట్లు కొల్లగొట్టారు సైబర్ నేరగాళ్లు.. ఇటీవలి కాలంలో వెలుగు చూసిన అతిపెద్ద సైబర్ నేరంగా ఈ కేసును పోలీసులు భావిస్తున్నారు. వీడియో కాల్‌లో సీబీఐ అధికారులుగా నటిస్తూ, సదరు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ నుంచి రూ. 32 కోట్లు సైబర్ నేరగాళు కొల్లగొట్టినట్లు పోలీసు వర్గాల కథనం. అమాయక ప్రజలను మోసం చేయడానికి సైబర్ నేరగాళ్లు రకరకాల పద్ధతులు ఎంచుకుంటూ ఉంటారు. అందులో భాగంగా సైబర్ నేరగాళ్లు ఎంచుకున్న కొత్త పద్ధతే ఈ డిజిటల్ అరెస్టులు.. ఈ డిజిటల్ అరెస్టుల పేరు చెప్పి అవతలి వ్యక్తులను భయపెట్టి మోసం చేస్తున్నారు. టార్గెట్‌గా ఎంచుకున్న వారికి వీడియో కాల్ చేస్తారు. తమను తాము సీబీఐ అధికారులగానో లేక ఇన్‌కం టాక్స్ డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లగానో పరిచయం చేసుకుంటూ వీడియో కాల్ చేస్తారు. బెదిరింపులకు భయపడ్డ వారి దగ్గర నుంచి సైబర్ నేరగాళ్లు పెద్ద ఎత్తున డబ్బు కాజే స్తున్నారు. డిజిటల్ అరెస్టుల పేరుతో జరుగుతున్న మోసాలపై ఇటీవల సుప్రీంకోర్టు కూడా ఆందోళన వ్యక్తం చేసింది. హర్యానాలోని అంబాలాకు చెందిన ఒక సీనియర్ సిటిజన్ ఫిర్యాదు ఆధారంగా సుమోటాగా సుప్రీంకోర్టు కేసు నమోదు చేసింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వానికి, సీబీఐకి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది.అంబాలాకు చెందిన 73 సంవత్సరాల ఒక మహిళ.. ఇటీవల సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌కు ఒక ఫిర్యాదు చేసింది. తనను డిజిటల్ అరెస్టు చేయవలసిందిగా సుప్రీంకోర్టు ఆదేశాలు ఉన్న ఒక పత్రాన్ని నేరగాళ్లు తనకు చూపించారని సదరు మహిళ పేర్కొన్నారు. కోటి రూపాయలు చెల్లిస్తే.. సదరు డిజిటల్ అరెస్టు నుంచి బయట పడేస్తామని సైబర్ నేరగాళ్లు హామీ కూడా ఇచ్చారని ఆమె ఫిర్యాదులో వెల్లడించారు. కాగా న్యాయస్థానం ఆదేశాలు ఉన్నట్లు నేరగాళ్లు నకిలీ పత్రాలు సృష్టించడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా పరిగ ణించింది. దీంతో సదరు ఫిర్యాదును సుమోటోగా తీసుకుని విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా రోజురోజుకూ పెరుగుతున్న డిజిటల్ మోసాలపై సుప్రీంకోర్టు ధర్మాసనం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. డిజిటల్ మోసాలను సామాన్యమైన మోసాలుగా ఎటువంటి పరిస్థితుల్లోనూ పరిగణించలేమని సర్వోన్నత న్యాయస్థానం కుండబద్దలు కొట్టింది. ఒకప్పుడు రద్దీగా ఉండే ప్రదేశాల్లో దొంగలు చోరీలకు పాల్పడేవాళ్లు.. అలాగే రాత్రిళ్లు అందరూ నిద్రపోయాక ఇళ్లల్లోకి ప్రవేశించి దొంగతనాలు చేసేవాళ్లు.. ఇప్పుడు ట్రెండ్ మారింది. ఆన్‌లైన్ చోరీలు తెరమీదకు వచ్చాయి. ఫోన్ చేసి ఫలానా బ్యాంకు అధికారులమని పరిచయం చేసుకుంటారు. బ్యాంకు అకౌంట్ల అలాగే ఏటీఎం కార్డుల వివరాలు అడుగుతారు. అమా యక ప్రజలు ఇవన్నీ నమ్మి బోళాగా వివరాలు చెప్పేస్తారు. ఇంకేముంది కేటుగాళ్లు అందినకాడికి దోచుకుంటారు. ప్రపంచవ్యాప్తంగా కేటుగాళ్లు ఇంటర్నెట్‌ను ఆధారం చేసుకుని మోసాలకు పాల్పడుతున్నారు. సైబర్ నేరాలన్నీ ఒకేలా ఉండవు. ఒక్కో నేరంలో ఒక్కో స్థాయి తీవ్రత ఉంటుంది. దీంతో సైబర్ క్రైమ్‌లను చూసి ప్రపంచ దేశాలు వణికి పోతున్నాయి. రోజురోజుకూ సైబర్ నేరాల తీవ్రత ఊహిం చనంత వేగంగా విస్తరిస్తోంది. ఏమైనా సైబర్ నేరాల పట్ల జనం అప్రమత్తంగా ఉండాల్సిన సమయం వచ్చింది.

# స్త్రీ చైతన్యం... ఓల్గా రచనల లక్ష్యం



పోపూరి లలిత కుమారి. ఈ పేరు చాలా మంది సాహిత్యాభిమానులకు అపరిచితం. కానీ ఓల్గా అంటే– తెలియని సాహితీ ప్రియులు లేరు. తెలుగునాట ఆమె పరిచయ అవసరం అసలే లేని అభ్యుదయ రచయిత్రి. ఓల్గా అంటే వేయి వోల్టుల ఒక అక్షర ప్రవాహం. ఆమె రచనలు కణకణ మండే నిప్పు కణికలు. ఆమె ప్రసంగాలు భగభగ మండే నినాదాలు. ఓల్గా అసలు సిసలైన స్త్రీ వాది. ఆమెకు స్త్రీవాదమే సందర్భం. స్త్రీవాదమే ఉద్యమం. స్త్రీవాదమే సాహత్యం. స్త్రీవాదమే నేపథ్యం. స్త్రీవాదం సాహిత్యం లోనూ, సమాజంలోనూ బలంగా నాటుకు పోవాలన్నదే ఆమె సంకల్పం. బలమైన ఉద్యమాలను నిర్మించుకుంటూ వెళ్తే తప్ప ఆకాశంలో సగం అవకాశంలో సగం లాంటి పదాలకు న్యాయం చేకూరదని ఆమె నమ్మారు. అందుకు ఆమె సాహిత్యాన్ని ఎంచుకున్నారు. ఆమె పెరిగిన నేపథ్యం, చుట్టూ ఉన్న సాన్ని హిత్యం, చదువుకున్న సాహిత్యం– అన్నీ కలగలిపి అభ్యుదయ భావాలకు ఊపిరి లూదాయి. గోర్కీలాంటి అనువాద పుస్తకాలు. పదో ఏటనే శ్రీశ్రీ మహాప్రస్థానం ఆమెపై ఎంతో ప్రభావం చూపాయి. తర్వాత చలం, కొడవటిగంటి కుటుంబరావు రచనల వల్ల ప్రభావితమై, స్త్రీ చైతన్యము అంశముగా రచనలు చేసి, తనకై ఒక ప్రత్యేక స్థానం సంపాదించారు. ఆధునిక తెలుగు సాహిత్యంలో ఓల్గాగా సుపరిచితులైన "పోపూరి లలిత కుమారి"కి ప్రత్యేక స్థానం ఉంది. రాజకీయ, సాహిత్య రంగపు చర్చలో స్త్రీవాద ధృక్పధాన్ని ప్రవేశ పెట్టిన తెలుగు రచయిత్రిగా ఆమె గుర్తింపు పొందారు. ప్రగతిశీల రచయిత్రిగా... ఓల్గా కథలు, నవలలు, పద్యాలు స్త్రీ సాహిత్య ములో ఎన్నదగినవి. పత్రికలలో, సాహిత్యములో, అనువాద ములలో మహిళా హక్కులపై విస్తృత చర్చలకు ఆమె తెర లేపారు. స్త్రీవాద ఉద్యమానికి ప్రతీకగా నిలిచిన ఓల్గా, తనను తాను తెలుగులో గురజాడ అప్పారావు వ్రాసిన కన్యాశుల్కంతో ప్రారంభమైన అభ్యుదయ రచనా పరంపరలో భాగంగా కూడా భావించారు. నవంబర్ 27, 1950న గుంటూరు జిల్లా చుండూరు మండలం యడ్లపల్లి గ్రామములో పోపూరి వెంకట సుబ్బారావు, వెంకట సుబ్బమ్మ దంపతులకు ఆమె జన్మించారు. ఆంధ్ర విశ్వ విద్యాలయంలో తెలుగు సాహిత్యంలో స్నాతకో త్తర విద్య (ఎం.ఎ) పూర్తి చేసిన తర్వాత తెనాలిలోని వి.ఎస్.ఆర్. కళాశాలలో తెలుగు అధ్యాపకు రాలిగా పనిచేశారు. చలన చిత్ర రంగములో 'ఉషా కిరణ్' సంస్థకు కథా రచయిత్రిగా పనిచేసి మూడు చిత్రాలు నిర్మించి పురస్కారాలు పొందారు. ఆమె రాసిన "స్వేచ్ఛ" నవలను వివిధ భారతీయ భాషల్లోకి అనువదించ డానికి నేషనల్ బుక్ ట్రస్టు స్వీకరించింది. 1986 నుండి 1995 వరకు ఆమె ఉషా కిరణ్ మూవీస్ లో సీనియర్ కార్యవర్గ సభ్యురాలిగా పని చేసారు. 1991 నుండి 1997 వరకు అస్మిత రిసోర్స్ సెంటర్ ఫర్ విమెన్ కు అధ్యక్షురాలిగా పని చేసారు. అమెరికన్ లైబ్రరీ ఆఫ్ కాంగ్రెస్ వారు ఓల్గా వ్రాసిన 12 రచనలను, ఆమె కథల ఆంగ్లానువాదములను తమ సంగ్రహములో చేర్చారు. రాజకీయ కథలు –1993, స్వేచ్ఛ – 1994, సహజ – 1995, ప్రయోగం – 1995, మానవి – 1998, కన్నీటి కెరటాల వెన్నెల – 1999, గులాబీలు – 2000, అకాశంలో సగం (ఉత్తమ నవల పురస్కారం), పలికించకు మౌన మృదంగాలు, అలజడి మాజీవితం, జీవితం, కన్నీటి కెరటాల వెన్నెల, అక్షర యుద్ధాలు – 2009, అతడు – ఆమె మనం – 2005, నవలా మాలతీయం – 2006, సరిహద్దులు లేని సంధ్యలు తదితరాలు ఆమె ప్రముఖ రచనలు. "స్వేచ్ఛ" నవలకు 1987 – ఉషోదయ పబ్లికేషన్స్ వారి ఉత్తమ నవల రచయిత అవార్డు, 1990 – ఉదయం మాగజిన్ వారు తోడు' అనే కథకు ఉత్తమ నవల రచయిత అవార్డు, 1998 – ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు నంది అవార్డు ఉత్తమ కథ రచయిత, 1999 – తెలుగు విశ్వవిద్యాలయం ఉత్తమ స్త్రీ రచయిత అవార్డు, 2014 – లోక్ నాయక్ ఫౌండేషన్ సాహితీ పురస్కారానికి ఓల్గా ఎంపిక య్యారు. 2015 – ఆమె వ్రాసిన "విముక్త" కథల సంపుటి ద్వారా ప్రతిష్ఠాత్మకమైన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుకు ఎంపికైనారు. ఈ సంకలనాన్ని డాక్టర్ కె.రామ చంద్రమూర్తి, డాక్టర్ ఎ.మంజులత, డాక్టర్ జి.యోహాన్ బాబుల జ్యూరీ బృందం ఏకగ్రీవంగా ఎంపిక చేసింది. ఈ కథల గురించి ఓల్గా... వర్తమాన సమాజంలో స్త్రీల వేదనలకు ప్రాతినిధ్యం వహించే కథలు కూడా. ఇవాల్టి సమాజంలో అనేక ఆంక్షలకూ అవమానలకూ హింసలకూ గురై వాటినధిగమించి లేస్తున్న స్త్రీలు కొందరైతే, వాటిలోనే కూరుకుపోయి వాటిని దాటలేక, దాటాలని తెలియక, నానా యాతనలు పడుతున్న స్త్రీలెందరో – తమను హింసించే భర్తల నుండి విముక్తం కావాలనే స్పృహ లేకుండా వారిని ద్వేషిస్తునే, అసహ్యించు కుంటునే వారిని గట్టిగా పట్టుకునే స్త్రీలు – ద్వేషంతోతమను తాము హింసించుకోడం అలవాటైన స్త్రీలు – ఆ స్త్రీల కోసం ఈ కథలు అని పేర్కొన్నారు. స్వేచ్ఛ ఎవరో ఇచ్చేది కాదు. ఎవరినుండి సాధించుకునేది కాదు. మన అవసరాలను, మన ఉనికికి అత్యవసర విషయాలను మనం గుర్తించడమే స్వేచ్ఛ. నిజానికి అది సాధించడం చాలా కష్టం" అంటారు స్వేచ్ఛ నవల రాసిన సందర్భంలో. స్త్రీ ఎదుర్కొనే ప్రతి సమస్య గురించీ ఆమె ఒకో కథలో కనిపి స్తుంది. ప్రత్యేకత దాని ప్రయోజకత్వం. తాను సాహిత్యానికి ఓ ప్రయాజనం ఉండాలన్న ఆశయం తోనే రచనలు మొదలు పెట్టానని చెబుతారు ఓల్గా. ప్రతి కథలోనూ తన లక్ష్యాన్ని చేరుకునే ప్రయత్నం చేస్తుంటారు. అందుకనే ఆమె కథలో ఓ సూటిదనం కనిపిస్తుంది. అందులో ఒకోసారి సుదీర్ఘమైన చర్చలూ వినిపిస్తాయి. చివరికి ఓ పరిష్కారమూ ఉంటుంది. ఇలా స్త్రీ విముక్తి కోసం ఆమెకు ఉన్న మొక్కవోని ధృఢ సంకల్పం ఆమె ప్రతి కథలోనూ కనిపిస్తుంది.

# పెండ్లి చేసుకోవాలని ప్రియుడి ఇంటిముందు ప్రియురాలి ధర్నా



వుదయం, నవంబర్26, (బెల్లంపల్లి) బెల్లంపల్లి మండలం సోమగూడెంలో బుధవారంప్రియుడి ఇంటి ముందు ప్రియురాలిధర్నాకు దిగింది. యువతికి మహిళ సంఘాల నాయకులురాలు మద్దతుగా నిలిచారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి యువతిని మందమర్రి సిఐ కార్యాలయానికి తరలించారు. ఈ సందర్భంగా బాధిత యువతి మాట్లాడుతూ.. సోమగూడెంకు చెందిన సింగరేణి కార్మికుడు షేక్ సలీం ఇద్దరం 8 ఏళ్లుగా ప్రేమించుకున్నామని, అన్ని రకాలుగా వాడుకొని, నన్ను అందరి మధ్య తప్పుగా చిత్రీకరించి పెళ్లికి నిరాకరిస్తున్నాడని ఆరోపించారు.ఈ విషయంపై కేసు కూడా పెట్టగా 45 రోజుల జైలు శిక్ష పడినప్పటికీ ఆయనలో ఎలాంటి మార్పు రాలేదన్నారు. ఈనెల 29న మరో అమ్మాయితో పెళ్లి ఖాయం చేసుకోవడంతో ఇంటిముందు ధర్నా చేపట్టినట్లు తెలిపారు. తనకు సలీంతో పెళ్లి చేసి న్యాయం చేసే వరకు ఆందోళన విరమించనని స్పష్టం చేశారు. సదురు యువకుడి కుటుంబ సభ్యులు కూడా గొడవ చేశారు. కావాలనే ఇబ్బంది పెడుతున్నారని, మా కుటుంబాన్ని మొత్తం నాసినం చేశారని, మా కుటుంబం చస్తామని వాగ్వివాదం చేశారు.దింతో యువకుడి కుటుంబ సభ్యులను పోలీసులు మందమర్రి సీఐ కార్యాలయానికి తరలించారు. అనంతరం కాసిపేట ఇంచార్జ్ ఎస్ఐ బూర రవీందర్ ఆధ్వర్యంలో పోలీసులు యువతికి నచ్చ చెప్పి యువతిని కూడా మందమర్రి సీఐ కార్యాలయానికి తరలించారు. ఆందోళన చేస్తున్న యువతికి అంబేద్కర్ సంఘం మహిళా నాయకురాలు మద్దెల భవాని, కామెర అనూష, తదితరులు మద్దతుగా నిలిచారు.

## స్థానిక ఎన్నికలకు ఏర్పాట్లు చేస్తున్న అధికారులు



జన్నారం, నవంబర్ 26(వుదయం విలేకరి) జన్నారం మండలంలోని వివిధ గ్రామాలలో పంచాయతీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని ఎంపీడీవో ఉమర్ షరీఫ్ తెలిపారు.గురువారం నుండి సర్పంచ్, వార్డు స్థానాలకు నామినేషన్లు స్వీకరణ ప్రారంభం కానున్నదని వెల్లడించారు.ఇందులో భాగంగా మండలంలో 8 క్లస్టర్లను ఏర్పాటు చేసి 8 మంది చొప్పున ఆర్వోలు, ఏఆర్ఓలను నియమించామన్నారు.పోటీ చేయాలనుకునేవారు ఆర్వోలు, ఏఆర్వోలకు దరఖాస్తులు సమర్పించాలని ఎంపీడీవో సూచించారు.

## గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలి: జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



జయశంకర్ భూపాలపల్లి నవంబర్ 26(వుదయం జిల్లా ప్రతినిధి): మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు.బుధవారం ఐడిఓసి కార్యాలయపు సమావేశపు హాలులో మొదటి విడత గ్రామ పంచాయితీ ఎన్నికల నిర్వహణపై రిటర్నింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 27వ తేదీ ఉదయం 10.30 గంటల లోపు ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటించి గ్రామ పంచాయతీ కార్యాలయం, గ్రామపంచాయతీ ప్రధాన కూడళ్లలో ప్రదర్శింపచేయాలని అన్నారు. అలాగే గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఓటరు జాబితా కూడా ప్రదర్శింపజేయాలని సూచించారు. నామినేషన్ల ప్రక్రియ ఉదయం 10:30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఉంటుందని ఈనెల 29వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించాలని తెలిపారు. 30వ తేదీన నామినేషన్ల పరిశీలన, డిసెంబర్ 1వ తేదీన అప్పీళ్లు, 2వ తేదీన డిస్పోజల్, 3వ తేదీన ఉపసంహరణ ఉంటుందని తెలిపారు. నామినేషన్ల స్వీకరణకు 25 మంది 25 రిటర్నింగ్ అధికారులను నియమించామని తెలిపారు.ప్రతి రిటర్నింగ్ అధికారుల కేంద్రాల్లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని తెలిపారు. ఒక వ్యక్తి గరిష్టంగా నాలుగు సెట్లు నామినేషన్ సెట్లు దాఖలు చేసేందుకు అవకాశం ఉందని తెలిపారు. నామినేషన్ లో ఖచ్చితంగా తేదీ, సమయం, క్రమ సంఖ్య నమోదు చేయాలని సూచించారు. నామినేషన్లలో అభ్యర్థి సంతకం, ధ్రువీకరణ ప్రతిపాదకుని సంతకం ఉండాలని తెలిపారు. మొదటి విడతలో 4 మండలాల్లోని 82 గ్రామపంచాయతీల పరిధిలోని 712 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారి విధులు చాలా కీలకమని ఎన్నికలపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలని తెలిపారు.అనంతరం మాస్టర్ ట్రైనర్లు ఎన్నికల విధులపై పవర్ పాయింట్ ద్వారా అవగహన కల్పించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ట్రైని డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, డిపిఓ శ్రీలత ఎంపీడీవోలు, రిటర్నింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పెద్ద నక్కలపేట్ లో బేటీ బచావో...బేటీ పడావో




ధర్మపురి నవంబర్ 26(వుదయం విలేకరి): మండలంలోని పెద్ద నక్కలపేట్ గ్రామంలో గ్రామపంచాయతీ ఆవరణంలో, జిల్లా పరిషత్ పాఠశాలలో మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోబేటీ బచావో...బేటీ పడావో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా బాలల పరి రక్షణ విభాగన్ చైల్డ్ లైన్ 1098 అధికారి ఆరుట్ల రజిత పాల్గొని గ్రామ ప్రజలకు,గ్రామ పెద్దలకి ,విద్యార్థుల కు బాల్య వివాహంపై అవగాహన కల్పించారు.పాఠశాలలో విద్యార్థులకు బాల్య వివాహ చట్టం- 2006, పోక్సో చట్టం - 2012,మత్తు పదార్థాలు మాదకద్రవ్యాల నిర్మూలన పై అవగాహన కల్పించారు.బాల్య వివాహాల నిరోధక చటం- 2006 ప్రకారం 18 సంవత్సరాల లోపు అమ్మాయికి 21 సంవత్సరంలోపు అబ్బాయికి వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని అందుకు రెండు సంవత్సరాల జైలు శిక్ష,లక్ష రూపాయల వరకు జరిమానా విధించబడునని అదేవిధంగా బాల్యవివాహాల వల్ల పిల్లలకు భవిష్యత్తులో మానసిక శారీరక ఎదుగుదల ఆగిపోతుందని అలాగే ప్రభుత్వం నుంచి ఇచ్చే ప్రోత్సాహాలు కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ వంటి పథకాలు వర్తించవని,గ్రామపంచాయతీ పరిధిలో బాలల పరిరక్షణ కమిటీ ఏర్పాటు చేసి పిల్లల సమస్యలను గురించి చర్చించి పిల్లలకు సమస్య ఉంటే ఈ కమిటీ దృష్టికి తీసుకురా వాలని కోరారు. బాలబాలికలు మత్తు కి బానిస అవ్వడం, మొబైల్ ఫోన్స్ కి దూరంగా ఉండాలని అలాగే 18 సంవత్సరాల లోపు బాలబాలికలకి రక్షణ,సంరక్షణ అవసరమైన పిల్లల కొరకు 24 గంటలు పనిచేసే ఉచిత అత్య వసర ఫోన్ సేవా సౌకర్యం చైల్డ్ హెల్ప్ లైన్1098 పోలీస్ 100, సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బాల్య వివాహాలు లేని భారతదేశ కోసం ప్రతిజ్ఞ చేయించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ చంద్రశేఖర్, గుండి.నరసయ్య, గాదె.శ్రీనివాస్ అంగన్వాడి టీచర్ మంగ, శాంత, సరస్వతి ఆశవర్క్స్,విఓ కాల్ జామున, మహిళలు,విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# నేటి నుండి పంచాయతీ ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ



మధిర, నవంబర్26(వుదయం ప్రతినిధి) మధిర మండలంలో నేటి నుండి గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు మెంబర్లకు నామినేషన్ స్వీకరణ ప్రక్రియ ప్రారంభమతుందని తహసిల్దార్ రాంబాబు తిరిగి చేసారు.మధిర మండలంలో మొత్తం ఎనిమిది క్లస్టర్ల నుండి నామినేషన్లు స్వీకరించబడతాయి. నామినేషన్ వేసే వ్యక్తులు స్వయానా నామినేషన్ దాఖలు చేయాలి ఏ ఇతరుల నుండి నామినేషన్లుస్వీకరించబడవు.గ్రామపంచాయతీ సర్పంచ్ పోటీచేసే వ్యక్తి నిబంధనలకు లోబడి కొత్త ఎకౌంటును ఓపెన్ చేసి ఆ అకౌంట్ డీటెయిల్స్ అప్పుడవిత్ నామినేషన్ అప్లికేషన్ పూర్తిగా పూర్తి చేయాలి.సర్పంచి పోటీ చేసే జనరల్ కేటగిరీకి సంబంధించి 2000,ఎస్సీ,ఎస్టి, బీసి1000 రూపాయలు, వార్డు మెంబర్ కు పోటీ చేసేవారు జనరల్ కేటగిరి 500 ఎస్సీ ఎస్టీ బీసీ 250 రూపాయలు నామినేషన్ రోజే చెల్లించాలని తాహాసిల్దార్ రాళ్ల బండి రాంబాబు, ఎంపీడీవో వెంకటేశ్వర్లు తెలిపారు.

## ఇందనపెల్లి అడవుల్లో పులి దాడిలో ఆవు మృతి



జన్నారం, నవంబర్ 26(వుదయం విలేకరి) జన్నారం మండలంలోనిఇందనపల్లి శివారు ప్రాంతంలో ఉన్న అడవిలో ఆవుపై పులి దాడి చేసిందని ఎఫ్ డి ఓ రామ్మోహన్, ఎఫ్ ఆర్ ఓ లక్ష్మీనారాయణ తెలిపారు. ఆ గ్రామంలోని భీమన్న గుట్ట సమీపంలో ఉన్న మామిడి తోటలో బుధవారం ఆవు మృతదేహం కనిపించడంతో స్థానికులు ఆందోళన చెందారని ఆవును గుర్తించిన గ్రామస్తులు వెంటనే అటవీశాఖకు సమాచారం అందించారు.ఈ సంఘటనపై అటవీ అధికారులు స్థలానికి చేరుకుని పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమీపంలోని గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఒకరు ఇద్దరు తిరగవద్దని పశువుల కాపరులు అడవిలోకి వెళ్ళవద్దని ప్రజలు భయభ్రాంతులకు గురి కావద్దని సూచించారు.వేట కోసం కరెంటు వైర్లు, ఉచ్చులు పెట్టినట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అలాగే ఆవు యజమానికి నష్టపరిహారం అందిస్తామన్నారు.

## పార్టీ బలపరిచిన అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలి



జన్నారం, నవంబర్ 26(వుదయం విలేకరి) త్వరలో జరగనున్న సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థుల విజయం కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ కోరారు.బుధవారం రోజున జన్నారం పట్టణంలోని స్థానిక ఆర్ఆర్ ఫంక్షన్ హాల్లో నాయకులు కార్యకర్తలతో నిర్వహించిన సర్పంచ్ ఎన్నికల సన్నహాక సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి కోసం ప్రతి ఒక్క కార్యకర్త కష్టపడి పనిచేయాలని అన్ని గ్రామాలలో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలలో పార్టీ అభ్యర్థులని గెలిపించుకోవాలని సూచించారు. ఈ సమావేశం కు మండలంలోని 29 గ్రామ పంచాయతీలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

## జన్నారంలో ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం



జన్నారం, నవంబర్ 26(వుదయం విలేకరి) జన్నారం మండలంలోని పలు గ్రామాల్లో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.76వ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బుధవారం ఎన్ ఎస్ యు ఐ, యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం పలు పార్టీలు,అంబేద్కర్ దళిత సంఘాల ఆధ్వర్యంలో జన్నారంలోని అంబేద్కర్విగ్రహానికి ఆయాసంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పిం చారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందని వారన్నారు.ఈ కార్యక్రమంలో పలు పలు సంఘాల, పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## కోడ్ కూసే.. ఫ్లెక్సీలు తీసే..



జన్నారం, నవంబర్ 26 (వుదయం విలేకరి) జన్నారం మండల కేంద్రంలోని వివిధ చౌరస్తాలలో ఉన్న రాజకీయ ఫ్లెక్సీలను గ్రామపంచాయతీ సిబ్బంది తొలగించారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ షెడ్యూల్ తో కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం ఉదయం జన్నారంలోని అంగడి బజార్, బస్టాండ్, ధర్మారం చౌరస్తా ప్రాంతాలలో ఉన్న వివిధ రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను పంచాయతీ ఈవో రాహుల్ ఆధ్వర్యంలో సిబ్బంది, కార్మికులు తొలగించారు.

# కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలి

### సంయుక్త కిసాన్ మోర్చా నాయకుల డిమాండ్




నారాయణపేట నవంబర్ 26 (వుదయం ప్రతినిధి)కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు డిమాండ్ చేశారు. నారాయణపేట జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో సంయుక్తా కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో అఖిలభారత ఐక్య రైతు సంఘం (ఏ ఐ యు కె ఎస్ ) జిల్లా ప్రధాన కార్యదర్శి బి యాదగిరి, తెలంగాణ రైతు సంఘం (ఏ ఐ కె ఎస్ ) జిల్లా ప్రధాన కార్యదర్శి అంజయ్య గౌడ్ ల అధ్యక్షతన సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ కమిటీ పిలుపులో భాగంగా కేంద్ర బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల రైతు ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలని నిరసన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య వక్తలుగా హాజరైన సిపిఎం జిల్లా కార్యదర్శి వెంకట్రామరెడ్డి, అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు అబ్దుల్ సలీం మాట్లాడుతూ సంయుక్తా కిసాన్ మోర్చా (ఎస్ కె ఎం) జాతీయ కమిటీ పిలుపుమేరకు తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలలో నవంబర్ 26న రైతు ప్రదర్శనలు ధర్నాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. 2021 డిసెంబర్ 9న కేంద్ర ప్రభుత్వం సయుక్తా కిసాన్ మోర్చా నాయకులకు కేంద్ర ప్రభుత్వం దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశ రైతాంగానికి క్షమాపణ చెప్తూ రైతుల సమస్యల పరిష్కారానికై ఇచ్చిన రాతపూర్వక హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్వామినాథన్ సిఫారాసుల కనుగొనంగా రైతులు పండించిన అన్ని పంటలకు కనీస మద్దతు ధరలు( సి2± 50% ) గ్యారెంటీ చట్టం చేసి అమలు చేయాలి. విద్యుత్ సవరణ బిల్లును రద్దు చేయాలి. దేశవ్యాప్తంగా రైతులు వ్యవసాయ కార్మికులకు సమగ్ర రుణమాఫీ పథకాన్ని ప్రకటించాలన్నారు.మైక్రో ఫైనాన్స్ వడ్డీ రేటును నియంత్రించి రుణ గ్రహితులను చట్టవిరుద్ధంగా వేధించి దోపిడీకి గురి చేసే మైక్రో ఫైనాన్స్ లపై చట్టమైన చర్యలు తీసుకోవాలి. రైతులకు వడ్డీ రుణాలు ఇచ్చుటకై ఆర్బిఐ మిగులను నాబార్డ్ సంస్థకు బదిలీ చేయాలన్నారు. భారతదేశంపై అమెరికా 50 శాతం వాణిజ్య సుంఖాన్ని రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి కాశీనాథ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్, ప్రశాంత్, ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జయలక్ష్మి, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కొండ నరసింహులు, నారాయణ, పి వై ఎల్ రాష్ట్ర అధ్యక్షులు రామకృష్ణ, ఉపాధ్యక్షులు మహేష్, హాజీ మలంగ్, సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గోవిందరాజ్, బలరాం, టి యు సి ఐ జిల్లా ఉపాదక్ష కార్యదర్శులు నరసింహులు, బోయిన్పల్లి రాము, అరుణోదయ జిల్లా కార్యదర్శి అంజి, తాయప్ప, విజయ్ బాబు, ప్రకాష్ , పి డి ఎస్ యు రాష్ట్ర సహాయ కార్యదర్శి సాయికుమార్, జిల్లా కార్యదర్శి మహేష్ ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు పవన్,భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ లో అధికారులు, సిబ్బందితో భారత రాజ్యాంగ ప్రవేశిక ప్రతిజ్ఞ..



మేడ్చల్, నవంబర్ 26,(వుదయం ప్రతినిధి),భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, డిఆర్ఓ హరిప్రియలు వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బందితో భారత రాజ్యాంగ ప్రవేశిక ప్రతిజ్ఞ చేయించారు. భారత ప్రజలమైన మేము, భారతదేశాన్ని సర్వసత్తాకసామ్యవాద లౌకిక ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగా నిర్మించుకోవడానికి పౌరులందరికీ సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని, ఆలోచన, భావప్రకటన, విశ్వాసం, ధర్మం, ఆరాధనల స్వాతంత్ర్యాన్ని, స్థితిగతుల్లోనూ, అవకాశాల్లోనూ సమానత్వాన్ని చేకూర్చడానికి అందరిలో వ్యక్తిత్వ గౌరవాన్ని, జాతీయ సమైక్యతను సంరక్షిస్తూ సౌభ్రాతృత్వాన్ని పెంపొందించడానికి మన ఈ రాజ్యాంగ పరిషత్ లో 1949, నవంబర్ 26 వ తేదీన రాజ్యాంగ పరిషత్ లో తీర్మానం చేసుకొని శాసనంగా రూపొందించుకున్న ఈ రాజ్యాంగాన్ని మాకు మేము సమర్పించుకుంటున్నామని అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు.

## ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి: జిల్లా ఎస్పీ నితిక పంత్




ఆసిఫాబాద్, నవంబర్ 26, (వుదయం ప్రతినిధి ) గ్రామపంచాయతీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, నిర్వహణా ప్రమాణాలకు అనుగుణంగా నిర్వహించేందుకు జిల్లా ఎస్పీ నితికా పంత్ జిల్లా పోలీస్ కార్యాలయం నుండి జిల్లా పోలీస్ అధికారులు, ఎస్ హెచ్ ఓ లతో వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొని, ఎన్నికల భద్రత, శాంతి భద్రతా చర్యలు, పర్యవేక్షణకు సంబంధించిన సూచనలు, సలహాలు ఎస్పీ అధికారులకు తెలియజేశారు. ఎస్పీ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది అప్రమత్తతతో విధులు నిర్వహించాలని సూచించారు. జిల్లాలో ఎన్నికల నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేయాలని, ఎన్నికలలో ఓటర్లను ప్రభావితం చేయడానికి అక్రమంగా డబ్బు, మద్యం లేదా ఇతర పదార్థాలు రాకుండా చెక్‌పోస్టుల వద్ద ఇతర శాఖల సమన్వయంతో తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు.విజిబుల్ పోలిసింగ్, నాకబందీలు, ఆకస్మిక తనిఖీలు నిరంతరం జరగాలని తెలిపారు. ఎస్ హెచ్ ఓలు, వీపీవోలు ప్రతి గ్రామాన్ని సందర్శించి పోలింగ్ కేంద్రాలను పరిశీలించడంతో పాటు గ్రామాల్లో పెట్రోలింగ్ ను మరింత బలోపేతం చేయాలని సూచించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించాలని అన్నారు.సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు, ఇతరుల భావోద్వేగాలను దెబ్బతీసే విధమైన చర్యలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఎస్పీ పేర్కొన్నారు. అలాగే లాడ్జీలు, గెస్ట్ హౌసులు, కమ్యూనిటీ హాలులు, ఫంక్షన్ హాలుల్లో నిరంతరం తనిఖీలు నిర్వహిస్తూ, అనుమానితుల కదలికలను పర్యవేక్షించాలన్నారు.ఎన్నికలకు సంబంధించిన అంశాల్లో, రాజకీయ కార్యకలాపాల్లో పోలీస్ సిబ్బంది ఎలాంటి ప్రమేయం ఉండకూడదని హెచ్చరించారు. విధుల్లో నిర్లక్ష్యం లేదా నిబంధనల ఉల్లంఘన చోటుచేసుకుంటే శాఖాపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.గత ఎన్నికల్లో వివాదాస్పద కేసుల్లో, అలాగే ఇతర కేసుల్లో నమోదైన రౌడీషీటర్లను బైండోవర్ చేసి వారికి కౌన్సిలింగ్ నిర్వహించాలని సూచించారు. రేపటి నుంచి ప్రారంభమయ్యే నామినేషన్ ప్రక్రియ సందర్భంగా నామినేషన్ కేంద్రాల వద్ద పకడ్బందీగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీ గారితో పాటు ఏఎస్పీ చిత్తరంజన్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రాణా ప్రతాప్, డీసీఆర్‌బీ ఇన్స్పెక్టర్ శ్రీధర్, ఐటీ కోర్ ఇన్స్పెక్టర్ రవీందర్ మరియు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## మత్తుపదార్థాలు, సైబర్ నేరాలపై షీ టీమ్ అవగాహన




ఆసిఫాబాద్, నవంబర్ 26, (వుదయం ప్రతినిధి)జిల్లా ఎస్పీ నితిక పంత్ ఆదేశాల మేరకు కాగజ్ నగర్ 'షీ' బృందం, కాగజ్నగర్ పట్టణంలోని తెలంగాణ మైనారిటీ బాలుర వసతి గృహంలో మత్తు పదార్థాలు మరియు సైబర్ నేరాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు వేధింపులు, ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలు, మత్తుపదార్థాల వినియోగం, ఎన్‌డిపిఎస్ చట్టంలోని నిబంధనలు మరియు వాటి నివారణ చర్యల గురించి వివరించారు.ఏవైనా అనుమానాస్పద సంఘటనలు గమనించిన వెంటనే 'షీ' బృందం నెంబర్ 8712670565 కు సమాచారం అందించాలని సూచించారు. ఇతర చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో భాగంగా మొబైల్ ఫోన్‌ల వినియోగంలో జాగ్రత్తలు తప్పనిసరి అని, సామాజిక మాధ్యమాల్లో తెలియని వ్యక్తుల స్నేహ అభ్యర్థనలు అంగీకరించకూడదని, వ్యక్తిగత వివరాలు లేదా చిత్రాలను పంచుకోవద్దని, అనుమానాస్పద కాల్స్ లేదా సందేశాలు వచ్చినప్పుడు వెంటనే పెద్దలకు లేదా ఉపాధ్యాయులకు తెలియజేయాలని విద్యార్థినులకు సూచించారు.ఈ కార్యక్రమంలో కాగజ్నగర్ 'షీ' బృందం ఏ.ఎస్.ఐ సునీత, కానిస్టేబుళ్లు రమ, సునీత, శ్రీనివాస్, మైనారిటీల వసతి గృహం ప్రధానోపాధ్యాయురాలు కె. ప్రతిభ, అధ్యాపకులు మరియు విద్యార్థినిలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే నాగరాజును కలిసిన జివిఎస్ఆర్ కాలనీవాసులు



హనుమకొండ, నవంబర్ 26 (వుదయం జిల్లా ప్రతినిధి) :గుండ్ల సింగారం లోని జి వి ఎస్ ఆర్ కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు కాలనీలోని పలు సమస్యల పైన స్థానిక వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు ని కలిసి కాలనీ,పలు సమస్యల పైన సిసి రోడ్స్, డ్రైనేజీ సిస్టం, విద్యుత్ స్తంభాలు గురించి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఎమ్మెల్యే స్థానికులంగా స్పందించి తక్షణమే అభివృద్ధి పనులు మొదలు పెడతానని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు. మాజీ జెడ్పిటిసి సింగులాలు,జి వి ఎస్ ఆర్ కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు కుక్కల రాజు, ఉపాధ్యక్షులు రుద్రారం ప్రశాంత్, ప్రధాన సలహాదారుడు కుక్కమూడి వంశీ, కోశాధికారి వైనాల యాకయ్య, కమిటీ సభ్యులు మల్లయ్య, పరమాత్మ, కొమురయ్య, సుమన్, దాసరి అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

# చిట్యాల ఆదర్శ పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవ సంబరాలు



భూపాలపల్లి నవంబర్ 26 (వుదయం ప్రతినిధి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రంలో ఉన్న ఆదర్శ పాఠశాల కళాశాలలో ప్రిన్సిపాల్ మేకల రమేష్ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి వాసాల వెంకటేశ్వర్లు సమక్షంలో భారత రాజ్యాంగం ఆవోదించబడి 76 వసంతాలలో అడుగిడిగిన సందర్భంగా భారత రాజ్యాంగ రూపశిల్పి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా రాజ్యాంగ సంబరాలు జరుపుకున్నారు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పాఠశాల కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిన్నతనం నుండి ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొని అవమానాలను ఎదిరించి అక్షరమే ఆయుధంగా చేతబట్టి ఒక గొప్ప మహానీయుడిగా విద్యావేత్తగా సకల భాష కోవిదుడుగా ఎదిగినటువంటి వ్యక్తి అని అన్నారు అంబేద్కర్ రాజ్యాంగం రాయడానికి తన మేధా సంపత్తిని వినియోగించి అనేకమైనటువంటి గ్రంథాలను చదివి ఒక నిర్ణయానికి వచ్చిన తర్వాతనే మనకు ఇంత గొప్పనైనటువంటి భాగ్యాన్ని అందించారు అని అన్నారు కష్టపడి చదవడం సమస్యలను ఎదుర్కోవడము పోరాటపటిమ కలిగినటువంటి వ్యక్తిత్వం తనకు తానే నిదర్శనమని కొనియాడారు ఈ కార్యక్రమంలో పాఠశాల కళాశాల వైస్ ప్రిన్సిపాల్, నీలం రవీందర్ సమీరా, వాణి, ధనలక్ష్మి ఆయేషా, జోష్ణ, దివ్య, రామస్వామి భాస్కర్ పి టి అశోక్ మోరే సాగర్, పుట్టరాజు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# నిరాశలో అర్హులు.. అనర్హులకు పండుగ

❖ నిర్లక్ష్యం చేస్తున్న అధికారులు గందరగోళంలో పింఛన్ల పంపిణీ



పెద్దపల్లి జిల్లా, నవంబర్ 26 (వుదయం ప్రతినిధి)కాల్వ శ్రీరాంపూర్ మండలంలో పింఛన్ల వ్యవస్థలో జరుగుతున్న అక్రమాలు ప్రజల ఆవేదనను మరింత భగ్గుమన్నాయి. అర్హులపై అన్యాయం జరుగుతుండగా, అనర్హులు బోగస్ సర్టిఫికెట్లతో లబ్ధి పొందుతున్నారని గ్రామస్థులు మండిపడుతున్నారు.సమగ్ర విచారణ చేయకుండా పింఛన్లు మంజూరు చేసిన వారిపై తక్షణ కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు ఘోరంగా డిమాండ్ చేస్తున్నారు.నిర్లక్ష్య ధోరణితో "చూసి చూడనట్టు" వ్యవహరించిన గ్రామ%-%మండల%-%జిల్లా స్థాయి అధికారులను తక్షణమే బాధ్యతలు నిలిపివేయాలని ప్రజల ఆవేదన.భర్తలు ఉన్నప్పటికీ కొందరు మహిళలు విధవ పింఛన్లు పొందుతున్న సంఘటనలు, ప్రజల్లో తీవ్రమైన అసంతృప్తి రేపుతున్నాయి.తక్కువ శాతం అంగవైకల్యం ఉన్నవారికి రాజకీయ అండదండలతో అధిక శాతం సర్టిఫికెట్లు ఇవ్వడం, అర్హులుగా ఎదురు చూస్తున్నవారిని మరింత నిరాశలోకి నెట్టింది.ప్రజల మాటల్లో: "సమగ్ర విచారణ చేయకుండా పింఛన్ మంజూరు చేసిన అధికారులు ఎవరో బయటపెట్టాలి. బాధ్యులపై చర్యలు తీసుకోకపోతే సమస్య మరింత పెరుగుతుంది. బోగస్ సర్టిఫికెట్లు ఇచ్చినవారు, వాటిని ఆమోదించినవారు, నిర్లక్ష్యం చేసినవారు ఎవరినీ వదిలిపెట్టకూడదని ప్రజలు స్పష్టం చేస్తున్నారు.సంబంధిత ప్రభుత్వ శాఖలు ఈ రోజు ఈ సమస్యపై స్పందించాలి, లేదంటే జిల్లా స్థాయిలో ఉద్యమాలు తప్పవని స్థానికులు హెచ్చరిస్తున్నారు."పింఛన్ ముఠాను కాపాడే వాళ్లను కఠినంగా శిక్షించాలి%ాా% అర్హుల కన్నీళ్లు తుడిచేలా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుక్షోవాలి!" అని ప్రజల గళం ఘాటుగా వినిపిస్తోంది.

# ప్రతీక్ కళ్ళు సజీవం



పెద్దపల్లి నవంబర్ 26(వుదయం ప్రతినిధి): కన్నవేన ప్రతీక్ %ూా/ూా% కుమారస్వామి పెద్దపల్లి గారు పెద్దపల్లిలోని సెంటెన్స్ స్కూల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థి పాఠశాల ఆవరణలో ఆటల సమయంలో ప్రమాదవశాత్తు క్రింద పడడం జరిగింది. ఆ తర్వాత పెద్దపెల్లి ఆసుపత్రి మరియు కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా అతడు మరణించడం జరిగింది. ప్రతీక్ తండ్రిగారైన కుమారస్వామి గారు లైన్స్ క్లబ్ పెద్దపెల్లి ఎలైట్ ఆధ్వర్యంలో తన కుమారుడు మరణించిన అతని కళ్ళు సజీవంగా ఉండాలని అతని రెండు కళ్ళను ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రికి దానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా వేల్పూర్ సంపత్ రావు గారు మాట్లాడుతూ ప్రతీక్ మరణానికి సంతాపం తెలియజేస్తూ అతని ఆత్మకు శాంతి చేకూరాలని మరియు వారి కుటుంబానికి మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆ భగవంతున్న వేడుకోవడం జరిగింది . ఈ కార్యక్రమంలో వేల్పూరి సంపత్ రావు గారు, మాధవి గారు, ఎల్వి ప్రసాద్ సిబ్బంది గాజుల సతీష్, సయ్యద్ అతిఫ్ గారు ,సతీష్ గారు మరియు వారి కుటుంబ సభ్యులు పాల్గొనడం జరిగింది.

# రాజ్యాంగమే పౌరులకు రక్షణ కవచం ప్రధానోపాధ్యాయురాలు భారతి



నారాయణపేట టౌన్ నవంబర్ 26(వుదయం ప్రతినిధి): రాజ్యాంగమే పౌరులకు రక్షణ కవచమని జాజాపూర్ జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భారతి అన్నారు.జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జాజాపూర్ లో భారత రాజ్యాంగం ఆమోదించిన సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు భారతి మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని ఆమోదించిన జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం నవంబర్ 26న మన దేశంలో సంవిధాన్ దివస్ అని కూడా పిలువబడే రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకుంటారు. 1949 నవంబర్ 26న, భారత రాజ్యాంగ సభ భారత రాజ్యాంగాన్ని ఆమోదించింది , ఇది 1950 జనవరి 26 నుండి అమల్లోకి వచ్చింది.రాజ్యాంగ దినోత్సవం భారత రాజ్యాంగాన్ని రాజ్యాంగ సభ ఆమోదించిన జ్ఞాపకార్థం ఈ వేడుకలు నిర్వహించినట్లు ఆమె తెలిపారు. దీని చివరి సమావేశం నవంబర్ 26, 1949న ముగిసింది. రెండు నెలల తర్వాత, జనవరి 26, 1950న, 284 మంది సభ్యులు సంతకం చేసిన తర్వాత రాజ్యాంగంఅమల్లోకి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో మధుసూదన్,భాను ప్రకాష్, శశిరేఖ, నిర్మల, శిరీష, శ్రీదేవి,నరసింహ,రఘురాం రెడ్డి, వెంకటేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

# పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన ఏఎస్పి వసుంధర యాదవ్ ఐపీఎస్



ఏన్కూరు నవంబర్ 26 (వుదయం ప్రతినిధి) కల్లూరు ఏఎస్పీ వసుంధర యాదవ్, ఐ పి ఎస్, ఎన్కూర్ పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె స్టేషన్ రికార్డులన్నింటినీ సమీక్షించి, స్వాధీనం చేసుకున్న వాహనాలను ధృవీకరించి సీసీఎన్ టీ 2.0, ఇ-సమన్సులు మరియు టీఎస్-సిఓపి లను కఠినంగా ఉపయోగించాలని సిబ్బందిని ఆదేశించారు. పెండింగ్ ఎఫ్ ఐ ఆర్ లను పరిశీలించి, చురుకైన పోలీసు వ్యవస్థపై దృష్టి పెట్టాలని, రౌడీ ముకలు మరియు నేర చరిత్ర-రౌడీ షీటర్లపై నిఘా ఉంచాలని బృందానికి సూచించారు. సమర్థవంతమైన క్షేత్ర పర్యవేక్షణ కోసం కానిస్టేబుళ్లను గ్రామ పోలీసు అధికారులు విపిఓలుగా నియమించాలని ఆమె ఎస్సై సంధ్యకి ఆదేశించారు. స్థానిక నిఘాను బలోపేతం చేయడానికి సీసీటీవీ కెమెరాల ఏర్పాటుపై కమ్యూనిటీ అవగాహన ప్రచారాన్ని ప్రారంభించాలని ఏసీపీ సిబ్బందికి సూచించారు. సి ఐ ఆర్ పోర్టల్ ద్వారా దొంగిలించబడిన మొబైల్ ఫోన్లను త్వరగా రికవరీ చేయాలని ఆమె నొక్కి చెప్పారు. తరువాత, ఆమె పోలీస్ స్టేషన్ పరిధిలోకి వెళ్లి పలు ప్రదేశాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో సీఐ ముత్తు లింగం ఎస్ ఐ సంధ్య పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన




జయశంకర్ భూపాలపల్లి నవంబర్ 26(వుదయం జిల్లా ప్రతినిధి): భూపాలపల్లి జిల్లాలోని గాంధీనగర్, బుద్ధారం, ఘన్‌పూర్ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా పౌర సరఫరాల అధికారి కిరణ్‌కుమార్ డీఎం, సీఎస్‌సీ రాములు, యూడీఆర్ఐ అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు.ఈ సందర్భంగా పౌర సరఫరాల అధికారి ఇన్‌చార్జీలను ఉద్దేశించి మాట్లాడుతూ, ఎఫ్ఏక్యూ ప్రమాణాల మేరకు మాత్రమే ధాన్యం కొనుగోలు చేయాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు కొనుగోలు చేసిన ధాన్యం వెంటనే సంబంధిత బియ్యపు మిల్లులకు తరలించేలా చర్యలు చేపట్టాలని, కేంద్రాలలో తూకం, బిల్లింగ్, రవాణా ప్రక్రియలను పర్యవేక్షిస్తూ పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా పూర్తిస్థాయిలో బాధ్యతతో పని చేయాలని ఈ సందర్భంగా సూచించారు.ఆర్ ఐ సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రంలో పశువులు మేత పర్యవేక్షణ కరువు



జయశంకర్ భూపాలపల్లి నవంబర్ 26(వుదయం జిల్లా ప్రతినిధి): ప్రభుత్వంతోపాటు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ లు రైతులకు నష్టం వాటిల్లకుండా రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రతి క్షణం అధికారులను అప్రమత్తం చేస్తూ పలు సలహాలు సూచనలు ఆదేశిస్తున్నప్పటికీ కింది స్థాయి అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాకులు అశ్రద్ధ వహిస్తున్నారని ఆరోపణలు వెలువెత్తుతున్నాయి రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యానికి ధర వస్తుందన్న ఆశతో కొనుగోలు కేంద్రానికి తరలిస్తే పట్టించుకునే వారు లేక ధాన్యం పశువుల పాలు అవుతున్నాయి మహాదేవపూర్ మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం వద్ద కాపలాదారులు లేక సిబ్బంది పట్టింపు లేని తనంతో ఆరబెట్టిన ధాన్యం పశువుల పాలవుతున్నది.కొనుగోలు కేంద్రం ప్రారంభించి 24గంటలు గడవక ముందే ధాన్యం కొనుగోలు కేంద్రంలో పశువులు మేస్తుండడంతో కొనుగోలు కేంద్రం నిర్వాహకుల నిర్లక్ష్యంపై గ్రామస్తుల్లో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.గత సంవత్సరం వర్షాలకు ధాన్యం తడవడంతో కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకపోవడం నిర్వాహకుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కొనుగోలు కేంద్రాల వద్ద సౌకర్యాలు కల్పించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

# రాజ్యాంగమే పౌరులకు రక్షణ కవచం ప్రధానోపాధ్యాయురాలు భారతి



నారాయణపేట టౌన్ నవంబర్ 26(వుదయం ప్రతినిధి) జ్యాంగమే పౌరులకు రక్షణ కవచమని జాజాపూర్ జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భారతి అన్నారు.జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జాజాపూర్ లో భారత రాజ్యాంగం ఆమోదించిన సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు భారతి మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని ఆమోదించిన జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం నవంబర్ 26న మన దేశంలో సంవిధాన్ దివస్ అని కూడా పిలువబడే రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకుంటారు. 1949 నవంబర్ 26న, భారత రాజ్యాంగ సభ భారత రాజ్యాంగాన్ని ఆమోదించింది , ఇది 1950 జనవరి 26 నుండి అమల్లోకి వచ్చింది.రాజ్యాంగ దినోత్సవం భారత రాజ్యాంగాన్ని రాజ్యాంగ సభ ఆమోదించిన జ్ఞాపకార్థం ఈ వేడుకలు నిర్వహించినట్లు ఆమె తెలిపారు. దీని చివరి సమావేశం నవంబర్ 26, 1949న ముగిసింది. రెండు నెలల తర్వాత, జనవరి 26, 1950న, 284 మంది సభ్యులు సంతకం చేసిన తర్వాత రాజ్యాంగంఅమల్లోకి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో మధుసూదన్,భాను ప్రకాష్, శశిరేఖ, నిర్మల, శిరీష, శ్రీదేవి,నరసింహ,రఘురాం రెడ్డి, వెంకటేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

# భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు

♦ మున్సిపల్ కమిషనర్ రవీందర్



కోరుట్ల నవంబర్ 26 (వుదయం ప్రతినిధి) కోరుట్ల మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ రవీందర్ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి అనంతరం రాజ్యాంగ ప్రవేశిక చదివి నివాళులు అర్పించారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవీందర్ తో పాటు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# 76వ భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన అంబేద్కర్ యువజన సంఘం



భూపాలపల్లి నవంబర్ 26 (వుదయం ప్రతినిధి): భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ నేషనల్ అవార్డు గ్రహీత అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షులు మంగళపల్లిశ్రీనివాస్ఆధ్వర్యంలోజయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మొగుళ్ళపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద76వ భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షులు మంగళపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు అనంతరం మంగళపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ భారత రాజ్యాంగనీ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాయడం వల్ల నిరుపేదలైన ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ ఓసి లో ఉన్న నిరుపేదలకు న్యాయం జరిగే విధంగా రాజ్యాంగని రాయడం జరిగింది 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కును కల్పించి ప్రజాస్వామ్యంలో మనిషిగా గుర్తించిన గొప్ప వ్యక్తి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఈరోజు భారతదేశంలో ఉన్నటువంటి పౌరులు అందరు సమాన హక్కు కల్పించింది కుల మతాలకు అతీతంగా సమాజంలో ఉన్న మానవులంతా ఒకటేనని రాసినటువంటి గొప్ప వ్యక్తి ఆరోజు రాజ్యాంగాన్ని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాయకుండా ఉండి ఉంటే భారత దేశంలోని ప్రజలు ఈ విధంగా ఉండేవారు కాదన్నారు ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం జిల్లా నాయకులు బండారి రాజు, అంబేద్కర్ యువజన సంఘం గ్రామ శాఖ అధ్యక్షులు బండారి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీల ప్రయోజనాలను బలి చేయొద్దు

➢ బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ దాసరి ఉష

➢ ప్రభుత్వాల మొండి వైఖరికి నిరసనగా దిష్టిబొమ్మల దహనం



పెద్దపల్లి,నవంబర్ 26(వుదయం ప్రతినిధి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ దాసరి ఉష తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. బీసీల ప్రయోజనాలను విస్మరించొద్దని,తక్షణమే 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ బుధవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని బస్టాండ్ చౌరస్తా వద్ద గల అంబేద్కర్ విగ్రహం ఎదుట బీసీ నాయకులతో కలిసి దాసరి ఉష జీవో 46 ప్రతులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా జిల్లా బీసీ జేఏసీ చైర్మన్ దాసరి ఉష మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గత రెండేళ్లుగా బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చి,నేడు మోసం చేసిందని ఆరోపించారు. 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని గతంలో అన్ని పార్టీలు మద్దతు తెలిపినప్పటికీ, రేవంత్ సర్కార్ బీసీల ఆశలను తుంచి వేస్తూ జీవో 9ని రద్దు చేసి,దానికి బదులుగా జీవో 46ను తీసుకువచ్చిందని,ఇది బీసీల ప్రయోజనాలను బలి చేస్తోందని ఆమె ధ్వజమెత్తారు. 42 శాతం రిజర్వేషన్ల ప్రధాన డిమాండ్‌తో రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు, షాపుల బంద్ చేపట్టినా ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని,అందువల్ల ప్రభుత్వాల మొండి వైఖరికి నిరసనగా రాష్ట్ర,కేంద్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మలను దహనం చేస్తున్నామని దాసరి ఉష స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా బీసీల ఓట్లతో గెలిచిన ప్రభుత్వాలు తమ మొండితనాన్ని వీడి,తక్షణమే రద్దు చేసిన జీవో 9ని మళ్లీ అమలు చేయాలని,బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు వెంటనే కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. బీసీలకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని, లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ జిల్లా వర్కింగ్ చైర్మన్ నల్లవెల్లి శంకర్,వైస్ చైర్మన్ కొండి సతీష్,జిల్లా మరియు మండల కన్వీనర్లు సలేంద్ర కొమ్రయ్య,బి. భూమేష్,ఆసారి రాజయ్య యాదవ్,కన్న రమేష్ గౌడ్,తోట రాజ్‌కుమార్,నోముల శ్రీధర్,బి. భూమయ్య, కొండయ్య,అలువాల రాజేందర్,కలవేన రాజేందర్,డి. అశోక్, జి. రమేష్ తోపాటు తదితరులు పాల్గొన్నారు.

# 76వ భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు




రాయపర్తి నవంబర్ 26 (వుదయం ప్రతినిధి ):ప్రతి పౌరుడు రాజ్యాంగంపై అవగాహన కలిగి ఉండాలని మండల తహసిల్దార్ ఎం శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో అంబేద్కర్ బాబు జగ్జీవన్ రామ్ మహాత్మ జ్యోతిరావు పూలే సావిత్రిబాయి పూలే నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగం దినోత్సవం పురస్కరించుకొని ముఖ్య అతిథులుగా మండల తహసిల్దార్ ఎం శ్రీనివాస్ దళిత రత్న అయిత యాకయ్య గారే కృష్ణమూర్తి దళిత రత్న అయిత మల్లేష్ విచ్చేసి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో భారత రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి యువత డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు బానిసలై వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు భవిష్యత్ భారతాన్ని నిర్మించడంలో విద్యార్థుల పాత్ర కీలకంగా ఉంటుందని ఆ సమయంలో విద్యార్థులు చేయడం మార్గాలను విస్మరించి సమాజ శ్రేయస్సు కు కృషి చేయాలని ఆయన అన్నారు. విద్యార్థి దశ నుండి భారత రాజ్యాంగం చూపిన మార్గాన్ని అనుసరిస్తూ స్ఫూర్తిదాయకంగా విద్యావేత్తలుగా ఎదగాలని ఆయన అన్నారు. స్వతంత్రం వచ్చే నాటికి భారతదేశ మనగడ పై విమర్శలు గుప్పించిన వారికి మన రాజ్యాంగం యొక్క ఔనుత్యాన్ని గొప్పతనాన్ని రచించిన అమలు చేసిన మహనీయులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని ఆయన కొనియాడారు. మన శరీరంలో గుండె ఎంత ముఖ్యమో భారత రాజ్యాంగం కూడా అంతే ముఖ్యమైందని ఆయన పేర్కొన్నారు. వ్యాస రచన పోటీలో గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ 1000 నగదు రాజ్యాంగ పుస్తకం,ద్వితీయ 7 నగదు రాజ్యాంగ పుస్తకం,తృతీయ 500 నగదు రాజ్యాంగపుస్తకం , రాజ్యాంగ పుస్తకం , , కన్సోలేషన్ బహుమతులు, లకు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సుంకరి రాజు, ఉపేందర్, అంబేద్కర్ వాదులు ఐత సారయ్య, అయిత బాబు, గిద్దె ఎల్లయ్య, గారే బిక్షపతి, ఉబ్బని సింహాద్రి, అయిత అనిల్, సోడపు శ్రీనివాస్, చెడుపాక నాగేష్, అయిత యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్ రిజర్వేషన్లలో బీసీలకు తీవ్ర అన్యాయం

♦ టీఆర్‌పీ జిల్లా అధ్యక్షుడు కాసిపేట ఉదయ్



పెద్దపల్లి,నవంబర్ 26(వుదయం ప్రతినిధి): సర్పంచ్ ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన 17 శాతం బీసీ రిజర్వేషన్లు బీసీలను మోసం చేయడమేనని తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షుడు కాసిపేట ఉదయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఆయన,బీసీలకు కేటాయించిన కేవలం 17 శాతం రిజర్వేషన్ అనేది వారిని మోసం చేయడమేనని ఆరోపించారు. రాష్ట్రంలోని మొత్తం 12,375 గ్రామాలలో కేవలం 2,176 గ్రామాలు మాత్రమే బీసీలకు కేటాయించడం సిగ్గుచేటని ఆయన విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన రెడ్డి కుల అహంకారాన్న ప్రదర్శించారని,ఇంత దారుణమైన తీర్పునిచ్చినందుకు ఆయన ముఖ్యమంత్రి పదవికి అనర్హుడని,తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోని బీసీ ఎమ్మెల్యేలు వెంటనే తమ పదవులకు రాజీనామా చేసి, బీసీలకు మద్దతుగా నిలబడాలని ఆయన పిలుపునిచ్చారు,లేకపోతే వారు బీసీ ద్రోహులుగా మిగిలిపోతారని హెచ్చరించారు. నల్లగొండ డీసీసీ అధ్యక్షుడిగా బీసీ నేతను ప్రకటించినప్పుడు కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అడ్డు చెప్పడాన్ని ఆయన కుల రాజకీయాలకు పరాకాష్టగా అభివర్ణించారు. బీసీలు ఏకమై ఈ రెడ్డి ప్రభుత్వాన్ని కూలదోసి,బీసీ రాజ్యాధికారాన్ని స్థాపించాలని పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికలలో బీసీలు ఏకమై, రెడ్డీలను ఓడిస్తారని హెచ్చరించారు. సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసే బీసీ అభ్యర్థులందరికీ టీఆర్‌పీ అండగా ఉంటుందని ఉదయ్ హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు గుండవేనా స్వామి,సోషల్ మీడియా జిల్లా అధ్యక్షులు అడ్లూరి గంగారాం,ఉమ్మల్ల రాజేందర్, బొమ్మా జాషువ,నంపూలి శివదాస్,బెజంకి రమేష్,పోలుదాసరి రాజయ్య,నర్ల శ్రీనివాస్,కంపల్లి మారుతీ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా భారత రాజ్యాంగం దినోత్సవ వేడుకలు




ధర్మపురి నవంబర్ 26(వృదయం విలేకరి): భారత రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని బుధవారం పట్టణంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు చెందోలి శ్రీనివాస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద రాజ్యాంగ పుస్తకానికి,అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి వేడుకలు ఘనంగా నిర్వహిం చారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు చందోలి శ్రీనివాస్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ దినోత్సవాన్ని “సంవిధాన్ దివస్” అనికూడా అంటారని,భారత దేశం రాజ్యాంగాన్ని స్వీకరించిన సందర్భంగా నవంబర్26న రాజ్యాంగ దినోత్సవం నిర్వహిస్తారని తెలిపారు.ఈ రాజ్యాంగం ద్వారానే ఎస్సీ వర్గీకరణ జరిగిందని గుర్తు చేశారు.స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం అనే మూడు స్తంభాలపై నిలిచిన మహెూన్నత గ్రంథం,భారత జాతికి గౌరవ ప్రతీక అని అన్నారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల రాష్ట్ర కార్యదర్శి పరపెల్లి రాజమల్లయ్య,దళిత సంఘాల నాయకు లు పరపెల్లి లక్ష్మణ్,బత్తిని నరేష్,రాయిళ్ళ రవికుమార్,మరంపెల్లి చంద్రయ్య, పసుల బుచ్చయ్య,దుర్గం రవి, చిలుముల. బాబు, దుమ్మళ్ళ పూర్ణ చందర్,ఒరగంటి వంశి, బొల్లరపు ప్రణయ్, బత్తిని సుధాకర్,బత్తిని అరవింద్,దుమ్మ ళ్ళ రాహుల్,బత్తిని వినయ్, బొల్లరపు వినయ్,బడుగు సుజిత్,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మరకత లింగ, శిఖర ప్రతిష్ఠ మహెూత్సవ వేడుకలు



కుత్బుల్లాపూర్, నవంబర్ 26,(వృదయం ప్రతినిధి): నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్, శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయం ఛైర్మెన్ కోలన్ నీలా గోపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు కోలన్ గోపాల్ రెడ్డి ముఖ్య అతిథులుగా 12వ డివిజన్ ఇందిరమ్మ కాలని ఫేస్ 2 లో శ్రీశ్రీశ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయంలో శ్రీ లలితా త్రిపుర సుందరి సమేత మహా మృత్యుంజయేశ్వర (మరకత లింగం) సహిత నందీశ్వర, సుబ్రహ్మణ్యస్వామి, శిఖర ప్రతిష్ఠా మహెూత్సవం వేడుకలలో భాగంగా శివ లింగం ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకలో మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, సీనియర్ నాయకులు సుదర్శన్ రెడ్డి, ఆలయ కమిటీ ప్రెసిడెంట్ సుబ్బారెడ్డి, సీనియర్ మహిళా నాయకురాలు సబిత జలంధర్ రెడ్డి,ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక డివిజన్ ఆయా కాలనీ వాసులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సంవిధాన్ దివస్




జన్నారం, నవంబర్ 26(వృదయం విలేకరి) భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పోనకల్ పాఠశాలలో ఘనంగా నిర్వహించుకున్నారు. బుధవారం జన్నారం మండలంలోని పోనకల్ ఎంపీపీఎస్ లో 76వ భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా పాఠశాల విద్యార్థులు రాజ్యాంగ పీఠికను పఠించి మువ్వన్నెల పతాకాలను ప్రదర్శించారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు రాజ్యాంగం ప్రాముఖ్యతను తెలియజేస్తూ రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించి నడుచుకోవాలని విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఛైర్ పర్సన్ మూల రేణుక, ఉపాధ్యాయులు కస్తూరి శ్రీకాంత్, బి.వనిత పాల్గొన్నారు.

## పాఠశాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



మహబూబ్ నగర్ 26 నవంబర్ (వృదయం ప్రతినిధి): భూత్పూర్ మండలం అమిస్తాపూర్ గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను బుధవారం జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 5వ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ విద్యార్థులు రోజు ఎలా చదువుతున్నారు? రోజు స్కూల్ కి వస్తున్నారా? ప్రశ్నలు అడిగి వారి నుంచి సమాధానాలు రాబట్టారు. పాఠశాలకు హాజరు కానీ విద్యార్థులు ఉన్నారా అని కలెక్టర్ అడిగారు. ప్రతి రోజు పాఠశాలకు విద్యార్థులు హాజరై ఉపాధ్యాయులు చెప్పిన బోధన పాఠ్యాంశాలు విని పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని వారికి తెలిపారు. అక్షయపాత్ర ద్వారా అందిస్తున్న మధ్యాహ్న భోజనం ను పరిశీలించారు అక్కడున్న ఉపాధ్యాయులతో తో మాట్లాడుతూ పాఠశాలలో ఉపాధ్యాయులతో విద్యార్థుల సంఖ్య ఎంత అని అడిగి పాఠశాల విద్యార్థుల సంఖ్య 144 ఉంది అని చెప్పారు . బోధన ప్రమాణాలు మరింత మెరుగుపరిచేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు ఆదేశించింది. అక్కడున్న ఉపాధ్యాయులను స్కూల్ సమస్యలను గురించి అడిగి తెలుసుకుంది. నిర్మాణంలో టాయిలెట్స్ పనులు అసంపూర్తిగా ఉన్నాయని తెలిపారు.

# అనాదిగా బీసీలను మోసం చేస్తుంది కాంగ్రెస్సే

- ♦ సమన్వయంతో సర్పంచ్ అభ్యర్థులను ఎంపిక చేయండి
- ♦ మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్




జయశంకర్ భూపాలపల్లి (మంథని)నవంబర్ 26(వృదయం జిల్లా ప్రతినిధి): అనాదిగా బీసీ సామాజికవర్గాన్ని మోసం చేస్తుంది కాంగ్రెస్ పార్టీనేనని, నెహ్రూ నుంచి మొదలు రాహుల్ గాంధీ వరకు మోసం చేస్తూనే ఉన్నారని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో బుధవారం మంథని పట్టణంలోని రాజగృహాలో నియోజకవర్గంలో ముఖ్య నాయకులతో సమీక్ష నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం హడావుడిగా ఎన్నికలకు వెళ్లి తమ మీద ఉన్న మచ్చను తొలగించుకోవాలనే ప్రయత్నం చేస్తోందని, జూబ్లీ ఎన్నిక గెలువడంతోనే ఇక మమ్మల్ని ఎవరూ నిలదీయరనే ఎదురు లేదనే ధీమాతో ఎన్నికలకు పోతాండ్లని బావించాలన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలలో ఒక్కటి కూడా నెరవేర్చకుండా దాడులు చేస్తూ ప్రజాస్వామ్యయుతంగా మాట్లాడితే నిలువరించే ప్రయత్నం చేస్తూ అనేక ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా కనీసం రెండు పనులు కూడా చేయకుండా ముందుకు వెళ్తున్న విషయాన్ని ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అనాదిగా ఎక్కువ శాతం ఉన్న బీసీలను మోసం చేయడం పరిపాటిగా మారిందనే విషయాన్ని బీసీ సామాజికవర్గానికి అర్థం అయ్యేలా చెప్పాలన్నారు. నియోజకవర్గంలో ఎక్కువ సంఖ్యలో ఉన్న బీసీ సామాజిక వర్గాన్ని ప్రస్తుత ఎమ్మెల్యే కుటుంబం వాడుకుని ఈ వర్గాలకు మేలు చేస్తడని బావిస్తే ఎమ్మెల్యే కులం, కుటుంబం లేకపోయినా ఆదరించి అందలం ఎక్కిస్తే మనల్నే మోసం చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. కులం మీద దూషిస్తాండ్లు నేను ఈ కులంలో పుట్టాలని అనుకున్నానా అని ఎమ్మెల్యే అంటున్నాడని, అయితే ఆ కులంలో పుట్టినా సంఖ్య లేకపోయినా 40ఏండ్లు అవకాశం ఇస్తే స్థానికంగా ఎన్ని ఓట్లు ఉన్నయో కుటుంబాలు ఎన్ని ఉన్నవో తెలియదా అని ప్రశ్నించారు. 60 నుంచి 70శాతం ఉన్న బీసీలు అధికారం ఇచ్చి అందలం ఎక్కిస్తే ఎమ్మెల్యే తన చేతితోనే మానిఫెస్టో రాసి మనల్ని పూర్తిగా మోసం చేశారని ఆరోపించారు మహాముత్తారం, పలిమెల మండలాల్లో ఒక్క బీసీకి సర్పంచ్‌గా అయ్యే అవకాశం కల్పించలేదన్నారు. జిల్లాలో సంఖ్యను పూరిస్తు మండలాల్లో బీసీ సామాజికవర్గ సంఖ్య ఉన్నచోట తగిన ప్రాధాన్యత లేకుండా ఎమ్మెల్యే నేతృత్వంలో రిజర్వేషన్ ప్రక్రియ జరిగిన విషయాన్ని ప్రజల వద్దకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు.బీసీలకు రాజకీయంగా, విద్యా ఉపాధి అవకాశాల్లో రిజర్వేషన్‌లు కల్పిస్తామని మానిఫెస్టోలో పొందుపర్చారని, కానీ ఇప్పుడు అన్యాయం చేస్తున్నారని అన్నారు. రిజర్వేషన్‌ల విషయంలో న్యాయపరమైన ఇబ్బందులు రావచ్చు కానీ కాంట్రాక్ట్‌లు, బ్రాండీ షాపుల కేటాయింపులు వాళ్ల చేతుల్లోనే ఉంటాయని ఆయన తెలిపారు.ఆనాడు ప్రతిపక్షంలో ఉన్న మంథని ఎమ్మెల్యే కాపోళ్ల కార్పోరేషన్ కోరుకుంటాండ్లని మాట్లాడిండే తప్ప కావాలని డిమాండ్ చేయలేదని, ఈనాడు అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి స్థాయిలో ఉండి కూడా కాపులకు కార్పోరేషన్ ఇవ్వలేదన్నారు. ఆనాడు కార్పోరేషన్ కావాలంటేనే పాలాభిషేకాలు చేసిండ్లని ఆయన అన్నారు. కేవలం తాను కాపు సామాజికవర్గం కాబట్టే ఆనాడు కాపులపై ప్రేమ వొలకబోసారని, రైతులకు బోనస్ ఇస్తామని ప్రకటించి మోసం చేసిన విషయాన్ని గమనించాలన్నారు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి గ్రామంలో సర్పంచ్ అభ్యర్థులను గుర్తించి గెలుపుకోసం సమిష్టిగా పని చేయాలన్నారు.వర్గాలుగా కాకుండా సమిష్టిగా ఆలోచన చేసి అభ్యర్థిని ఎంపిక చేయాలని, కల్మషం లేకుండా నాయకులు పని చేయాలన్నారు. ఆనాడు కొంతమంది నాయకుల కోసం పోరాటం చేసి అందలం ఎక్కిస్తే నమ్మించి మోసం చేసి వెళ్లిపోయారని,అలాంటి వాళ్ల గురించి ఆలోచన చేయవద్దని అన్నారు. సమిష్టిగా కృషి చేస్తేనే ఫలితం సాధ్యమని ప్రతి ఒక్కరు గుర్తించాలని, ప్రభుత్వ వైఫల్యాలను, ఎమ్మెల్యే మోసాలను ప్రజలకు వివరించాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో నియోజకవర్గంలోని దాదాపు 500 మంది నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కోతులతో ప్రజలు ఎదుర్కొనే సమస్యలతో సర్పంచ్ అభ్యర్థులకు తప్పని తిప్పలు



జయశంకర్ భూపాలపల్లి నవంబర్ 26(వృదయం జిల్లా ప్రతినిధి): కోతులతో ప్రజలు ఎదుర్కొనే సమస్యల విషయంలో గ్రామాలలో సర్పంచ్ గా పోటీ చేసే అభ్యర్థులకు కోతులతో ప్రజలు ఎదుర్కొనే సమస్యలను పరిష్కరిస్తేనే ఓటు వేస్తామనే చర్చలు జరగడంతో సర్పంచ్ అభ్యర్థులకు తిప్పలు తప్పవనే చర్చలు మహాదేవపూర్ మండల వ్యాప్తంగా జరుగుతున్నాయి రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థ ఎన్నికలకు పంచ జెండా ఊపడంతో గ్రామాల్లోని ప్రజలకు ప్రధానమైన కోతుల సమస్య పరిష్కరిస్తేనే ఓటు అంటూ ఓటర్లు అభ్యర్థులకు అడిగేపరిస్థితులు నెలకొన్నాయి.ఈ నేపథ్యంలో గ్రామాల్లో అభివృద్ధిని పక్కనబెట్టి ఇప్పుడు కోతుల సమస్యపైనే దృష్టి సారిస్తున్నారు ప్రజలు. కోతుల సమస్యను ఎవరు తీరిస్తే వారికే ఓటేస్తామంటూ చెబుతున్నారు.ప్రస్తుతం గ్రామాల్లో ఉన్న ఎన్నో సమస్యల కంటే కోతుల సమస్యే ప్రధాన సమస్యగా మారింది. కోతుల వల్ల గ్రామాల్లో తీవ్ర నష్టం వాటిల్లుతోందనీ ప్రజలు వాపోతున్నారు. పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే వారికి ఈ కోతులతో ప్రజలు ఎదుర్కొనే సమస్యలు కొత్త తిప్పలు తెచ్చి పెడుతున్నాయి.ఎన్ని ప్రయత్నాలు చేసినా రోజురోజుకు కోతుల బెడత ఎక్కువ అవుతుంది.ఓవైపు నాయకులు సర్పంచ్‌గా పోటీ చేసేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు.మరోవైపు ప్రజలు పంచాయతీ ఎన్నికల్లో ఎవరు పోటీ చేసినా కోతుల సమస్య తీరిస్తేనే ఓటు వేస్తామని స్పష్టం చేస్తున్నారు. దాంతో గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీ వీటన్నింటిని పక్కనబెట్టి ఇప్పుడు కోతుల సమస్యపైనే దృష్టి సారిస్తున్నారు ప్రజలు. ఈ కోతుల సమస్యను ఎవరు తీరిస్తే వారికే ఓటేస్తామంటూ చెబుతున్నారు.ఇంటిపై పెంకులు ఊడకొట్టడం, ఇంటి ప్రజలపై దాడులు చేయడం, ఇంటి ఆవరణలో ఉన్న వస్తువులను, ఇంట్లో ఉన్న ఆహార పదార్థాలతో పాటు తిను బండారాలను సైతం ఎత్తుకెళ్తున్నాయి. వాటిని ఎదురించుదామన్నా దాడులు చేస్తున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ మహదేవపూర్ మండలంలోని గ్రామాలలో సర్పంచ్లుగా పోటీ చేసే అభ్యర్థులకు కోతుల సమస్య సవాల్ గా మారింది సర్పంచ్ అభ్యర్థులు ఈ సమస్యపై ఎలా స్పందిస్తారో వేచి చూడాలి మరి.!

## పెద్ద నక్కలపేట్ లో బేటీ బచావో బేటీ పడావో




ధర్మపురి నవంబర్ 26(వృదయం విలేకరి):మండలంలోని పెద్ద నక్కలపేట్ గ్రామంలో గ్రామపంచాయతీ ఆవరణంలో,జిల్లా పరిషత్ పాఠశాలలో మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బేటీ బచావో...బేటీ పడావో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా బాలల పరి రక్షణ విభాగన్ చైల్డ్ లైన్ 1098 అధికారి ఆరుట్ల రజిత పాల్గొని గ్రామ ప్రజలకు,గ్రామ పెద్దలకి ,విద్యార్థుల కు బాల్య వివాహంపై అవగాహన కల్పించారు.పాఠశాలలో విద్యార్థులకు బాల్య వివాహ చట్టం- 2006, పోక్సో చట్టం -2012,మత్తు పదార్థాలు మాదకద్రవ్యాల నిర్మూలన పై అవగాహన కల్పించారు.బాల్య వివాహాల నిరోధక చట్టం- 2006 ప్రకారం 18 సంవత్సరాల లోపు అమ్మాయికి 21 సంవత్సరంలోపు అబ్బాయికి వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని అందుకు రెండు సంవత్సరాల జైలు శిక్ష,లక్ష రూపాయల వరకు జరిమానా విధించబడునని అదేవిధంగా బాల్యవివాహాల వల్ల పిల్లలకు భవిష్యత్తులో మానసిక శారీరక ఎదుగుదల ఆగిపోతుందని అలాగే ప్రభుత్వం నుంచి ఇచ్చే ప్రోత్సా హాలు కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ వంటి పథకాలు వర్తించవని,గ్రామపంచాయతీ పరిధిలో బాలల పరిరక్షణ కమిటీ ఏర్పాటు చేసి పిల్లల సమస్యలను గురించి చర్చించి పిల్లలకు సమస్య ఉంటే ఈ కమిటీ దృష్టికి తీసుకురా వాలని కోరారు. బాలబాలికలు మత్తు కి బానిస అవ్వడం, మొబైల్ ఫోన్స్ కి దూరంగా ఉండాలని అలాగే 18 సంవత్సరాల లోపు బాలబాలికలకి రక్షణ,సంరక్షణ అవసరమైన పిల్లల కొరకు 24 గంటలు పనిచేసే ఉచిత అత్య వసర ఫోన్ సేవా సౌకర్యం చైల్డ్ హెల్ప్ లైన్1098 పోలీస్ 100, సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బాల్య వివాహాలు లేని భారతదేశ కోసం ప్రతిజ్ఞ చేయించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ చంద్రశేఖర్,అంగన్వాడి టీచర్ మంగ, శాంత, సరస్వతి ఆశవర్కు,విఓ కాల్ జామున, మహిళలు గ్రామ పెద్దలు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు

## కార్మిక కోడులను వెంటనే రద్దు చేయాలి

- ♦ సిఐటియు ఆధ్వర్యంలో గజ్వేల్ సెంటర్లో నిరసన
- ♦ సిఐటియు సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య




గజ్వేల్, 26 నవంబర్ (వృదయం ప్రతినిధి): కేంద్ర ప్రభుత్వం వెంటనే కార్మిక కోడు లను రద్దు చేయాలని, రైతు వ్యతిరేక చర్యలు మానుకోవాలని లేనిచో దేశవ్యాప్త ఉద్యమం తీవ్రతం చేస్తామని సిఐటియు సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య అన్నారు. సిఐటియు గజ్వేల్ మండల కమిటీ ఆధ్వర్యంలో గజ్వేల్ పట్టణంలోని అంబేద్కర్ సెంటర్లో నిరసన కార్యక్రమం చేయడం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం అంబానీ అదాని ఆస్తులు పెంచడం కోసం కార్మిక రైతాంగ వ్యతిరేక చర్యలు పాల్పడుతుందని అన్నారు దేశంలో ఉన్నటువంటి భారత కార్మిక వర్గాన్ని బానిసలుగా మార్చే విధంగా 29 కార్మిక చట్టాల రద్దుచేసి నాలుగు లేబర్ కోడు లు రూపొందించడం జరిగిందని అన్నారు. ఈ కోడు ల వల్ల కార్మికుల ఉపాధికి ప్రమాదం ఉందని అన్నారు పరిశ్రమల ప్రమాదాలు పెరుగుతాయని కనీస వేతనాలు, ఆరోగ్యం భద్రత సంక్షేమ పథకాలు నిర్వీర్యం అవుతాయని అన్నారు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసిందని అన్నారు, 1 విద్యుత్సవరణ చట్టంతో సబ్సిడీలు ఉచిత విద్యుత్ పోతాయని అన్నారు. ఉపాధి కూలీలకు ఆన్లైన్ విధానం పెట్టడం వల్ల పని దినాలు తగ్గుతున్నాయని అన్నారు. రైతులకు మద్దతు ధర కల్పించడం లేదని పత్తి కొనుగోలులో అనేక ఆంక్షలు పెట్టి రైతులను మోసం చేస్తున్నారని అన్నారు ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బండ్ల స్వామి, రంగారెడ్డి,రాజు కనుకయ్య యాదగిరి కుమార్ రాజులు శేఖర్ రెడ్డి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆశయ సాధనలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి

ఎమ్మెల్యే జిఎంఆర్

రాజ్యాంగ దినోత్సవం లో పాల్గొన్న ఎమ్మెల్యే జిఎంఆర్




సంగారెడ్డి జిల్లా, పటాన్చేరు టౌన్ ,నవంబర్ 26 (వృదయం ప్రతినిధి): భారత రాజ్యాంగ పితామహుడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకొని..బుధవారం పటాన్చెరు డివిజన్ పరిధిలోని భారత రత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కాంస్య విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని అట్టడుగు వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం డాక్టర్ బాబాసాహెబ్ రాజ్యాంగం ద్వారా ఎంతగానో కృషి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, పృథ్వీరాజ్ ,దళిత సంఘాల ప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శరవేగంగా అభివృద్ధి పనులు పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



సంగారెడ్డి జిల్లా,పటాన్చెరు ,నవంబర్ 26 (వృదయం ప్రతినిధి): పటాన్చెరు డివిజన్ పరిధిలోని కాలనీలలో శరవేగంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. పటాన్చెరు డివిజన్ పరిధిలోని గోకుల్ నగర్ కాలనీలో 10 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్డు నిర్మాణ పనులకు బుధవారం ఎమ్మెల్యే జిఎంఆర్ శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పటాన్చెరు డివిజన్ పరిధిలో ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందిస్తూ నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మాజీ కార్పొరేటర్ శంకర్ యాదవ్, వెంకటేష్, మల్లేష్, సీనియర్ నాయకులు కార్యకర్తలు, పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అభివృద్ధి పనులు పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



సంగారెడ్డి జిల్లా,అమీన్పూర్ ,నవంబర్ 26 (వృదయం ప్రతినిధి): ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని వడక్ పల్లి గ్రామ పరిధిలో రెండు కోట్ల 45 లక్షల లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించిన హై లెవెల్ బ్రిడ్జిని ప్రారంభించారు. అనంతరం బొమ్మన కుంటలో 15 లక్షల రూపాయలతో నిర్మించనున్న సిసి రోడ్డు, వడక్ పల్లి లో 10 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న సిసి రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు మెరుగైన అంతర్గత రవాణా సౌకర్యం కల్పించాలన్న లక్ష్యంతో హై లెవెల్ బ్రిడ్జిలు, కల్వర్టులు నిర్మిస్తున్నామని తెలిపారు. మున్సిపల్ పరిధిలో విలీనమైన గ్రామాలలో మౌలిక వసతులతో పాటు, అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పీటిసి సుధాకర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ జ్యోతి రెడ్డి, ఇంజనీరింగ్ డిఇ వెంకటరమణ, పంచాయతీరాజ్ విభాగం డి ఈ సురేష్, సీనియర్ నాయకులు మల్లేష్, పాండు, భాస్కర్ గౌడ్, శ్రీకాంత్ రెడ్డి, రామిరెడ్డి, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## శివరాజ్ పాటిల్ గారినిపరామర్శించిన ఎం.డి.ఆర్ ఫౌండేషన్ సహ వ్యవస్థాపకులు మాదిరి పృథ్వీరాజ్



సంగారెడ్డి జిల్లా,పటాన్‌చెరువు ,నవంబర్ 26 (వృదయం ప్రతినిధి): వీరశైవ లింగాయత్ సమాజం పటాన్‌చెరువు మాజీ అధ్యక్షులు శ్రీ శివరాజ్ పాటిల్ గారిని, ఎం.డి.ఆర్ ఫౌండేషన్ సహ వ్యవస్థాపకులు శ్రీ మాదిరి పృథ్వీరాజ్ గారు నేడు వ్యక్తిగతంగా కలిసి పరామర్శించారు.శ్రీ శివరాజ్ పాటిల్ గారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని, త్వరితగతిన పూర్తిగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూన్నట్లు పృథ్వీరాజ్ గారు తెలిపారు. సమాజ సేవలో పాటిల్ గారి చేసిన సేవలను ఈ సందర్భంగా ఆయన స్మరించుకున్నారు.ఎం.డి.ఆర్ ఫౌండేషన్ తరపున, సమాజ సేవకు సంబంధించిన భవిష్యత్ కార్యక్రమాల్లో పాటిల్ గారి మార్గదర్శనం ఎల్లప్పటికీ విలువైనదిగా ఉంటుందని పృథ్వీరాజ్ గారు పేర్కొన్నారు. ఈ పరామర్శ సందర్భంగా పృథ్వీరాజ్ గారితో పాటు సమాజంలోని పలువురు సభ్యులు కూడా పాల్గొన్నారు.

# బిజినెస్

## దేశ జీడీపీ వృద్ధి అంచనాలను పెంచిన ఇండ్-రా




ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత జీడీపీ వృద్ధి అంచనాలను 7 శాతానికి పెంచుతున్నట్టు ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ ఇండియా రేటింగ్స్ అండ్ రీసెర్చ్(ఇండ్–రా) మంగళవారం ప్రకటనలో వెల్లడించింది. ఇందుకు ప్రధానంగా జూన్ త్రైమాసికంలో అధిక వృద్ధి నమోదవడంతో పాటు ప్రపంచ వృద్ధి, వాణిజ్యంపై అమెరికా సుంకాల పెంపు పెద్దగా ప్రభావం చూపకపోవడం కూడా కారణమని అభిప్రాయపడింది. ఇండ్–రా తాజా అంచనాలు గతంలో ప్రకటించిన 6.3 శాతం కంటే 70 బేసిస్ పాయింట్లు ఎక్కువగా ఉన్నాయి. ఈ ఏడాది జూలై తర్వాత నుంచి దేశీయ, ప్రపంచ పరిణామాల్లో గణనీయమైన మార్పులు చోటు చేసుకున్నాయి. అమెరికా అన్ని దేశాల వస్తువులపై సుంకాలను పెంచడంతో ప్రపంచ ఆర్థికవ్యవస్థ కొన్ని పెద్ద సవాళ్లను ఎదుర్కొంటోంది. ముఖ్యంగా ఆగస్టు నుంచి భారత్‌పై సుంకాలు చాలా ఎక్కువగా ఉన్నాయి, ఇది ప్రపంచ వాణిజ్యం అనిశ్చితిని సృష్టించింది. అయితే, పలు సానుకూల పరిణామాలు భారత వృద్ధి స్థిరంగా కొనసాగేందుకు దోహదపడుతున్నాయి. ముఖ్యంగా ఊహించిన దానికంటే వేగంగా ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టడం, జీఎస్టీ 2.0 సంస్కరణలు కీలకమైనవని ఇండ్–రా చీఫ్ ఎకనమిస్ట్ దేవేంద్ర కుమార్ పంత్ అన్నారు.

## రూ. 11.49 లక్షలతో మార్కెట్లోకి టాటా సియెరా




దేశీయ అతిపెద్ద వాహన తయారీ సంస్థ టాటా మోటార్స్ తన ఐకానిక్ మోడల్ సియెరాను తిరిగి మార్కెట్లో విడుదల చేసింది. దీని ప్రారంభ ధర రూ.11.49 లక్షలుగా నిర్ణయించామని చెప్పిన కంపెనీ, కొత్త మోడల్ కోసం బుకింగ్‌లు డిసెంబర్ 16 నుంచి మొదలవుతాయని, కంపెనీ డీలర్‌షిప్‌ల వద్ద లేదంటే ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకోవచ్చని స్పష్టం చేసింది. డెలివరీలు కొత్త ఏడాది జనవరి 15 నుంచి ప్రారంభమవుతాయని వెల్లడించింది. తొలిసారిగా 1991లో వాహన రంగంలోకి వచ్చిన సియెరా మోడల్ కారును 2003లో నిలిపేశారు. మళ్లీ 20 ఏళ్లకు పైగా విరామం తర్వాత టాటా ఈ కారును 'రీ–బర్త్ ఆఫ్ ఎ లెజెండ్'గా తీసుకొచ్చింది. డిజైన్ పరంగా పాత కారును తలపించేలా చూసుకున్న టాటా, 1.5 లీటర్ పెట్రోల్, డీజిల్ ఇంజిన్లతో పాటు 6–స్పీడ్ ఆటోమెటిక్, మాన్యువల్ ఆప్షన్లలో లభిస్తుంది. బెంగాల్ రూజ్ (ఎరుపు), అండమాన్ అడ్వెంచర్ (పసుపు), కూర్గ్ క్లౌడ్స్ (సిల్వర్), మున్నార్ మిస్ట్ (గ్రీన్), మింటల్ గ్రే, ప్రిస్టైన్ వైట్ మొత్తం ఆరు రంగుల్లో అందుబాటులోకి వస్తుంది. పవర్డ్, వెంటిలేటెడ్ ఫ్రంట్ సీట్స్, పానరోమిక్ సన్‌రూఫ్, డ్యూయెల్ జోన్ ఆటోమెటిక్ క్లైమేట్ కంట్రోల్ వంటి ఫీచర్లు ఈ కారులో ఉన్నాయి. లెవెల్–2 అడాస్‌తో వస్తుండటంతో 20 కంటే ఎక్కువ భద్రతాపరమైన ఫీచర్లను కంపెనీ అందిస్తోంది.

## అమల్లోకి కొత్త లేబర్ కోడ్స్.. తగ్గనున్న చేతికొచ్చే వేతనం




కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఉద్యోగులు/కార్మికులకు సంబంధించి కీలక ప్రకటన చేసింది. ప్రస్తుతం అమల్లో ఉన్న 29 కార్మిక చట్టాల స్థానంలో.. నాలుగు కొత్త కార్మిక కోడ్స్‌ను కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. 2025, నవంబర్ 21 నుంచి ఇవి అమల్లోకి వచ్చాయి. కొత్త కార్మిక చట్టాలతో.. కార్మికులు, ఉద్యోగులు, గిగ్ వర్కర్స్, ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయిస్, అసంఘటిత రంగ కార్మికులు ఇలా అందరికీ మేలు చేసేలా తెచ్చినట్లు కేంద్రం ప్రకటించింది. మరింత మెరుగైన సామాజిక ఉద్యోగ భద్రత అందుతుందని హామీ ఇస్తోంది. కొత్త కార్మిక చట్టాల నేపథ్యంలో.. ఉద్యోగులకు వేతన గణనలో కూడా కీలక మార్పు చోటు చేసుకోబోతోంది. మొత్తం వేతనంలో అలవెన్సులు 50 శాతానికి మించొద్దని కొత్త నిబంధనలు చెబుతున్నాయి. ఈ క్రమంలోనే.. శాలరీ స్ట్రక్చర్‌లో మార్పులు వస్తే.. దానికి అనుగుణంగానే ఉద్యోగులకు చేతికి అందే వేతనం తగ్గుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. 29 కార్మిక చట్టాల స్థానంలో.. వేతనాల కోడ్– 2019, సామాజిక భద్రతా కోడ్– 2020, పారిశ్రామిక సంబంధాల కోడ్– 2020, వృత్తి భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్– 2020 ను కేంద్రం తీసుకొచ్చింది. ఈ కార్మిక చట్టాలకు సంబంధించి పూర్తి మార్గదర్శకాల్ని 45 రోజుల్లో కేంద్రం వెలువరించనుంది. ఈ నిబంధనలకు అనుగుణంగా.. అప్పుడు ఉద్యో గుల శాలరీ విధానంలో కంపెనీ లు.. మార్పు చేసుకోవాల్సి ఉంటుంది. కొత్త కార్మిక కోడ్స్ లో వేత నాల విభాగాల్లో వేతనం అనే పదాన్ని నిర్వచించారు. ఇక్కడ అలవెన్సులు 50 శాతానికి మించొద్దు. అంటే బేసిక్ పే (కనీస వేతనం), డియర్‌నెస్ అలవెన్స్ (డీఏ), రిటైనింగ్ అలవెన్స్ 50 శాతం వరకు ఉండాలి. ఇప్పట్లో చాలా కంపెనీలు.. బేసిక్ ప్లస్ డీఏను తక్కువగా చూపిస్తూ.. అలవెన్సుల రూపంలోనే ఎక్కువ చెల్లిస్తుంటాయి. ఇప్పుడు కొత్త చట్టం ప్రకారం.. వేతనాల గణన మార్చాల్సి వస్తుంది. అంటే ఇక్కడ వేతనం పెరిగినప్పుడు.. ఆ మేర పీఎఫ్ కాంట్రిబ్యూషన్ కూడా పెరుగుతుంటుంది. ఈ క్రమంలోనే చేతికొచ్చే వేతనం తగ్గుతుందన్నమాట. అప్పుడు రిటైర్మెంట్ తర్వాత వచ్చే మొత్తం సహా గ్రాట్యుటీ కూడా ఎక్కువ మొత్తం లభిస్తుంది.

## ఏప్రిల్ 1 నుంచి కొత్త ట్యాక్స్ రూల్స్..


ఆదాయ పన్ను చరిత్రలో అతిపెద్ద సంస్కరణకు రంగం సిద్ధమైంది. ఏప్రిల్ 1, 2026 నుంచి కొత్త ఆదాయ పన్ను చట్టం అమల్లోకి రానుంది. ఈ కొత్త చట్టం 1961 నాటి పాత చట్టం స్థానాన్ని భర్తీ చేయనుంది. ఆదాయపు పన్నుల సంబంధించి సామాన్య పన్ను చెల్లింపుదారుల కోసం పన్నుల ప్రక్రియను మరింత సరళతరం చేయాలని, ఐటీఆర్ ఫారాలను సులభతరం చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. పాత చట్టంలోని చాలా అంశాల్లో మార్పులు చేశారు. పలు క్లిష్టమైన పదాలను తొలగించారు. ప్రస్తుతం ఉన్న 1961 చట్టంలో 819 సెక్షన్లు, సంక్లిష్టమైన నిబంధనలు ఉండడంతో సాధారణ పన్ను చెల్లింపుదారులకు అర్థం చేసుకోవడం కష్టతరంగా ఉండేది. అయితే కొత్త చట్టంలో సెక్షన్లు తగ్గించారు. పన్నుల భాషను సైతం సరళతరం చేశారు. దీని వల్ల పన్ను చట్టాన్ని అర్థం చేసుకోవడానికి న్యాయపరమైన భాషపై ఆధారపడాల్సిన అవసరం ఉండదు. పత్రాలు ఏ ఆదాయం ఏ సెక్షన్ పరిధిలోకి వస్తుందో తెలుసుకోవడం చాలా ఈజీగా ఉండనుంది. ఐటీఆర్ ఫారాల సంక్లిష్టత అనేది ట్యాక్స్ పేయర్లకు ఎప్పుడూ ఒక పెద్ద సమస్యగా ఉండేది. కొత్త చట్టంతో పాటు సరళీకృత ఐటీఆర్ ఫారాలను కూడా ప్రవేశపెట్టనున్నారు. వచ్చే ఏడాదికి సంబంధించిన ఐటీఆర్ ఫారాలను జనవరి నెలలోనే విడుదల చేస్తామని కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు సైతం ఇటీవలే ప్రకటించింది. ఐటీఆర్ ఫారాలు తగ్గనున్నాయి. అనవసరమైన షెడ్యూళ్లను తొలగిస్తారు. ఒకే సమాచారాన్ని పదేపదే నింపాల్సిన అవసరం




ఉండదు. ముందుగా నింపి ఉంచే డేటా పరిధి విస్తరిస్తుంది. ధ్రువీకరణ ప్రక్రియ సులభమవుతుంది. దీంతో జీతం తీసుకునే ఉద్యోగులు, చిన్న వ్యాపారాలు, ఫ్రీలాన్సర్లకు పన్ను దాఖలు ప్రక్రియ వేగంగా తక్కువ శ్రమతో కూడుకున్నదిగా మారుతుంది. పన్ను చెల్లింపుదారులలో తరచుగా గందరగోళాన్ని సృష్టించే అంశం ప్రీవియస్ ఇయర్, అసెస్‌మెంట్ సంవత్సరం. కొత్త చట్టంలో వీటిని మార్చారు. ఇకపై పన్ను సంవత్సరం అనేది తీసుకొచ్చారు. ఇకపై ఎలాంటి గందరగోళం ఉండదు. దీంతో మీ ఆదాయం ఏ సంవత్సరానిది? దానిపై పన్ను చెల్లించాల్సిన సంవత్సరం ఏది? మీరు రిటర్నులు దాఖలు చేయాల్సిన సంవత్సరం ఏది? ఈ మూడు అంశాలను ఒకే ఫ్రేమ్‌వర్క్ కింద సులభంగా అర్థం చేసుకోవచ్చు. దీని వల్ల పన్ను లెక్కలు మరింత స్పష్టంగా, నేరుగా ఉంటాయి. సాధారణంగా కొత్త చట్టం వస్తే, పన్ను రేట్లు మారుతాయని చాలా మంది భావిస్తారు. అయితే, ఈసారి ప్రభుత్వం దృష్టి రేట్లను మార్చడంపై కాకుండా నిబంధనలను సరళతరం చేయడంపై ఉంది. అంటే, పన్ను శ్లాబులు, సర్‌చార్జీలు లేదా సెస్ వంటి వాటిలో పెద్దగా మార్పులు చేయలేదు. ఇది మధ్యతరగతి, జీతం తీసుకునే ఉద్యోగులకు ఊహించని పన్ను భారం ఉండదనే పెద్ద ఉపశమనం.

## ఉచితంగా 'అడోబ్ ఫోటోషాప్' సబ్‌స్క్రిప్షన్

అందరినీ ఆశ్చర్యపరుస్తూ టెక్ దిగ్గజం గూగుల్ కీలక నిర్ణయం తీసుకుంది. గూగుల్ క్రోమ్ బ్రౌజర్ కస్టమర్లకు ఇమేజ్ –ఎడిటింగ్ సాఫ్ట్‌వేర్ అడోబ్ ఫోటోషాప్ ప్రీమియం వెబ్ వెర్షన్‌ను పూర్తి ఉచితంగా అందించాలని నిర్ణయించింది.భారత్‌తో పాటు అనేక దేశాల్లో సైలెంట్‌గా అందుబాటులోకి తెచ్చిన ఈ లిమిటెడ్ టైమ్ ఆఫర్ 2026, చివరి వరకు ఎలాంటి ఛార్జీలు లేకుండా అందిస్తున్నట్టు గూగుల్ వెల్లడించింది. గూగుల్ క్రోమ్ ఎక్స్‌టెన్షన్ ద్వారా లభిస్తున్న ఈ ఫీచర్‌ను ప్రత్యేకంగా డౌన్‌లోడ్ చేసుకోవాల్సిన అవసరం లేదు. దీన్ని ఉపయోగించడానికి గూగుల్ క్రోమ్‌లో ఫోటోషాప్ ఎక్స్‌టెన్షన్‌ను యాడ్ చేసుకోవాలి. గూగుల్ క్రోమ్ బ్రౌజర్‌లో ఫోటోషాప్ క్రోమ్ ఎక్స్‌టెన్షన్ సెర్చ్ చేస్తే లభిస్తుంది. డిసెంబర్ 8లోపు చేసుకున్న వారికి 12 నెలల పాటు ఉచితంగా యాక్సెస్ లభిస్తుంది. రానున్న రోజుల్లో కొత్త ఫీచర్లు కూడా యాడ్ చేస్తామని అడోబ్ తెలిపింది. ఆన్‌లైన్‌లోనే ఇమేజ్ ఎడిటింగ్ అవసరమైన వారికి ఇది పనికొస్తుంది. ఈ ఎక్స్‌టెన్షన్ క్రోమ్ వెబ్‌స్టోర్ నుంచి కూడా యాడ్ చేసుకోవచ్చు. సాధారణంగా మనదేశంలో అడోబ్ ఫోటోషాప్ కోసం నెలకు సుమారు రూ. 1,999 ధర ఉంటుంది.




# హార్దిక్ పునరాగమనం

గాయంతో అంతర్జాతీయ క్రికెట్‌కు దూరమైన భారత అగ్రశ్రేణి ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య దేశవాళీలో పునరాగమనం చేయనున్నాడు. బుధవారం ప్రారంభంకానున్న సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 ట్రోఫీలో బరోడా తరఫున బరిలో దిగనున్నాడు. వచ్చే ఏడాది ఫిబ్రవరి– మార్చిలో భారత్ లో జరగనున్న టీ20 ప్రపంచకప్‌నకు ముందు ఫామ్, ఫిట్‌నెస్ నిరూపించుకోడానికి హార్దిక్ కు ఇదే సరైన వేదిక. మరోవైపు ఐపీఎల్ ఆటగాళ్ల వేలానికి ముందు తామేంటో నిరూపించేందుకు యువ ప్రతిభావంతులకు ముస్తాక్ అలీ ట్రోఫీ సువర్ణావకాశమే. హైదరాబాద్‌లో గ్రూపు–సి మ్యాచ్‌లు జరగనుండగా.. పూల్–ఎ, బి, డి పోరాటాలకు వరుసగా అహ్మదాబాద్, కోల్‌కతా, లఖ్‌నవూ ఆతిథ్యమివ్వనున్నాయి. బుధవారం జింఖానా మైదానంలో గుజరాత్‌తో సర్వీసెస్, హరియాణాతో పుదుచ్చేరి.. ఉప్పల్ స్టేడియంలో హిమా చల్‌ప్రదేశ్‌తో పంజాబ్, బెంగాల్‌తో బరోడా తలపడనున్నాయి. భారత స్టార్ ఓపెనర్ అభిషేక్‌శర్మ పంజాబ్ జట్టులో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాడు. శార్దూల్ ఠాకూర్ సారథ్యంలోని ముంబయి డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలో దిగు తోంది.




## టీ20 ప్రపంచకప్ 2026 షెడ్యూల్ విడుదల

ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచకప్ 2026 షెడ్యూల్ వచ్చేసింది. వచ్చే ఏడాది జరగనున్న ఈ టోర్నీకి సంబంధించిన షెడ్యూల్‌ను ఐసీసీ మంగళవారం సాయంత్రం విడుదల చేసింది. 2026 ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు టోర్నీ జరగనుంది. భారత్, శ్రీలంక సంయుక్త వేదికల్లో మ్యాచ్‌లు జరుగుతాయి. భారత్‌లోని ఐదు వేదికలు, శ్రీలంకలోని 3 వేదికల్లో ఈ మ్యాచ్‌లు జరుగుతాయి. ఇక లీగ్ దశలో మరోసారి భారత్ పాక్ తలపడనున్నాయి. ఈ రెండు జట్లూ ఒకే గ్రూప్‌లో ఉన్నాయి. ఫిబ్రవరి 15న కొలంబో వేదికగా భారత్, పాక్ మ్యాచ్ జరగనుంది. భారత్, శ్రీలంక ఆతిథ్య దేశాలుగా ఫిబ్రవరి 7న ఈ మెగా ఈవెంట్ ప్రారంభం కానుంది. ఐసీసీ టీ20 ప్రపంచకప్‌కు రోహిత్ శర్మ అంబాసిడర్‌గా వ్యవహరించనున్నాడు. భారత్‌లోని 5 వేదికల్లో టోర్నీ జరగనుంది. అహ్మదాబాద్, ఢిల్లీ, కోల్‌కతా, చెన్నై, ముంబైలో ఈ మ్యాచ్‌లు జరుగుతాయి. శ్రీలంకలోని మూడు వేదికలు ఈ మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. క్రితం సారి మాదిరిగానే ఈసారి కూడా టోర్నీలో 20 జట్లు భాగం కానున్నాయి. ఇందులో భారత్, శ్రీలంక, బంగ్లాదేశ్, అఫ్ఘానిస్థాన్, యూఏఈ, ఒమన్, వెస్టిండీస్, యూఎస్ఏ, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, నమీబియా, జింబాబ్వే, ఐర్లాండ్, ఇంగ్లాండ్, నెదర్లాండ్స్, ఇటలీ, నేపాల్, పాకిస్థాన్ ఉన్నాయి. ముంబైలో జరిగిన షెడ్యూల్ విడుదల కార్యక్రమంలో భారత స్టార్ బ్యాటర్, మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ, భారత టీ20 జట్టు సారథి సూర్యకుమార్ యాదవ్, భారత మహిళల జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ పాల్గొన్నారు. భారత్‌కు 2024 ప్రపంచ కప్ సాధించిపెట్టిన రోహిత్ శర్మను వచ్చే ఏడాది జరిగే టీ20 ప్రపంచకప్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించారు. ఇక గ్లోబల్ ట్రోఫీ టూర్ డిసెంబర్ 1 నుంచి ప్రారంభం కానుంది.



## స్మృతి కాదు.. నా కొడుకే పెళ్లి ఆపేశాడు..

స్మృతి మందాన, పలాష్ ముచ్చల్ వివాహ వేడుక అర్ధాంతరంగా నిలిచిపోయిన సంగతి తెలిసిందే. స్మృతి మందాన తండ్రి శ్రీనివాస్ కు గుండెపోటు రావడంతో ఈ కార్యక్రమం ఆగిపోయింది. అటు వైరల్ ఫీవర్ కారణంగా పలాష్ కూడా ఆసుపత్రి పాలయ్యాడు. ఈ నేపథ్యంలో సోషల్ మీడియాలో రకరకాల వార్తలు వైరల్ అవుతున్నాయి. స్మృతి మందానను మోసం చేశాడని, వేరే అమ్మాయితో ఎఫైర్ పెట్టుకున్నాడని పలాష్ గురించి వార్తలు కూడా బయటకు వచ్చాయి. ఇలాంటి నేపథ్యంలో పెళ్లి ఆగిపోవడంపై పలాష్ తల్లి అమిత స్పందించారు. స్మృతి మందాన తండ్రి శ్రీనివాస్ కు గుండెపోటు రావడం బాధా కరం అన్నారు. ఈ తరుణంలోనే పెళ్లి ఆపాలని ముందు తన కొడుకు చెప్పినట్లు వెల్లడించారు. స్మృతి కంటే, ఆమె తండ్రిపైన పలాష్‌కు ఎక్కువగా ప్రేమ ఉంటుందని అమిత పేర్కొన్నారు.



## టీమిండియా మా ముందు మోకరిల్లాలి సఫారీ కోచ్ షాకింగ్ కామెంట్స్!



నాలుగో రోజు ఆట ముగిసిన తర్వాత సఫారీ హెడ్ కోచ్ షుక్రి కొన్రాడ్ షాకింగ్ కామెంట్స్ చేశాడు. భారీ ఆధిక్యం సాధించిన తర్వాత కూడా డిక్లేర్ చేయకుండా, సుమారు 80 ఓవర్లు బ్యాటింగ్ చేయడం వెనకున్న కారణమేంటని ప్రశ్నించినప్పుడు టీమిండియాను అవమానించేలా సమాధానమిచ్చాడు. 'టీమిండియా ప్లేయర్లను సాధ్యమైనంత సేపు మైదానంలో నిలబెట్టాలనుకున్నాం. వాళ్లు మా ముందు మోకరిల్లేలా చేయాలనుకున్నాం. బ్యాటుతోనే గెలవడం అసాధ్యమనేలా చేసి, అప్పుడు ఇంకో రోజు మా బౌలింగ్‌లో సర్వైవ్ అయ్యేందుకు ప్రయత్నించండని సవాల్ విసరడమే మా ఉద్దేశ్యం' అని చెప్పాడు. ఈ విషయం చెప్పేందుకు కొన్రాడ్ 'గ్రావెల్' అనే పదాన్ని వాడాడు. క్లైవ్ లాయిడ్ హయాంలో విండీస్‌తో సిరీస్ ముందు 1976లో ఇంగ్లండ్ కెప్టెన్ టోనీ గ్రెగ్ చేసిన జాత్యంహంకార వ్యాఖ్యల్లో ఈ పదం వాడాడు. నల్లజాతీయులు తమ ముందు మోకరిల్లేలా చేస్తామని టోనీ అన్నాడు. అయితే ఆ సిరీసులో ఇంగ్లండ్ 3–0తో వైట్ వాష్ అయింది. ఇప్పుడు ఆ పదాన్ని తను వాడుతున్నట్లు కొన్రాడ్ చెప్పాడు. అలాగే ఉదయం గేమ్‌ను ఇంకా కొత్తగా ఉన్న బంతితోనే ప్రారంభించాలని అనుకున్నామని, అంతేకాకుండా పిచ్‌పై నీడ పడినప్పుడు బౌలర్లకు కొంత సహకారం లభిస్తోందని, దాన్ని కూడా ఉపయోగించుకోవాలని అనుకున్నామని తమ ట్యాక్టిక్స్‌ను వివరించాడు. ఈ సిరీసు ఇప్పటి వరకు ఎలాంటి గొడవలూ లేకుండా సాఫీగా సాగిపోయింది. తొలి టెస్టులో సఫారీ కెప్టెన్ బవుమాను బుమ్రా 'బానా' (పొట్టోడు) అంటూ కామెంట్ చేసినా.. బవుమా కానీ, ఆ టీం కానీ పెద్దగా రియాక్ట్ అవ్వలేదు. ఆటతో సమాధానమిచ్చి ఆ మ్యాచ్ గెలిచారు. ఇప్పుడు కూడా పట్టుదలగా ఆడి విజయం ముంగిట నిలిచారు. ఇలాంటి సమయంలో కొన్రాడ్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దుమారం రేపుతోంది.

## టీమ్ఇండియా 140 పరుగులకు ఆలౌట్.. దక్షిణాఫ్రికా ఘన విజయం

గువాహటి టెస్ట్‌లో టీమ్ఇండియా 140 పరుగులకు ఆలౌటైంది. దక్షిణాఫ్రికా 408 పరుగుల తేడాతో విజయం సాధించింది. సైమన్ హార్మర్ ఆరు వికెట్ల ప్రదర్శన చేశాడు. టీమ్ఇండియా బ్యాటర్లలో రవీంద్ర జడేజా (54బీ 87 బంతుల్లో, 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. మిగతా బ్యాటర్లంతా చేతులెత్తేశారు. దీంతో సిరీస్‌ను 2–0తో టీమ్ఇండియా కోల్పోయింది. దక్షిణాఫ్రికా చేతిలో వైట్‌వాష్‌కు గురైంది. దాదాపు 25 సంవత్సరాల తర్వాత తొలిసారిగా సఫారీల జట్టు భారత్‌లో భారత్‌పై టెస్ట్ సిరీస్ నెగ్గి చరిత్ర సృష్టించింది. టెస్టుల్లో ఇదే టీమ్ఇండియా అతి పెద్ద పరాజయం. 27/2 ఓవర్‌నైట్ స్కోర్‌తో అయిదో రోజు ఆటను ప్రారంభించిన టీమ్ ఇండియా చకచకా వికెట్లను కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయింది. ఒకానొక దశలో 58 పరుగులకే అయిదు వికెట్లు కోల్పోయి, కుప్పకూలేలా కనిపించిన భారతజట్టు.. రవీంద్ర జడేజా పోరాడటంతో ఈ మాత్రమైనా స్కోర్‌చేయగలిగింది. సాయిసుదర్శన్ (14) 139 బంతులపాటు క్రీజులో పాతుకుపోయినా ప్రయోజనం లేకపోయింది. యశస్వి జైస్వాల్ (13), కేఎల్ రాహుల్ (6), ధ్రువ్‌జురేల్ (2), రిషభ్ పంత్ (13), వాషింగ్టన్ సుందర్ (16), నితీశ్ కుమార్ రెడ్డి (0) ఇలా బ్యాటర్లందరూ గంపగుత్తగా విఫలమయ్యారు. దక్షిణాఫ్రికా బౌలర్లలో సైమన్ ఆర్మర్ అద్భుత ప్రదర్శన చేశాడు. కేవలం 37 పరుగులిచ్చి 6 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. కేశవ్ మహరాజ్ 2, ముత్తుసామి, మార్కో యాన్సెన్ తలో వికెట్ తీసుకున్నారు.



# చక్కని ఆరోగ్యం

## యూరిక్ యాసిడ్ తగ్గించేందుకు ఈ చిట్కా పాటిస్తే చాలు

పెరిగిన యూరిక్ యాసిడ్ సమస్య ఇప్పుడు సర్వసాధారణంగా మారింది. చాలా మంది అధిక యూరిక్ యాసిడ్ వల్ల ఇబ్బంది పడుతున్నారు. యూరిక్ యాసిడ్ అనేది మన శరీరంలో ఉత్పత్తి అయ్యే వ్యర్థ పదార్థం. ఇది అధికంగా ఉత్పత్తి అయితే శరీర కీళ్లలో పేరుకుపోయి చిన్న స్ఫటికాలను ఏర్పరుస్తుంది. ఇది గౌట్ అనే ఆర్థరైటిస్ ప్రమాదాన్ని పెంచుతుంది. పెరిగిన యూరిక్ యాసిడ్ పాదాలు, మోకాలు, చేతుల కీళ్లలో వాపు, నొప్పి, మంటను కలిగిస్తుంది. సైన్స్ డైరెక్ట్‌లో పబ్లిష్ అయిన అధ్యయనం ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా సుమారు 60 మిలియన్ల మందికి అధిక యూరిక్ యాసిడ్, గౌట్‌తో బాధపడుతున్నారు. అధిక యూరిక్ యాసిడ్ సకాలంలో నియంత్రించకపోతే మూత్రపిండాలు, కీళ్లపై తీవ్రంగా ప్రభావం చూపుతుంది. ఇక, యూరిక్ యాసిడ్‌ను తగ్గించుకోవడానికి చాలా మంది మందులు వాడతారు. అయినా సరైన ఫలితం ఉండదు. ఇలాంటి వారి కోసం ప్రముఖ ఆయుర్వేద అండ్ యునాని వైద్యుడు డాక్టర్ సలీం జైదీ ఓ చిట్కా చెప్పారు. యూరిక్ యాసిడ్ అనేది సహజ వ్యర్థ ఉత్పత్తి. ఇది రెట్ మీట్, షుగరీ ఫుడ్స్, సీ ఫుడ్ అధికంగా తీసుకోవడంతో పెరుగుతుంది. ఈ ఆహారాల్లో అధిక ప్యూరిన్లు ఉంటాయి. ఇవి రక్తంలో చక్కెరను వేగంగా పెంచుతాయి. సాధారణంగా.. మన మూత్రపిండాలు ఈ ప్యూరిన్‌లను ఫిల్టర్ చేసి శరీరం నుంచి మూత్రం ద్వారా విసర్జిస్తాయి. అయితే, మూత్రపిండాలు పనిచేయడం ఆగిపోయినప్పుడు, ఈ యూరిక్ ఆమ్లం కీళ్లలో పేరుకుపోవడం ప్రారంభమవుతుంది. గౌట్ ప్రమాదాన్ని పెంచుతుంది. యూరిక్ యాసిడ్ పెరిగితే కీళ్ల నొప్పులు తట్టుకోవడం చాలా కష్టంగా ఉంటుంది. ఆయుర్వేద అండ్ యునాని వైద్యంలో నిపుణుడు అయిన డాక్టర్ సలీం జైదీ యూరిక్



యాసిడ్‌ను నియంత్రించాలనుకుంటే, దానిని సహజంగానే చేయాలని సూచిస్తున్నారు. వంటగది సుగంధ ద్రవ్యాలు యూరిక్ యాసిడ్ స్థాయిల్ని నియంత్రించడంలో చాలా ప్రభావవంతంగా ఉంటాయి. పసుపు, ధనియాలు, జీలకర్ర, మెంతులు, నల్ల మిరియాలతో తయారు చేసిన నీటిని ప్రతి రోజూ తీసుకోవడం వల్ల యూరిక్ యాసిడ్ స్థాయిల్ని నియంత్రించుకోవచ్చు. ఆ డ్రింక్ ఎలా తయారు చేయాలో ఇప్పుడు చుద్దాం. కావాల్సిన పదార్థాలు: అర టీస్పూన్ పసుపు / ఒక టీస్పూన్ ధనియాలు / అర టీస్పూన్ జీలకర్ర / ఒక టీస్పూన్ నల్ల మిరియాలు / రాత్రిపూట నానబెట్టిన అర టీస్పూన్ మెంతులు / రెండు కప్పుల నీరు / తయారీ విధానం: ఇందుకోసం ముందుగా ఒక పాన్‌లో రెండు కప్పుల నీరు పోసి.. అర టీస్పూన్ పసుపు, ఒక టీస్పూన్ ధనియాలు, అర టీస్పూన్ జీలకర్ర, ఒక టీస్పూన్ మిరియాలు, రాత్రంతా నానబెట్టిన మెంతుల్ని వేయండి. ఆ తర్వాత నీటిని వేడి చేయండి. ఈ నీటిని మీడియం వేడి మీద 10 నిమిషాలు మరిగించాలి. 10 నిమిషాలు మరిగించిన తర్వాత, స్టౌ ఆఫ్ చేయండి. ఆ తర్వాత నీటి మిశ్రమాన్ని ఫిల్టర్ చేసకోండి.

## శరీరానికి ఎంతో మేలుచేసే సీతాఫలాలు

రోజుకొకటి తింటే అమృతమే.. కానీ వీరికి సీతాఫలం విషంతో సమానం.. వేసవికాలంలో మామిడిపండ్ల కోసం ఎంతగా ఎదురు చూస్తారో.. శీతాకాలంలో లభించే సీతాఫలాల కోసం కూడా అంతే వేచి చూసే వారు ఉంటారు.. సీతాఫలాలు రుచిలోనే కాదు... ఆరోగ్యానికి కూడా ఎంతగానో మేలు చేస్తాయి. వీటిలోని పోషకాలు.. శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. వేసవికాలంలో మామిడిపండ్ల కోసం ఎంతగా ఎదురు చూస్తారో.. శీతాకాలంలో



లభించే సీతాఫలాల కోసం కూడా అంతే వేచి చూసే వారు ఉంటారు.. సీతాఫలాలు రుచిలోనే కాదు%*% ఆరోగ్యానికి కూడా ఎంతగానో మేలు చేస్తాయి. వీటిలోని పోషకాలు.. శరీరానికి ఎంతో మేలు చేస్తాయి.. అంతేకాకుండా ఆరోగ్యాన్ని కాపాడతాయి.. సీతాఫలంలో విటమిన్ సి, ఫైబర్, ఐరన్, కాల్షియం, మెగ్నీషియం, పొటాషియం వంటి పోషకాలు ఉంటాయి. ఇది రోగనిరోధక శక్తిని పెంచుతుంది.. చర్మ ఆరోగ్యాన్ని కాపాడుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అందుకే.. సీతాఫలాన్ని అమృత ఫలంగా పేర్కొంటారు. దీని రుచి మధురంగా ఉండటంతోపాటు.. దీనిలోని ఔషధగుణాలు పలు సమస్యలను నివారించేందుకు సహాయపడతాయి.. అయితే, సీతాఫలాన్ని అధికంగా తీసుకోవడం వల్ల జీర్ణ సమస్యలు, వాంతులు, ఇతర ఆరోగ్య సమస్యలు వస్తాయి. ముఖ్యంగా, దీని విత్తనాలు విషపూరితమైనవి.. కాబట్టి వినియోగంలో జాగ్రత్త అవసరం. కొన్ని ఆరోగ్య సమస్యలు ఉన్నవారు సీతాఫలాన్ని తినేటప్పుడు జాగ్రత్తగా ఉండాలంటున్నారు ఆరోగ్యనిపుణులు.. ఈ పండు తినడం ఎవరికి మంచిది కాదు. సీతాఫలం పోషకాలకు నిలయం.. ఇందులో విటమిన్ సి, ప్రోటీన్లు, కార్బోహైడ్రేట్లు, ఫైబర్, కాల్షియం, మెగ్నీషియం.. పొటాషియం వంటి అనేక విటమిన్లు, ఖనిజాలు ఉంటాయి. విటమిన్ సి యాంటీఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది.. ఇంకా ఇది ఫ్రీ రాడికల్స్‌ను తొలగించడం ద్వారా శరీరాన్ని రక్షిస్తుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచడానికి, చర్మ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి.. మొత్తం ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది.

## ఇష్టమని వీటిని తెగ తినేస్తున్నారా?

బంగాళాదుంపను కూరగాయలలో రారాజు అని పిలుస్తారు. బంగాళాదుంప ఏడాది పొడవునా లభిస్తుంది. బంగాళాదుంపల్లో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. రుచికి కూడా భలేగా ఉంటాయి. అందుకే వీటితో చేసిన వంటకాలు చాలా మందికి ఎంతో ఇష్టం. బంగాళాదుంపను కూరగాయలలో రారాజు అని పిలుస్తారు. బంగాళాదుంప ఏడాది పొడవునా లభిస్తుంది. బంగాళాదుంపల్లో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. రుచికి కూడా భలేగా ఉంటాయి. అందుకే వీటితో చేసిన వంటకాలు చాలా మందికి ఎంతో ఇష్టం. అయితే వీటిని మితంగానే తీసుకోవాలని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. పొటాషియం, విటమిన్ సి, శక్తినిచ్చే కార్బోహైడ్రేట్లు వంటి పోషకాలతో సమృద్ధిగా ఉండే బంగాళాదుంపలు ఎంత తినాలనే దానిపై తరచుగా ప్రశ్నలు తలెత్తుతుంటాయి. నిపుణుల అభిప్రాయం ప్రకారం.. బంగాళాదుంపలు పూర్తిగా హానికరం కానప్పటికీ వాటి అధిక వినియోగం పలు ఆరోగ్య సమస్యలను కలిగిస్తుంది. రోజుకు 150-200 గ్రాముల ఉడికించిన బంగాళాదుంపలు తీసుకోవడం సురక్షితం. బంగాళాదుంపలను ఎక్కువగా తినడం వల్ల గ్యాస్, ఉబ్బరం, బరువు పెరగడం, రక్తంలో చక్కెరలో హెచ్చుతగ్గులు వంటి సమస్యలు వస్తాయి.




బంగాళాదుంపలను మితంగా తినడం వల్ల శరీరానికి తగినంత విటమిన్ సి, పొటాషియం, ఫైబర్ లభిస్తాయి. బంగాళాదుంపలు రక్తపోటును నియంత్రించడంలో, జీర్ణవ్యవస్థను బలోపేతం చేయడంలో కూడా సహాయపడతాయి. అయితే, నూనెతో కూడిన బంగాళాదుంప ఉత్పత్తులకు దూరంగా ఉండటం మంచిది. చిప్స్, ఫ్రెంచ్ ఫ్రైస్‌లో పెద్ద మొత్తంలో ట్రాన్స్ ఫ్యాట్స్ , అక్రిలామైడ్ ఉంటాయి. ఇవి ఆరోగ్యానికి ప్రమాదకరం. అందుకే వేయించిన బంగాళాదుంప చిప్స్ తినకూడదు. రాత్రిపూట జీర్ణక్రియ మందగిస్తుంది. బంగాళాదుంపలలోని స్టార్చ్ కొవ్వుగా మారే అవకాశాలు పెరుగుతాయి. కాబట్టి రాత్రి భోజనంలో బంగాళాదుంపలను పూర్తిగా నివారించడం మంచిది. బంగాళాదుంపలను అధికంగా తీసుకోవడం వల్ల ఇన్సులిన్ నిరోధకత ప్రమాదం పెరుగుతుంది. ఇది కాలక్రమేణా మధుమేహం వచ్చే ప్రమాదాన్ని పెంచుతుంది.

## ఈ ఫుడ్స్ తింటే నేచురల్‌గానే రక్తం పెరుగుతుంది




ఐరన్ లోపం అనేది ఎర్ర రక్తకణాలను ఎఫెక్ట్ చేసే కామన్ ప్రాబ్లమ్. ఈ సమస్య ఉంటే కొన్ని లక్షణాలు ఉంటాయి. ఊరికే అలసిపోవడం, శ్వాస ఆడకపోవడం, గుండెకొట్టుకోవడం స్పీడ్‌గా ఉండడం వంటివి ఉంటాయి. సమస్యని తగ్గించుకునేందుకు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. సాధారణంగా మెడిసిన్‌తో ఏ ప్రాబ్లమ్‌ని అయినా తగ్గించుకోవచ్చు. కానీ, నేచురల్‌గానే సమస్యని దూరం చేసుకోవాలంటే కొన్ని ఫుడ్స్ హెల్ప్ చేస్తాయి. అలాంటి ఫుడ్స్ గురించి వివరంగా చెబుతున్నారు డాక్టర్ గౌతమ్. వీటిని డెయిలీ మీ డైట్‌లో యాడ్ చేస్తే మందులతో పనిలేదు, యూరిక్ యాసిడ్ తగ్గేందుకు డాక్టర్ చెప్పిన ఓ సింపుల్ చిట్కా, రోజూ పాటిస్తే అంతా క్లియర్ పెరిగిన చలికి రాత్రి సమయంలో మాటి మాటికీ యూరిన్‌కి వెళ్లాల్సి వస్తోందా, డాక్టర్ చెప్పిన చిట్కాలతో మీ నిద్ర పాడవ్వదు. మునగాకుల్లో కూడా పుష్కలంగా ఐరన్ ఉంటుంది. దీనిని తీసుకోవడం వల్ల బాడీలో ఆటోమేటిగ్గా ఐరన్ పెరుగుతుంది. మునగలో ఐరన్, విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. దీంతో మన బాడీకి ఐరన్ చక్కగా అందుతుంది. కాబట్టి, పుష్కలంగా మునగాకుని పొడిలా వంటల్లో యాడ్ చేసుకుని తినండి. ఎండుద్రాక్షలో కూడా ఐరన్, ఫోలేట్, కాపర్‌లు పుష్కలంగా ఉంటాయి. ఇవి నేచురల్‌గానే రక్తాన్ని పెంచుతాయి. నల్ల ఎండుద్రాక్షలో ఐరన్, విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. దీనిని తీసుకోవడం వల్ల ఐరన్ అబ్జార్బ్ పెరుగుతుంది. వీటిని రాత్రంతా నానబెట్టి ఉదయాన్నే అందులో కొద్దిగా నిమ్మరసం కలిపి తీసుకుంటే చాలా వరకూ ఐరన్ డెఫీషియెన్సీ వచ్చింది. ఖర్జూరంలో ఐరన్, ఫొలేట్, బి6లు ఉంటాయి. వీటిని మనం తీసుకోవడం వల్ల ఐరన్ లోపం తగ్గుతుంది. ఖర్జూరంలో విటమిన్ సితో పాటు, విటమిన్స్ ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల హిమోగ్లోబిన్ లెవల్స్ పెరుగుతాయి. రోజుకి కనీసం 3 నుంచి 5 తీసుకోవడం మంచిది. నువ్వుల్లో కూడా ఎక్కువగా ఐరన్, కాపర్, ఫోలేట్స్ ఉంటాయి. ఇవన్నీ కూడా రక్తం తయారీకి చాలా అవసరం. నువ్వుల్లో ఐరన్, ఇతర పోషకాలు ఉంటాయి. 100 గ్రాముల నువ్వుల్లో 14.6 మిల్లీ గ్రాముల ఐరన్‌తో పాటు కాపర్, జింక్, విటమిన్ బి6లు ఉంటాయి. ఇవన్నీ కూడా ఐరన్ పెరగడానికి హెల్ప్ చేస్తాయి. వీటితో పాటు గుమ్మడిగింజల్లో ఐరన్ ఉంటుంది. దీంతో పాటు జింక్ ఉంటుంది. గుమ్మడి గింజల్ని తీసుకోవడం వల్ల ఐరన్ లోపం సమస్య తగ్గుతుంది. దీంతో పాటు విటమిన్ సి, మినరల్స్ కూడా ఉంటాయి. ఎక్కువగా ఐరన్ ఉండే ధాన్యం రాగులు. గోధుమల కన్నా 4 రెట్లు ఎక్కువగా ఉంటుంది. రాగులు తీసుకుంటే ఐరన్ డెఫీషియెన్సీ ఉన్నవారు తీసుకుంటే హిమోగ్లోబిన్ లెవల్స్ పెరుగుతాయి. వీటిని కూడా విటమిన్ సితో పాటు తీసుకుంటే చక్కగా ఐరన్ అందుతుంది. రాజ్మాలో కూడా ఐరన్ కూడా ఉంటుంది. రాజ్మాని విటమిన్ సితో కలిపి తీసుకోవడం వల్ల మనకి మన బాడీలో ఐరన్ లెవల్స్ పెరగడానికి హెల్ప్ అవుతుంది.

## అల్లంలో ఎన్నో ఔషధ గుణాలు దాగున్నాయి..



ఇది అనేక వ్యాధులతో పోరాడడంలో ప్రభావవంతమైన ఔషధ మూలిక.. అల్లం వికారం, బరువు తగ్గడం, ఋతు నొప్పి, అనేక ఇతర ఆరోగ్య సమస్యలకు చికిత్స చేయడంలో సహాయపడుతుందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. శీతాకాలం ప్రారంభమైన నాటి నుంచి దగ్గు, జలుబు, గొంతు నొప్పి సర్వసాధారణం అవుతాయి. ఈ సమస్యలకు మందుల ద్వారా మాత్రమే పరిష్కారాలు వెతకాల్సిన అవసరం లేదు. భారతీయ వంటగదిలో తక్షణ ఉపశమనం కలిగించే అనేక మూలికలు ఉన్నాయి. అలాంటి అద్భుతమైన ఒక మూలిక అల్లం.. మసాలా దినుసైన అల్లంలో ఎన్నో ఔషధ గుణాలు దాగున్నాయి.. వాస్తవానికి శీతాకాలంలో అల్లం ప్రాముఖ్యత పెరుగుతుంది. భారత ప్రభుత్వ ఆయుష్ మంత్రిత్వ శాఖ.. అల్లం ఔషధ లక్షణాలను హైలైట్ చేస్తూ.. ఇది అనేక వ్యాధులతో పోరాడడంలో ప్రభావవంతమైన ఔషధ మూలిక అని పేర్కొంది. ఇది వికారం, బరువు తగ్గడం, ఋతుక్రమ నొప్పి.. అనేక ఇతర ఆరోగ్య సమస్యలకు చికిత్స చేయడంలో సహాయపడుతుంది. ఇంకా, ఇది శరీరం రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది.. వైరస్లు – బ్యాక్టీరియాకు తక్కువ అవకాశం కలిగిస్తుందని వివరించింది. అల్లంలో జింజెరాల్ అనే ప్రత్యేక సమ్మేళనం ఉంటుంది. ఇది మంటను తగ్గిస్తుంది.. గొంతు నొప్పిని తగ్గిస్తుంది. చిన్న అల్లం ముక్కను నమలడం లేదా అల్లం టీ తాగడం వల్ల జలుబు లేదా దగ్గు నుండి నిమిషాల్లో ఉపశమనం లభిస్తుంది. ఇది శ్లేష్మం పలుచబడటానికి, బయటకు పంపడానికి కూడా సహాయపడుతుంది. ఆయుర్వేద నిపుణులు.. శీతాకాలంలో టీలో అల్లం జోడించడంతోపాటు.. దగ్గు, వికారం నుండి ఉపశమనం పొందడానికి చిన్న ముక్కను నమలి తినవచ్చని సిఫార్సు చేస్తున్నారు. ఇది వ్యాధులను దూరంగా ఉంచే అద్భుతమైన మసాలా దినుసని.. ఔషధ మూలిక అని పేర్కొంటున్నారు.

## శనగలు, బెల్లం కలిపి తింటున్నారా..!

మన శరీరం బలంగా ఉండాలంటే ప్రోటీన్లు, కాల్షియం, ఐరన్, మినరల్స్ ఉన్న ఆహారం తినడం చాలా ముఖ్యం. బెల్లం, శెనగలు రెండింటితో ఆరోగ్యానికి అనేక ప్రయోజనాలు ఉన్నాయి. శనగల్లో ప్రొటీన్, కాల్షియం, మెగ్నీషియం, వంటి పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. బెల్లంలో ఐరన్, మెగ్నీషియం లభిస్తాయి. అయితే ఈ రెండింటినీ కలిపి తీసుకుంటే ఎన్నో వ్యాధులకు చెక్ పెట్టవచ్చు. జీవక్రియను పెరుగుతుంది: ప్రతిరోజూ ఉదయం శనగలు, బెల్లం కలిపి తింటే కండరాలు దృఢంగా మారుతాయి. వ్యాయామం చేసే వారు, జిమ్ కు వెళ్లేవారు వీటిని తప్పనిసరిగా తీసుకోవాలి. ఎందుకంటే బెల్లంలో పొటాషియం పుష్కలంగా ఉండడం వల్ల జీవక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. బరువు తగ్గుతారు: ప్రస్తుతం చాలా మంది ఎదుర్కొంటున్న సమస్యలు అధికబరువు , ఊబకాయం. బరువు తగ్గడానికి ప్రయత్నిస్తున్నవారికి శనగలు, బెల్లం దివ్యౌషధం లాంటివి. వీటిని రోజువారీ ఆహారంలో తీసుకుంటే బరువు తగ్గుతారు. ప్రతిరోజూ 100గ్రాముల శనగలను ఆహారంలో తీసుకుంటే శరీరానికి 19 గ్రాముల ప్రొటీన్ అందుతుంది. ఎసిడిటిని దూరం



చేస్తుంది: ప్రస్తుత కాలంలో చాలామంది ఎసిడిటి సమస్యతో భాదపడుతున్నారు. ఎసిడిటి సమస్యను తగ్గించాలంటే బెల్లం, శనగలు ప్రభావవంతంగా పనిచేస్తాయి. ఇవి మీ జీర్ణశక్తిని బలంగా ఉంచుతాయి. శనగల్లో ఉండే ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఈ సూపర్ ఫుడ్ డైజెస్టివ్ ఎంజైమ్?లను యాక్టివేట్ చేస్తాయి. జ్ఞాపకశక్తి పెరుగుతుంది: వీటిని డైట్ లో చేర్చుకుంటే జ్ఞాపకశక్తికి పెరుగుతుంది. ఇది శరీరంలో సెరోటోనిన్ అనే హార్మోన్ ను మెరుగుపరుస్తుంది. దీంతో మీ మెదడు పనితీరు బాగా పెరుగుతుంది. అంతేకాదు ఒత్తిడి కూడా తగ్గుతుంది. దృఢమైన దంతాల కోసం: శనగలు , బెల్లం కలిపి తింటే ఎముకలు, దంతాలు బలంగా ఉంటాయి. వీటిలో ఉండే భాస్వరం దంతాలను బలపరుస్తుంది. 10 గ్రాముల బెల్లం 4 మిల్లీగ్రాముల భాస్వరం, 100గ్రాములకు 168 మిల్లీగ్రాముల లభిస్తుంది. గుండె జబ్బులను నయం చేస్తాయి: గుండె సంబంధిత సమస్యలను నయం చేయడంలో శనగలు, బెల్లం ఎంతగానో సహాయపడతాయి.   వడం మంచిది. రక్తహీనత దూరమవుతుంది: రక్తం రక్తహీనత సమస్యతో బాధపడుతుంటే శెనగలు, బెల్లం కలిపి తినవచ్చు. ఈ రెండూ ఐరన్ పుష్కలంగా ఉన్న కారణంగా రక్తంలో ఆక్సిజన్, ఎర్ర రక్త కణాలను పెంచి శరీరంలో రక్తహీనతను దూరం చేస్తుంది.

# సినిమా

## అమర్ సింగ్ చంకీలకు నిరాశ..




53వ ఇంటర్నేషనల్ ఎమీ అవార్డ్స్ 2025 వేడుక న్యూయార్క్‌లో జరిగింది. కెల్లీ రిపా, మార్క్ కాన్స్యూ లోస్ హోస్ట్ చేసిన ఈ కార్యక్రమంలో హాలీవుడ్ కు చెందిన ప్రముఖులు ఈ వేడుకలో సందడి చేశారు. అయితే ఈ అవార్డుల బరిలో భారత్ తరపున పోటీలో నిలిచిన 'అమర్సింగ్ చంకీలకు నిరాశ ఎదురైంది. రెండు విభాగాల్లో పోటీలో నిలిచిన ఈ చిత్రం ఎందులోనూ అవార్డును సొంతం చేసుకోలేకపోయింది. దీంతో ఇండియాకు ఒక్క అవా ర్డు కూడా రాలేదు. ఇంతియాజ్ అలీ తెరకెక్కించిన అమర్ సింగ్ చంకీల.. బెస్ట్ మినీ సిరీస్, ఉత్తమ నటుడు విభాగాల్లో నామినేషన్ దక్కించుకుంది. ఒక్క విభాగంలోనైనా విజ యం సాధిస్తుందని ఎదురుచూసిన ప్రేక్షకులకు నిరాశ ఎదు రైంది. ఉత్తమ మినీ సిరీస్ విభాగంలో 'లాస్ట్ బాయ్స్ 'అండ్ ఫెయిరీస్' విజేతగా నిలవగా.. ఉత్తమ హీరోగా ఓరియోల్ ఫా అవార్డును అందుకున్నారు. ఇక 27 ఏండ్ల వయసులోనే హత్యకు గురైన ప్రముఖ పంజాబీ గాయకుడు అమర్ సింగ్ చంకీల జీవితం ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొంచారు. ఏఆర్ రెహమాన్ మ్యూజిక్ అందించాడు. పంజాబీ, బాలీవుడ్ నటుడు దిల్జీత్ దాసాంజ్. నటి పరిణీతీ చోప్రా ప్రధాన పాత్రల్లో కనిపించారు. దీనికోసం పరిణీతి దాదాపు 30 కిలోల బరువు తగ్గింది. ప్రస్తుతం 'అమర్ సింగ్ చంఠీల నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది.

## దయచేసి అలా చేయొద్దంటూ రిక్వెస్ట్

'నీది నాది ఒకే కథ' సినిమాతో తెలుగు ఫిలిమం ఇండస్ట్రీకి దర్శకుడిగా వచ్చిన వేణు ఉడుగుల మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఇది బాక్సాఫీసు వద్ద బ్లా బస్టర్ హిట్‌గా నిలవడంతో దర్శకుడి పాపులారిటీ మరింత పెరిగింది. ఆ తర్వాత చేసిన 'విరాట పర్వం' ప్రేమకథగా వచ్చి ఎంతోమంది ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో పాటు ప్రశంసలు అందుకుంది. సక్సెస్ సాధించనప్పటికీ ప్రశంసలకే పరిమితం అయిపోయింది. ఈ మూవీతో కాస్త సినిమాలకు గ్యాప్ ఇచ్చిన వేణు 'రాజు వెడ్స్ రాంబాయి' మూవీతో నిర్మాతగా ఎంట్రీ ఇచ్చారు. సాయిలు కంపాటి తెరకెక్కించగా.. నవంబర్ 4న విడుదలైంది. రియల్ స్టోరీతో వచ్చిన ఈ సినిమా బాక్సాఫీసు వద్ద ఎంత పెద్ద సక్సెస్‌ను సాధించిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఇందులో నటించిన వారు కొత్త వారు అయినప్పటికీ మంచి ఓపెనింగ్స్ సాధించడమే కాకుండా సినీ సెలబ్రిటీలతో ప్రశంసలు పొందుతోంది. సక్సెస్‌ఫుల్‌గా థియేటర్స్‌లో రాణిస్తూ.. భారీ కలెక్షన్లు రాబడుతోంది. ఈక్రమంలో..



తాజాగా, 'రాజు వెడ్స్ రాంబాయి' సినిమా సక్సెస్ ఈవెంట్ నిర్వహించగా.. ఇందులో పాల్గొన్న వేణు స్టేజ్‌పై చాలా ఎమోషనల్ అయిపోయాడు. ఉమేము సినిమాను కొంతమందికి చూపించాం. ఒక పెద్ద మనిషిని పిలిచాం. అతనితో పాటు ఒక నలుగురు ఐదుగురు వచ్చారు. ఇంటర్వెల్ అయింది చెప్పా పెట్టకుండా వెళ్లిపోయారు. ప్రివ్యూ వేస్తే నచ్చలేదని దొంగల్లా మధ్యలో పారిపోయారు. ఒక నిర్మాతకు ఇంతకంటే బాధాకరమైన విషయం ఇంకొటి ఉండదు. బయటకు వెళ్లి నెగెటివ్ ప్రచారం మొదలెట్టారు. వాడు డైరెక్టర్ కాదు.. సినిమా తీయడానికే రాదు అన్నారు. కానీ జనాలు మా చిత్రాన్ని గుండెల్లో పెట్టుకున్నారు. మేము గెలిచామని ఈ మాటలు చెప్పడం లేదు. ఎవరు ప్రివ్యూకి పిలిచినా వెళ్లండి.. కానీ దయ చేసి మీకిష్టం లేకపోతే మధ్యలో రాకండి. సాయిలు నాకు సంగీత దర్శకుడు సురేష్ బొబ్బిలి వల్ల పరిచయం అయ్యాడు. స్వచ్ఛమైన మట్టి మనిషి అలా అడుగుతుంటే నా గుండె తరుక్కుపోయింది. ఒకరోజు షాపింగ్‌కు వెళ్లినప్పుడు ఎక్కువ రేటు బట్టలు చూసి కూడా షాక్ అయ్యాడు. ఇతనిలో నన్ను నేను చూసుకున్నాను. ఈ రోజు నేను చెబుతున్నాను బాగా గుర్తు పెట్టుకోండి. కొన్ని సంవత్సరాలు పోతే తెలుగులో ఫిలిం ఇండస్ట్రీలో వెట్రిమారన్, రంజిత్ ఆ స్థాయిలో సాయిలు కంపాడి ఉంటాడు'' అని చెప్తూ చాలా ఎమోషనల్ అయ్యారు. ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ అవుతోంది.

## రకుల్ సెన్సేషనల్ కామెంట్స్

'కెరటం' సినిమాతో ఇండస్ట్రీకి వచ్చి తెలుగులో దాదాపు హీరోలందరితో నటించి స్టార్ హీరోయిన్‌గా మారింది అందాల తార రకుల్ ప్రీత్‌సింగ్. రామ్ చరణ్, ఎన్టీఆర్, నాగార్జున, మహేష్ బాబు, రవితేజ వంటి వారితో నటించి పలు హిట్స్ తన ఖాతాలో వేసుకుంది. నాన్నకు ప్రేమతో, సరైనోడు వంటి బ్లాక్ బస్టర్ హిట్ చిత్రాలతో రకుల్ క్రేజ్ మరింది పెరిగిందనే చెప్పాలి. అమ్మడు అందం, అభినయంతో పాటు తన నటనతో ఎంతోమంది అభిమానులను దక్కించుకుంది. అయితే ఒక సినిమా సక్సెస్ అయితేనే వరుస అవకాశాలు రావడం కామన్. అలాంటిది ఎన్నో హిట్స్ సాధించిన రకుల్‌కు కెరీర్ పీక్స్‌లో ఉండగా మహేష్ బాబుతో నటించే చాన్స్ వచ్చింది. అలా ఏఆర్ మురగదాస్, సూపర్ స్టార్ మహేష్ కాంబోలో వచ్చిన 'స్పైడర్'లో హీరోయిన్‌గా నటించింది. అయితే ఈ మూవీ బాక్సాఫీసు వద్ద ఊహించని విధంగా బాక్సాఫీసు వద్ద డిజాస్టర్‌గా నిలిచింది. భారీ అంచనాల మధ్య వచ్చి ప్రేక్షకులను మెప్పించలేకపోయింది. రెండు భాషల్లో విడుదలైనప్పటికీ ఎక్కడ కూడా సక్సెస్ సాధించలేకపోయింది. ఇక 2017లో వచ్చిన ఈ సినిమా రకుల్ కెరీర్‌పై ప్రభావం బాగానే చూపించింది. దీని తర్వాత తెలుగులో రకుల్ కనిపించలేదు. బాలీవుడ్ చెక్కేసిన ఈ భామ అక్కడ వరుస చిత్రాల్లో నటిస్తోంది. ఇప్పటికీ బ్యాక్ టు బ్యాక్ ప్రాజెక్టస్‌తో ఫుల్ ఫామ్‌లో దూసుకుపోతుంది. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రకుల్ టాలీవుడ్‌కు దూరం అవడంపై సంచలన వ్యాఖ్యలు చేసింది. ఉనేను తెలుగు ఇండస్ట్రీలో రామ్ చరణ్, ఎన్టీఆర్ వంటి స్టార్ హీరోలతో నటించాను. అలాగే తెలుగులో చాలా ప్రాజెక్టస్ చేశాను. వరుసగా 8-9 హిట్స్ వచ్చాయి. కానీ 'స్పైడర్' నా కెరీర్‌లో మొదటి డిజాస్టర్ సినిమా. అంచనాలు తారుమారైనప్పుడు ఎలా ఉంటుందో నాకు మొదటిసారి అర్థమైంది.



## 'అరసన్'లో మరో స్టార్ హీరో.. ఇక ఫ్యాన్స్‌కు పూనకాలే!


కోలీవుడ్ స్టార్ హీరో శింబు నటిస్తున్న 49వ చిత్రం 'అరసన్'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. నేషనల్ అవార్డు గ్రహీత వెట్రిమారన్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా టైటిల్ పోస్టర్‌ను అనౌన్స్ చేస్తూ రిలీజ్ చేయగా, శింబు వింటేజ్ లుక్‌లో కత్తి, సైకిల్, రక్తపు మరకలతో కనిపించారు. ఇది వెట్రిమారన్ మార్క్ యాక్షన్ డ్రామాగా ఉంటుందని అభిమానులు భావిస్తున్నారు. ఈ చిత్రానికి అనిరుధ్



సంగీతం అందిస్తున్నారు. ఇందులో కథానాయికగా సమంత నటించే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది. తాజాగా ఈ సినిమా మీద హైప్‌ని రెట్టింపు చేసే అప్‌డేట్ వచ్చింది. 'అరసన్' చిత్రంలో వెర్సటైల్ స్టార్ విజయ్ సేతుపతి కూడా కీలక పాత్ర పోషిస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఆయన గెటప్‌ని రివీల్ చేస్తూ విడుదల చేసిన పోస్టర్ ఫ్యాన్స్‌ను విపరీతంగా ఆకట్టుకుంటోంది. పాత్ర చిన్నదైనా, పెద్దదైనా విజయ్ సేతుపతి పూర్తి స్థాయిలో లీనమైపోతారనే విషయం తెలిసిందే. దీంతో వెట్రిమారన్, శింబు, విజయ్ సేతుపతి కాంబో తెరపై అద్భుతాలు సృష్టించడం ఖాయమని అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది.

## ఓటీటీలోకి రవితేజ 'మాస్ జాతర'

రవితేజ, శ్రీలీల ప్రధాన పాత్రల్లో నటించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'మాస్ జాతర' ఇప్పుడు ఓటీటీలోకి వస్తోంది. అక్టోబర్ 31న థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం భారీ అంచనాలను సంతరించుకుంది గానీ, బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో విజయాన్ని సాధించలేకపోయింది. అయితే మాస్ మహారాజ్ అభిమానులకు ఇప్పుడు ఈ చిత్రం డిజిటల్‌గా చూడడానికి అవకాశం లభిస్తోంది. నెట్‌ఫ్లిక్స్ ఈ నెల 28నుంచి 'మాస్ జాతర' ను స్ట్రీమింగ్ చేయనుందని అధికారికంగా ప్రకటించింది. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం భాషల్లో ఈ చిత్రం అందుబాటులో ఉండనుంది. థియేటర్లలో మిస్ చేసిన ప్రేక్షకులకు ఇది మంచి గుడ్ న్యూస్ అవుతోంది. వేణు శ్రీరాం దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం, రవితేజ మాస్ ఇమేజ్‌కు తగిన విధంగా యాక్షన్, ఎంటర్‌టైన్‌మెంట్ మేళవింపుగా రూపొందింది. సంగీతాన్ని థమన్ అందించగా, ప్రొడక్షన్ విలువలు కూడా ఆకట్టుకొన్నాయి. థియేటర్ రన్ ఇంతకుముందు అనుకున్నంతగా లేకపోయినా, ఓటీటీలో ఈ సినిమాకు మంచి వ్యూస్ వచ్చే అవకాశం ఉందని ఫిలింసర్కిల్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. నవంబర్ 28 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో 'మాస్ జాతర' జాతర మొదలుకానుంది.




## ఆ పాత్ర చేసేందుకు సిద్ధం..

తమన్నా మిల్కీ బ్యూటీ ది భారతీయ సినీరంగంలో సక్సెస్ఫుల్ కెరీర్. దక్షిణాదిలో అన్ని భాష ల్లో నటించింది. బాలీవుడ్లో కూడా తన సత్తా చాటింది. కొన్ని సినిమాల్లో ప్రత్యేక గీతాన్ని నటించి, తన సత్తా చాటింది. కొత్త హీరోయిన్ల రాకతో ఆమెకు కొంతమేర అవకాశాలు తగ్గాయి. దాదాపు అన్ని రకాల పాత్రల్లో నటించి, మెప్పించిన మిల్కీ బ్యూటీకి డ్రీమ్ రోల్ ఉందట. అదేమిటంటే చాలా మంది హీరోయిన్లు బయోపిక్ చిత్రాల్లో నటిస్తున్నారు. తనకు కూడా అలాంటి అవకాశం రావాలని కోరుకుంటోంది. అవకాశం వస్తే అతిలోకసుందరి శ్రీదేవి బయోపిక్‌లో నటించాలని ఉందని చెప్పింది. భారతీయ సినీరంగంలో చాలా భాషల్లో బయోపిక్ల నిర్మాణం పెరిగింది. దీన్ని ఉద్దేశించే తమన్నా ఈ వ్యాఖ్యలు చేసింది. "శ్రీదేవి అంటే నాకు చాలా ఇష్టం. ఆమె స్టైలిష్ నటి. ఆమె నటన అంటే అందరికీ అభిమానమే. ఆమె బయోపిక్ తీస్తే శ్రీదేవి పాత్ర చేసేందుకు, అలా నటించేందుకు రెడీ. ఇదే నా డ్రీమ్ రోల్ అని చెప్పింది. 'మహానటి' సావిత్రిగా కీర్తి సురేష్, జయ లలితగా కంగనా రనౌత్, సిల్క్ స్మితగా విద్యాబాలన్ నటించిన విషయం తెలిసిందే. అలాగే శ్రీదేవి బయోపిక్ తీస్తే తను నటిస్తానని తమన్నా అంటోంది. అయితే శ్రీదేవి జీవితం తెరమీద వచ్చేందుకు ఆమె భర్త బోనీకపూర్ అంగీకరించాలి. అదే జరిగితే తమన్నా కోరిక తీరుతుంది.



## రూమర్స్‌పై స్పందించిన రామ్

'ఆంధ్ర కింగ్ తాలూకా' సినిమాలో భాగ్యశ్రీ బోర్సేని నటిగా చేశారు. ఈ సినిమా నవంబర్ 27న రిలీజ్ కాబోతోంది. అయితే ఈ మూవీ షూటింగ్ ప్రారంభమైన నాటి నుంచి వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నారనే వార్తలు జోరుగా ప్రచారం అవుతున్నాయి. ఈ సినిమా సంధర్భంగా రామ్ ఒక ఇంటర్వ్యూలో భాగ్యశ్రీ బోర్సేతో డేటింగ్ రూమర్స్ గురించి స్పందించారు. ఈ సినిమా కోసం స్వయంగా ఒక ప్రేమ పాట రాశారన్నారు. ఆ సమయంలో రూమర్స్ మొదలవ్వడం విశేషం అని చెప్పారు. అప్పటి నుంచే ఈ రూమర్స్ ప్రారంభమయ్యాయని.. మనసులో ఏం లేకపోతే అంత గొప్పగా పాట ఎలా రాయగలరు అని అందరూ అనుకున్నారు. ఈ సినిమాలోని హీరో, హీరోయిన్ పాత్రలను ఊహించుకొని ఆ లిరిక్స్ రాశానని పేర్కొన్నారు. ఈ పాట రాసినప్పటికి అసలు హీరోయిన్‌ను ఎంపిక చేయలేదు'' అని రామ్ అయిన రూమర్స్ వచ్చాయన్నారు. ఆంధ్ర కింగ్ తాలూకా సినిమా కథ, సంగీతం, యాక్షన్ తో ప్రేక్షకులను ఆకట్టుకోగలదని, తన అభిమానులకు మంచి విజయం తీసుకురాబోతుందని అన్నారు.



# ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఐక్య సదస్సు



దమ్మపేట నవంబర్ 26 (వుదయం ప్రతినిధి): స్వదేశీ విదేశీ పెట్టుబడుదారుల ప్రయోజనాలు నెరవేర్చడం కోసమే కేంద్రంలో మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలను సవరిస్తుందని,వ్యవసాయ రంగంలోకి దిగుమతి సుంకాలను తగ్గించి వేస్తుందని ఫలితంగా కార్మిక కర్షిక కష్టజీవులు రోడ్డున పడుతున్నారని కార్మిక సంఘాల నాయకులు మురారి రఘు, ధర్మ, వీరబాబు, రైతు సంఘం నాయకులు దొడ్డ లక్ష్మీనారాయణ సత్యనారాయణ,అన్నారు. దేశ వ్యాప్త పిలుపులో భాగంగా కార్మిక కర్షక సమస్యలపై ఈ రంగాలలో మోడీ ప్రభుత్వం తీసుకువస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఐక్య సదస్సు బుధవారం మందలపల్లి సుందరయ్య భవన్లో జరిగిందిజరిగింది. ఈ సదస్సుకు రైతు సంఘం నాయకులు మారంపూడి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పారిశ్రామిక ఆదిలాబాద్ రంగం వ్యవసాయ రంగాలలో బహుళ జాతి కంపెనీలకు స్వేచ్ఛ ఇవ్వాలని కఠినంగా ఉన్న చట్టాలను సవరించాలని మోడీ ప్రభుత్వంపై పారిశ్రామికవేత్తల ఒత్తిడి మూలంగానే కార్మిక చట్టాలను సవరించే నాలుగు లేబర్ కోడ్లు అప్రాజస్వామికంగా మోడీ ప్రభుత్వం తీసుకు వచ్చిందని అన్నారు. వ్యవసాయ రంగంలో మనదేశంలో పండేటటువంటి వ్యవసాయ ఉత్పత్తులను పక్కకు నెట్టి సుంకాలను తగ్గించి విదేశీ వ్యవసాయ ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటున్నామని ఫలితంగా రైతులు ఆత్మహత్యలకు గురవుతున్నారని అన్నారు. లేబర్ సంస్కరణల పేరుతో దేశవ్యాప్తంగా కార్మిక ఉద్యమాన్ని బలహీనపరచడానికి దశాబ్దాలుగా కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను నేడు బిజెపి ప్రభుత్వం అనగదొక్కి పడిందని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు ఈశ్వరమ్మ, తిరుపతమ్మ,బత్తులబత్తుల శీను, రాణి శ్రీదేవి, జ్యోతి, రామకృష్ణ సంజీవరావు, శేషుబాబు, తదితరులు పాల్గొన్నారు.


# ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం...




మిరదొడ్డి, 26 నవంబర్ (వుదయం ప్రతినిధి): భారత రాజ్యాంగాన్ని స్వీకరించిన రోజును గుర్తుచేసుకుంటూ, సిద్దిపేట జిల్లా మిరదొడ్డి మండలం అందె ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం రోజున నవంబర్ 26న భారతదేశ రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయడం జరిగింది.రాజ్యాంగ ముసాయిదా కమిటీ ఛైర్మన్ అయిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గారికి ఈ రోజు నివాళులర్పించడం జరిగింది.రాజ్యాంగం యొక్క ప్రాథమిక సూత్రాలు, విలువలు మరియు పౌరుల హక్కులు–బాధ్యతలపై ప్రజల్లో అవగాహన పెంచడం. ప్రజాస్వామ్యం, న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం మరియు సౌభ్రాతృత్వం వంటి రాజ్యాంగ విలువలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని మరియు పాటించాలని విద్యార్థులకు తెలియజేయడం జరిగింది . ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాములు, గ్రామస్తులు. అందె ప్రవీణ్ పరుశరాములు ఉపాధ్యాయ బృందం,విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర కోశాధికారిగా గుగులోతు హుస్సేన్ నాయక్

## - రాష్ట్ర ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ ఎన్నిక



హనుమకొండ, నవంబర్ 26 (వుదయం జిల్లా ప్రతినిధి) : ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ (టిడబ్ల్యూజేయు) రాష్ట్ర కమిటీ సమావేశం మంగళవారం హైదరాబాదులోని గిరిజన విద్యుత్ భవన్ లో కోర్ కమిటీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర కోశాధికారిగా గుగులోతు హుస్సేన్ నాయక్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గుగులోతు హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ నాపై ఎంతో నమ్మకంతో రాష్ట్ర కోశాధికారి గా నన్ను నియమించినందుకు గాను రాష్ట్ర యూనియన్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో ఉన్నటువంటి జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తానని, జర్నలిస్టుల సమస్యలను ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతామని తెలిపారు.

# మధిరలో పలు కార్యక్రమాలలో పాల్గొన్న మంత్రి పొంగలేటి శ్రీనివాస రెడ్డి,ఎంపీ రఘురాం రెడ్డి.





మధిర,నవంబర్ 26,(వుదయం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి మధిరలో పర్యటించారు. పర్యటనలో భాగంగా జిల్లా అధికార ప్రతినిధి వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి కుమార్తె వివాహ వేడుకకు హాజరయ్యారు. అనంతరం ఎస్సీ కాలనీ నందు పూర్ణకంటి విజయరాణి కుమారుడు మరణించగా వారి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం యన్నం కోటేశ్వరరావు తండ్రి ఇటీవలే మరణించగా వారి కుటుంబాన్ని పరామర్శించారు. పొంగులేటి వెంట జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు డా. కోట రాంబాబు,ఐలూరి వెంకటేశ్వర రెడ్డి, దేవిశెట్టి రంగారావు,కటికల సీతారాంరెడ్డి,వేమిరెడ్డి లక్ష్మారెడ్డి, ఎర్రగుంట రమేష్,అమరవాది సత్యనారాయణరెడ్డి, చావలి రామరాజు,శీలం వీర వెంకటరెడ్డి మొగిలి అప్పారావు,ఐలూరి జనార్దన్ రెడ్డి, బానోతు రమణ, బండి వెంకటేశ్వర్లు,సోమా రవికాంత్, తమ్మిశెట్టి బాలకృష్ణ, చిలకా సత్యం తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరా మహిళ శక్తి క్యాంటీన్ ను ప్రారంభించిన కె. హెచ్. అర్...



కుత్బుల్లాపూర్, నవంబర్ 26,(వుదయం ప్రతినిధి),కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 126 డివిజన్ జగద్గిరిగుట్ట వాసులు ఉమ ఏర్పాటు చేసుకున్న ఇందిరా మహిళ శక్తి క్యాంటీన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి, గాజులరామారం సర్కిల్ కమీషనర్ మల్ల రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ లబ్ధిదారునికి శుభాకాంక్షలు తెలియజేస్తూ మహిళలు తమ సొంత వ్యాపారాలను ప్రారంభించి, ఆర్థికంగా స్వతంత్రంగా మారేలా ప్రోత్సహించడం ఈ పథకం ముఖ్య లక్ష్యం, మహిళల సాధికారత ఆర్థికాభివృద్ధికి తోడ్పడటం, స్వయం సహాయక బృందాలను ప్రోత్సహించడం, మహిళా సాధికారత కోసం తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతిష్టాత్మక పథకాల్లో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు ఒకటి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు అవిజె జేమ్స్, సంజీవ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు సోమన్నా గారి శ్రీధర్ రెడ్డి, గణేష్, రవీందర్, శ్రీనివాస్ చారి, కయ్యుమ్, రాజు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## పటాన్చెరువు మండలంలో గ్రామపంచాయతీ సాధారణ ఎన్నికలు 2025 నామినేషన్ ప్రక్రియ ప్రారంభం

సంగారెడ్డి జిల్లా, పటాన్చేరు ,నవంబర్ 26 (వుదయం ప్రతినిధి): గ్రామపంచాయతీ సాధారణ ఎన్నికలు 2025 పటాన్చెరువు లోని భానూరు , నందిగామ, క్యాసారం గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ సమర్పణ 27 నవంబర్ నుండి ప్రారంభమై 29 నవంబర్ తేదీ వరకు మండల ప్రజా పరిషత్ పటాన్చెరు యందు ఉదయం 10:30 నుండి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరించబడును. 30 నవంబర్ నామినేషన్ల పరిశీలన కలదు. 3 డిసెంబర్ సాయంత్రం మూడు గంటల వరకు నామినేషన్ ఉపసవరణ ఉంటుంది. తదనంతరం గుర్తుల కేటాయింపు కలదు. 11 డిసెంబర్ ఉదయం 7 గంటల నుంచి 1 గంట వరకు సంబంధిత పోలింగ్ స్టేషన్లలో ఎన్నికల నిర్వహించి మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఎన్నికల కౌంటింగ్ కలదు. అదే రోజు కౌంటింగ్ తదనంతరం ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహించబడునుఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, శాంతియుతంగా, నిష్పాక్షికంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ



జయశంకర్ భూపాలపల్లి నవంబర్ 26(వుదయం జిల్లా ప్రతినిధి): మహాదేవపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వికలాంగుల సంఘం మహాదేవపూర్ టౌన్ అధ్యక్షుడు మీర్జా ముస్తాక్ బెగ్ అధ్యక్షతన బుధవారం రోగులకు పాలు పండ్లు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బెల్లంపల్లి సురేష్ మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ ఏర్పాటు చేసిన వికలాంగుల హక్కుల పోరాట సమితి నేటికి 18 సంవత్సరాలు నిండిన తరుణంలో మండలంలో ఘనంగా ఆవిర్భవ దినోత్సవం ఘనంగా జరపడం జరిగిందని అన్నారు ఈ సమాజంలో వికలాంగుల కోసం పోరాటం చేసిన వ్యక్తి ఎవరైనా ఉన్నారా అంటే కేవలం అది మందకృష్ణ మాదిగ తప్ప మరొక్కరు లేరని ఆయన వల్లనే 200 పింఛన్ నుండి 2000 మరియు 4000వరకు ఫించను పెంచి పోరాటం చేసిన మహా గొప్ప మానవత వాదని అన్నారు అదే క్రమంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షులు వీర గంట సమయం మాట్లాడుతూ వికలాంగుల కోసం మందకృష్ణ మాదిగ ఎన్నో పోరాటాలు చేసి మాకు ఆత్మగౌరవం సంపాదించిన వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే కేవలం మందకృష్ణ మాదిగ కే దక్కుతుందని ఈ సమాజం మమ్ములను చిన్నచూపు చూస్తే ఎమ్మార్పీఎస్ ఉద్యమం మాత్రం మా వికలాంగులను వృద్ధులను వితంతులను అక్కున చేర్చుకొని మాకోసం పోరాటం చేసిందని తెలిపారు ఈ కార్యక్రమంలో వికలాంగులు వృద్ధులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ పూర్తి ఏర్పాట్లు చేస్తుంది

## - జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్



జయశంకర్ భూపాలపల్లి నవంబర్ 26(వుదయం జిల్లా ప్రతినిధి): స్థానిక ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ పూర్తి ఏర్పాట్లు చేస్తున్నట్లు భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అన్నారు జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీగా బాధ్యత చేపట్టి బుధవారం కాళేశ్వరంలోని శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. అంతకుముందు మొట్టమొదటిసారిగా కాళేశ్వరం లోని దేవస్థానంలో దర్శనానికి వచ్చిన ఎస్పీకి దేవస్థానం అర్చకులు దేవస్థాన సిబ్బంది పూర్ణకుంభ స్వాగతం పలికారు ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రానున్న స్థానిక ఎన్నికలను శాంతియుతంగా, స్వేచ్ఛగా నిర్వహించేందుకు జిల్లా పోలీసులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

జిల్లాలో సమస్యాత్మక ప్రాంతాలు పలు చోట్ల గుర్తించినట్లు, అక్కడ ప్రత్యేక పోలీస్ బలగాలను నియమించి నిఘా మరింత బలోపేతం చేస్తున్నామని పేర్కొన్నారు. ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. స్థానిక ఎన్నికలను అందరూ సజావుగా జరిగేలా సహకరించాలని కోరారు.

ప్రజలు మంచి నాయకుడిని తమ ఓటు ద్వారా ఎన్నుకోవాలని సూచించిన ఆయన, ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘించినట్లయితే నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో మహాదేవపూర్ సీఐ వెంకటేశ్వర్లు, కాళేశ్వరం ఎస్సై తమాషా రెడ్డి, తోపాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

## - రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని






నారాయణపేట నవంబర్ 26 (వుదయం ప్రతినిధి): పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఐ. రాణి కుముదిని అన్నారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఐ. రాణి కుముదిని జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, సీపీలతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.నారాయణపేట కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎస్పి డాక్టర్ వినీత్ ,అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న గ్రామ పంచాయతీలకు 2వ సాధారణ ఎన్నికలను మూడు విడుతలలో నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసిందని, డిసెంబర్ 11న మొదటి విడత, డిసెంబర్ 14న రెండవ విడత, డిసెంబర్ 17న మూడవ విడత పంచాయతీ ఎన్నికల పోలింగ్ జరగనున్నట్లు తెలిపారు. పంచాయతీ ఎన్నికల సంబంధించి గ్రామానికి అప్ డేట్ చేసిన రిజర్వేషన్లు, ఏ విడత పోలింగ్ ఉంటుంది, పోలింగ్ కేంద్రాల జియో లోకేషన్ వివరాలు వెంటనే టి-పోల్ వెబ్ సైట్, యాప్ లో నమోదు చేయాలని అన్నారు. టి-పోల్ వెబ్ సైట్, యాప్ లో వచ్చే ఫిర్యాదుల పరిష్కారం కోసం జిల్లాలో నోడల్ అధికారిని నియమించాలని, ఎన్నికల కమిషన్ నుంచి వచ్చే ఫిర్యాదులను మూడు రోజులలో పరిష్కరించాలని అన్నారు. నవంబర్ 23న ఫైనల్ చేసిన ఓటర్ జాబితా, పోలింగ్ కేంద్రాల ప్రకారం పంచాయతీ ఎన్నికల నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. 2 కంటే ఎక్కువ పోలింగ్ కేంద్రాలు ఉన్న భవనం దగ్గర హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని, వెబ్ క్యాస్టింగ్ జరిగే పోలింగ్ కేంద్రాల వివరాలు పంపాలని , పోలింగ్ కేంద్రాలలో మంచి వెలుతురు, ఫర్నిచర్, పవర్ సరఫరా వంటి ఏర్పాట్లు చేయాలని అన్నారు.

గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి మొదటి విడత ఎన్నికల నోటిఫికేషన్ నవంబర్ 27న ఉదయం 10.30 గంటల వరకు విడుదల చేయాలని అన్నారు. నోటిఫికేషన్ జారీ చేయడంతో పాటు పంచాయతీ పరిధిలోని ఓటరు జాబితా వివరాలను ప్రచురించాలని అన్నారు. ఈ సమావేశంలోహూ డి.ఎస్.పి.మహేష్,నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మధిర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం.



మధిర,నవంబర్ 26,(వుదయం ప్రతినిధి): ప్రభుత్వ జూనియర్ కళాశాల మధిరలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలోనవంబర్ 26 రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షులు కళాశాల ప్రిన్సిపాల్ బి జై దాస్ మాట్లాడుతూ రాజ్యాంగ పలాలు అందరికీ అందాలని అందరికీ విద్య అవకాశాలు కల్పించబడాలని ఆర్థికస్మానతలు లేకుండా ఉండాలని ప్రసంగించారు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బి.తారియా మాట్లాడుతూ అంబేద్కర్ గారి ఆధ్వర్యంలో రాజ్యాంగ రచన సంఘం 1947 ఆగస్టు 29 ఏర్పడిందని. ఏడుగురు కమిటీ సభ్యులకు అధ్యక్షులుగా అంబేద్కర్ వివిధ దేశాల రాజ్యాంగాన్ని సుమారుగా మూడు సంవత్సరాలు పర్యటించి ముఖ్యమైన అంశాలను రాజ్యాంగంలోపొందుపరిచారని,వాటి ఫలాలు అనుభవిస్తున్నామని రాజ్యాంగం ప్రకారం అందరికీ స్వేచ్ఛ,సమానత్వం,న్యాయం, అందాలన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ఎండి షహీన్ బేగం, కె గురవయ్య, ఆర్ సి హెచ్ సాంబయ్య,బి ఉపేందర్, జి విక్రమ్,టి దేవదాస్ ఎం లాలయ్య, కె కొండలరావు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.ఈ కార్యక్రమానంతరం అధ్యాపకులు విద్యార్థులు అంబేద్కర్ చిత్రపటానికి పూలాభిషేకం చేయడం జరిగింది.

# రోడ్డు ప్రమాద బాధితులకు సత్వర సేవలు అందించాలి

## :108 జిల్లా మేనేజర్ సయ్యద్ ఇమ్రాన్



కరీంనగర్, నవంబర్ 26( వుదయం దయం విలేఖరి): రోడ్డు ప్రమాద, అత్యవసర పరిస్థితుల్లో బాధితులకు సత్వర అత్యవసర వైద్య సేవలు అందించాలని కరీంనగర్ 108 జిల్లా మేనేజర్ సయ్యద్ ఇమ్రాన్ 108 సిబ్బందికి సూచించారు. మంగళ వారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని 108 అంబులెన్స్ లను ఆకస్మిక తనిఖీ నిర్వహించి అంబులెన్స్ లోని ఆక్సిజన్ నిల్వలు,ఔషధాలు , స్టాక్ రికార్డులు, వైద్య పరికరాలు పరిశీలించారు. ఇటీవల జరుగుతున్న రోడ్డు ప్రమాదాల కేసులు,శీతాకాలంలో ఎక్కువగా వచ్చే అస్తమా కేసుల పై అప్రమత్తంగా ఉండి సేవలు అందించాలని సూచించారు. ఇటీవలి కాలంలో సిబ్బంది అంకిత భావంతో అందించిన సేవలు వారి సమయ స్ఫూర్తిని అభినందించారు.ఈ సందర్భంగా అత్యవసర వైద్య సేవల పై సిబ్బందికి పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో సిబ్బంది దీకొండ సుధాకర్, కామ రవి, కసిరెడ్డి శ్రీనివాస రెడ్డి, తీగల ఎల్లా గౌడ్, రమేష్, పీరెల్ల అశోక్,అన్వేష్, నగేష్, మచ్చ మహేష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ



మహబూబ్ నగర్ నవంబర్ 26 (వుదయం ప్రతినిధి): భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరం లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అధికారులు, సిబ్బంది చేత రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్యమైన మన దేశ రాజ్యాంగానికి ప్రత్యేక గుర్తింపు వుందని అన్నారు. రాజ్యాంగం పరిరక్షణ, దేశ అభివృద్ధికి కట్టుబడి వుండాలని, రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతి ఒక్కరూ గౌరవించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్,జడ్.పి.సి.ఈ.ఓ వెంకట రెడ్డి,డి.పి.ఓ నిఖిల,సహకార ఆడిట్ అధికారి టైటస్ పాల్ వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

# నన్ను చాలెంజ్ చేస్తే.. బీజేపీ పునాదులే కదిలిస్తా

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌కు పశ్చిమ బెంగాల్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. అధికార తృణమూల్ కాంగ్రెస్ ఇతర ప్రతిపక్షాలు సర్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్నాయి. బీజేపీ సర్ ప్రక్రియను ఉపయోగించి ఓటర్లను తొలగిస్తోందని తృణమూల్ ఆరోపిస్తోంది. మంగళవారం జరిగిన ఎస్ఐఆర్ వ్యతిరేక ర్యాలీలో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో తనను చాలెంజ్ చేస్తే దేశంలో బీజేపీ పునాదులు కదిలిస్తానని మమత వ్యాఖ్యానించారు. బొంగావ్‌లో జరిగిన ఎస్ఐఆర్ వ్యతిరేక ర్యాలీలో మమతా బెనర్జీ ప్రసంగిస్తూ, రాష్ట్రంలోని మతువా-మెజారిటీ ప్రాంతాలలోని ఓటర్లు పౌరసత్వం (సవరణ) చట్టం ప్రకారం తమను తాము విదేశీయులుగా ప్రకటిస్తే వారిని "వెంటనే జాబితా నుండి తొలగిస్తారు" అని కూడా మమతా బెనర్జీ పేర్కొన్నారు. బీజేపీ రాజకీయంగా తనను ఓడించలేదని గతంలోనే పదిసార్లు చెప్పానని మమత మరోసారి నొక్కి వక్కాణించారు. అంతేకాదు ఎన్నికల కమిషన్ ఇకపై నిష్పాక్షిక సంస్థ కాదు, కానీ బిజెపి కమిషన్‌గా మారిపోయిందంటూ భారత ఎన్నికల సంఘం (ఇసిఐ)పై విమర్శలు గుప్పించారు. 'అక్రమ బంగ్లాదేశీయుల ను" తొలగించడమే లక్ష్యమైతే, బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ ఎందుకు నిర్వహిస్తు న్నారని మమత ప్రశ్నించారు. అంటే పార్టీ "డబుల్ ఇంజిన్ పాలిత రాష్ట్రాల్లో కూడా చొరబాటుదారులు ఉన్నారని అంగీకరిస్తుందా అని ఆమె ఎద్దేవా చేశారు. తానుఒక దేశంగా బంగ్లాదేశ్‌ను ప్రేమిస్తున్నాననీ తమ భాషా ఒకటేనని చెప్పారు. ఏదో ఒకరోజు తనను కూడా బంగ్లాదేశీ అని పిలుస్తారని విమర్శించారు. ఈ రాష్ట్రం నుంచి ఈ జాబితా ప్రకారమే 2024లో ప్రధాని మోదీ ఓట్లు గెల్చుకున్నారు. మరి



ఆ ఓట్లు తీసేస్తే కేంద్ర ప్రభుత్వం కూడా తొలగించాలా కదా అన్నారు. అసలు సర్ నిర్వహణకు ఎందుకు ఇంత తొందర పడుతున్నారని సీఎం మమత ప్రశ్నించారు. "నేను ఇక్కడ ఉన్నంత వరకు, వారు మిమ్మల్ని వెళ్లగొట్టడానికి నేను అనుమతించను. ఎవరూ మిమ్మల్ని వెళ్లగొట్టలేరు" అంటూ రాష్ట్ర ప్రజలకు భరోసా ఇచ్చారు. ఇక్కడ బంగ్లాదేశీయులే సమస్య అయితే, మధ్యప్రదేశ్ , యుపీలో%బా×=% ఎందుకు నిర్వహిస్తున్నారు? అని మమతా అటు ఈసీపైనా, ఇటు బీజేపీపైనా నిప్పులు చెరిగారు. కాగా ఇటీవలి బిహార్ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ఘన విజయం తరువాత బిహార్ గెలిచేశాం. ఇక పశ్చిమ బెంగాల్ వంతు అని బీజేపీ నేత గిరిరాజ్ సింగ్ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ఈ వ్యాఖ్యలకే కౌంటర్‌గానే మమతీ ప్రతిసవాల్ చేసినట్టుగా భావిస్తున్నారు.

## ఈ నెల 30న అఖిలపక్ష భేటీ



ఢిల్లీ: పార్లమెంట్ శీతాకాల సమావేశాల కోసం కేంద్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. డిసెంబర్ 1 నుంచి ప్రారంభమయ్యే ఈ సమావేశాలు మొత్తం 19వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఈ కాలంలో 15 సిట్టింగ్‌లు నిర్వహించేందుకు షెడ్యూల్ ఖరారు చేసింది. ఈ నేపథ్యంలో సమావేశాలు ఎటువంటి అంతరాయం లేకుండా జరగాలని భావించిన కేంద్రం.. నవంబర్ 30న అఖిలపక్ష సమావేశం నిర్వహిం చనుంది. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు నేతృత్వంలో జరిగే ఈ భేటీలో.. ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే బిల్లులపై, చర్చకు వచ్చే ముఖ్య అంశాలపై, విపక్షాల సహకారం అవసరంపై చర్చించనుంది. అయితే త్వరలో జరగనున్న పార్లమెంట్ సమావేశాలు వాడీవేడీగా సాగే అవకాశం ఉందని తెలుస్తోంది. అందుకు 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంపై విపక్షాలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. ఈ అంశాన్ని పార్లమెంట్‌లో బలంగా లేవనెత్తి, ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు విపక్షాలు సిద్ధమవుతున్నాయి.

## మేం సంపద కోసం అధికారంలోకి రాలేదు



తాము నిజాయితీగా ప్రభుత్వాన్ని నడుపుతున్నామని ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ అర్వింద్ కేజ్రీవాల్ అన్నారు. పంజాబ్ లోని ఆనంద్‌పూర్ సాహిబ్ లో జరిగిన బహిరంగసభలో ఆయన మాట్లాడారు. ఇన్ని నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయని ప్రజలు అడుగుతున్నారని, ప్రభుత్వ నిధులను పూర్తిగా ప్రజల కోసమే వినియోగిస్తున్నామని, ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం కానివ్వడంలేదని చెప్పారు. తాము గురు మహరాజ్ సాహిబ్ మార్గంలో నడుస్తున్నామని, తప్పుచేసి ఉంటే ఆయన తమను శిక్షిస్తారని అన్నారు. తాము అధికారంలోకి వచ్చింది డబ్బు సంపాదించడం కోసం కాదని, మంచి పేరు సంపాదించడం కోసమని కేజ్రీవాల్ అన్నారు. తాము పెద్దపెద్ద బంగ్లాలు నిర్మించుకోవడం కోసం రాలేదని, గురు మహరాజ్ ఆశీర్వాదాల కోసం వచ్చామని తెలిపారు.

## 5 జోన్లు, 12 మంది లీడర్స్..

# బెంగాల్‌పై బీజేపీ ఫోకస్!

బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయదుందుభి మోగించిన కమలం పార్టీ పశ్చిమ బెంగాల్‌పై ఫోకస్ పెట్టింది. వచ్చే ఏడాది ప్రథమార్థంలో జరగనున్న శాసనసభ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కసరత్తు ప్రారంభించింది. బిహార్ ఎన్నికలు ముగిసిన వెంటనే బెంగాల్ ఎన్నికల ప్రచార కార్యాచరణ చేపట్టింది. ఎన్నికలకు 5 నెలలు ముందుగానే ప్రచార వ్యూహాన్ని సిద్ధం చేసింది. ఇందులో భాగంగా రాష్ట్రాన్ని ఐదు జోన్‌లుగా విభజించి, ఆరు రాష్ట్రాల నుంచి 12 మంది సీనియర్ నాయకులకు ప్రచార బాధ్యతలు అప్పగించింది. పశ్చిమ బెంగాల్‌లోనూ జంగిల్‌రాజ్‌ను అంతం చేస్తామని బిహార్ ఎన్నికల ఫలితాల అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. బిహార్ విజయం బెంగాల్‌లో గెలుపునకు బాట వేసిందని వ్యాఖ్యానించారు. కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ కూడా ఇదేరకమైన వ్యాఖ్యలు చేశారు. తమ తదుపరి లక్ష్యం బెంగాల్‌లో కాషాయ జెండా ఎగురవేయడమేనని ఉద్ఘాటించారు. బెంగాల్‌లో అరాచక పాలనకు చరమగీతం పాడతామని ప్రతిన బూనారు. వీరి మాటలను బట్టి చూస్తేనే అర్థమవుతుంది.. బెంగాల్ ఎన్నికలను బీజేపీ ఎంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందో.

### త్రిముఖ వ్యూహం

బెంగాల్‌లో ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) పదిహేనేళ్ల పాలనకు ముగింపు పలికి అధికారాన్ని దక్కించుకోవాలన్న పట్టుదలతో ఉంది బీజేపీ. ఇందుకోసం క్షేత్రస్థాయి కార్యాచరణ సిద్ధం చేసినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. పశ్చిమ బెంగాల్‌ను 5 అధిక ప్రాధాన్యత గల జోన్‌లుగా విభజించి.. ప్రతి జోన్‌కు ఒక మంత్రిని, ఒక సీనియర్ రాజకీయ నాయకుడిని నియమించారు. వీరంతా ఎన్నికల వరకు బెంగాల్‌లోనే మకాం వేస్తారు. బీజేపీ క్షేత్రస్థాయి నెట్‌వర్క్‌ను బలోపేతం చేయడం, బూత్-స్థాయి యంత్రాంగాన్ని ఏకీకృతం చేయడం, తృణమూల్ కాంగ్రెస్ బలమైన కోటల్లోకి ప్రవేశించడం వంటి లక్ష్యాలతో వీరు పనిచేస్తారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు వచ్చే ఏడాది ఏప్రిల్-మే నెలల్లో జరగనున్నాయి.

### రాఢా-బంగా జోన్ (పురులియా-బర్ధమాన్)

పురులియా, బర్ధమాన్‌లో తమ పార్టీ ఉనికిని పెంచుకోవాలని బీజేపీ భావిస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లోగా సంస్థాగతంగా బలపడాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. దీంతో ఈ జోన్‌కు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన పార్టీ ప్రధాన కార్యదర్శి (ఆర్గనైజేషన్)



పవన్ సాయిని పర్యవేక్షుడిగా బీజేపీ అధినాయకత్వం నియమించింది. ఉత్తరాఖండ్ మంత్రి ధన్ సింగ్ రావత్ సహ-పర్యవేక్షుడిగా బాధ్యతలు అప్పగించింది.

### హౌరా-హూగ్లీ-మేదినీపూర్ జోన్

హౌరా-హూగ్లీ పర్యవేక్షణను ఢిల్లీ సంస్థాగత మంత్రి పవన్ రాణా చూసుకుంటారు. ఆయనకు హరియాణాకు చెందిన సీనియర్ సంజయ్ భాటియా సహకారం అందిస్తారు. మేదినీపూర్ బాధ్యతలు ఉత్తరప్రదేశ్ మంత్రి జేపీఎస్ రాథోడ్‌కు కట్టబెట్టారు. టీఎంసీ- బీజేపీ మధ్య ఘర్షణలతో రాజకీయంగా సున్నితమైన ప్రాంతంగా మేదినీపూర్‌ను పరిగణిస్తున్నారు. బీజేపీ నేత సువేందు అధికారి ప్రభావం ఇక్కడ ఎక్కువగా ఉందన్న ప్రచారం జరుగుతోంది.

### కోల్‌కతా మెట్రోపాలిటన్ -సౌత్ 24 పరగణాలు

బీజేపీ అత్యంత కఠినమైన ప్రాంతాలలో ఒకటైన ఈ బెల్ట్‌ను హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన బీజేపీ కార్యదర్శి ఎం. సిద్ధార్థన్ పర్యవేక్షిస్తారు. మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సి.టి. రవి ఆయనతో కలిసి పని చేస్తారు. ఈ జిల్లాల్లో చాలా కాలంగా తృణమూల్ కాంగ్రెస్ ఆధిపత్యం కొనసాగుతోంది. ఈ సారి ఎన్నికల్లో ఎలాగైనా ఇక్కడ పాగా వేయాలని బీజేపీ ప్రయత్నిస్తోంది.

### నబద్వీప్ -నార్త్ 24 పరగణాలు

ఆంధ్రప్రదేశ్ బీజేపీ కార్యదర్శి మధుకర్ నూకల ఈ ప్రాంతంలో కాషాయ పార్టీ ప్రచార బాధ్యతలు చూస్తారు. యూపీ మంత్రి సురేష్ రాణా సహ-ఇన్‌చార్జ్‌గా ఉంటారు. సరిహద్దు జిల్లా అయిన నార్త్ 24 పరగణాలను రాజకీయంగా వ్యూహాత్మక ప్రాంతంగా పరిగణిస్తారు. ఇక్కడ సంస్థాగతంగా బలపడాలని బీజేపీ భావిస్తోంది.

### ఉత్తర బెంగాల్ (మాల్డా-సిలిగురి డివిజన్)

అరుణాచల్ ప్రదేశ్ బీజేపీ కార్యదర్శి అనంత్ నారాయణ్ మిశ్రాకు మాల్డా ప్రాంత పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. కర్ణాటకకు చెందిన అరుణ్ బిన్నాడి.. సిలిగురి ప్రాంతం బాధ్యతలు నిర్వహిస్తారు. బీజేపీ సాంప్రదాయ మద్దతు స్థావరాలలో ఒకటిగా పరిగణించబడే ఉత్తర బెంగాల్ ప్రాంతం అంతటా మాజీ కేంద్ర మంత్రి కైలాష్ చౌదరి చురుకైన పర్యవేక్షక పాత్రను పోషించనున్నారు.

## కొనసాగుతున్న మావోయిస్టు లొంగుబాట్లు



ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ రేంజ్‌లో మావోయిస్టు ఉద్యమానికి మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ప్రభుత్వం నిర్వహిస్తున్న 'పున మర్గం'(పునరావాసం నుంచి పునరుజ్జీవనం) కార్యక్రమంలో భాగంగా, మంగళవారం నారాయణ్‌పూర్ జిల్లాలో 28 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో 19 మంది మహిళలు ఉండగా, అందరిపైనా కలిపి మొత్తం రూ. 89 లక్షల రివార్డు ఉందని అధికారులు వెల్లడించారు. హింసను వీడి జనజీవన స్రవంతిలో కలిసేందుకు వీరు ఈ నిర్ణయం తీసుకున్నారు. కేంద్రం, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వం, బస్తర్ పోలీసులు, స్థానిక యంత్రాంగం, భద్రతా దళాలు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాయి. ఈ ప్రాంతంలో శాంతి స్థాపన, అభివృద్ధి లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. లొంగిపోయిన వారిలో మాడ్ డివిజన్ డీవీసీఎం, పీఎల్‌జీఏ కంపెనీ నెం. 06 మిలిటరీ సభ్యుడు, ఏరియా కమిటీ సభ్యుడు, టెక్నికల్ టీమ్ సభ్యుడు, మిలిటరీ ప్లాటూన్ సభ్యులు, సప్లై టీమ్ సభ్యులు వంటి పలు స్థాయిలకు చెందిన వారు ఉన్నారు. లొంగిపోయిన వారిలో ముగ్గురు ఒక ఎస్ఎల్ఆర్, ఒక ఇన్సాస్, ఒక .303 రైఫిల్‌తో సహా ఆయుధాలను భద్రతా దళాలకు అప్పగించారు. ఈ పరిణామంతో 2025లో ఇప్పటివరకు జిల్లాలో మొత్తం 287 మంది మావోయిస్టు క్యాడర్లు లొంగిపోయారని నారాయణ్‌పూర్ ఎస్పీ రాబిన్సన్ గుడియా తెలిపారు. గత 50 రోజుల్లోనే బస్తర్ వ్యాప్తంగా 512 మంది మావోయిస్టు క్యాడర్లు హింసను వీడి జనజీవన స్రవంతిలో చేరారని బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ పత్తిలింగం పేర్కొన్నారు. మావోయిస్టు అగ్ర నాయకులు దేవ్‌జీ, రామ్‌దర్‌లకు కూడా లొంగిపోవడం తప్ప మరో మార్గం లేదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ప్రతిష్ఠా మామ్‌గయ్, ఐటీబీపీ, బీఎస్ఎఫ్ కమాండర్లు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.


## భారతీయ నాగరికతకు ఈ జెండా పునర్జీవం: ప్రధాని మోదీ




అయోధ్య: అయోధ్య రామాలయ ధ్వజారోహణ కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాని మోదీ ఇవాళ దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ధర్మ ధ్వజం కేవలం జెండా మాత్రమే కాదు అని, భారతీయ నాగరికతకు పునర్జీవంగా ఈ పతాకం నిలుస్తుందని అన్నారు. కాషాయ జెండా సూర్యవంశానికి చిహ్నమని, ఓం అక్షరం.. కోవింద వృక్షం .. రామరాజ్యానికి సంకేతంగా నిలుస్తుందన్నారు. సంకల్పానికి, సక్సెస్‌కు ఈ జెండా చిహ్నమన్నారు. వందేళ్ల పోరాటానికి.. రాబోయే వేల శతాబ్దాలకు ఈ జెండా రాముడి విలువలను చాటుతుందన్నారు. సత్యమే ధర్మం అని ప్రధాని మోదీ అన్నారు. వివక్ష, బాధ ఉండకూడదని, శాంతి.. సంతోషం ఉండాలన్నారు. పేదరికం ఉండకూడదని, ఎవరూ నిస్సహాయంగా ఉండరాదన్నారు. గుడికి రాలేని వారు, గుడిపై ఎగురుతున్న జెండాను చూసినా.. వారికి అంతే పుణ్యం దక్కుతుందని మన గ్రంథాలు చెబుతాయని, చాలా దూరం నుంచి కూడా జెండాను చూసి రామ్‌లల్లా పుట్టిన ప్రదేశం ఇదే అన్న ప్రేరణ పొందవచ్చు అన్నారు. ఈ అద్భుతమైన సందర్భంలో కోట్లాది మంది రామ భక్తులకు హృదయ పూర్వక గ్రీటింగ్స్ చెబుతున్నట్లు ప్రధాని మోదీ వెల్లడించారు. రామాలయ నిర్మాణం కోసం సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. రామాలయ నిర్మాణంలో పాల్గొన్న ప్రతి ఒక్క కార్మికుడు, కళాకారుడు, ప్లానర్, ఆర్కిటెక్ట్, వర్కర్‌కు ప్రధాని మోదీ అభినందనలు తెలిపారు.

## డీజీసీఏ కీలక నిర్ణయం... పైలట్లు, సిబ్బందికి 'ఫాటిగ్ ట్రైనింగ్' తప్పనిసరి

విమాన భద్రతను మరింత పటిష్టం చేసే దిశగా డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) కీలక ఆదేశాలు జారీ చేసింది. పైలట్లు, క్యాబిన్ సిబ్బందితో పాటు విమాన షెడ్యూళ్లను ప్లాన్ చేసే సిబ్బందికి కూడా ఏటా ఫాటిగ్ మేనేజ్‌మెంట్‌పై (అలసట నిర్వహణ) శిక్షణను తప్పనిసరి చేసింది. ఇటీవల కాలంలో విమాన సిబ్బంది పని గంటలు పెరగడం, వారి అలసట భద్రతపై ప్రభావం చూపుతుందన్న ఆందోళనల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. ఈ కొత్త నిబంధనల ప్రకారం, ప్రతీ విమానయాన సంస్థ తమ రెగ్యులర్ గ్రౌండ్ ట్రైనింగ్‌లో భాగంగా ఏటా కనీసం ఒక గంట ప్రత్యేక శిక్షణ ఇవ్వాలి. ఇందులో విమాన ప్రయాణ గంటలు, డ్యూటీ పరిమితులు, తప్పనిసరి విశ్రాంతి నియమాలతో పాటు, నిద్రకు సంబంధించిన శాస్త్రీయ అంశాలు, శరీర గడియారాన్ని (బాడీ క్లాక్) ప్రభావితం చేసే అంశాలు, అలసట పనితీరుపై ఎలా ప్రభావం చూపుతుందనే విషయాలపై అవగాహన కల్పిస్తారు. సిబ్బంది తమ అలసట గురించి ఫిర్యాదు చేసేందుకు పారదర్శకమైన వ్యవస్థను, వాటిని సమీక్షించి దిద్దుబాటు చర్యలు సూచించేందుకు ఒక స్వతంత్ర ఫాటిగ్ రివ్యూ కమిటీని ఏర్పాటు చేయాలని కూడా డీజీసీఏ ఎయిర్‌లైన్స్‌ను ఆదేశించింది. ఎంతమంది సిబ్బందికి శిక్షణ ఇచ్చారు, ఎన్ని అలసట ఫిర్యాదులు వచ్చాయి, వాటిలో ఎన్నింటిని స్వీకరించారు, ఎందుకు తిరస్కరించారు అనే వివరాలతో ప్రతీ మూడు నెలలకు ఒకసారి తమకు నివేదిక పంపాలని స్పష్టం చేసింది. గత జులైలో జరిపిన ఆడిట్‌లో కొన్ని విమానయాన సంస్థలు అలసటకు సంబంధించిన నిబంధనలను సరిగ్గా పాటించడం లేదని డీజీసీఏ గుర్తించింది. పైలట్ సంఘాలు కూడా రాత్రిపూట ల్యాండింగ్‌లు పెంచడం భద్రతకు ముప్పు అని హెచ్చరించాయి.



గతంలో వారపు విశ్రాంతిని 48 గంటలకు పెంచుతూ డీజీసీఏ తీసుకున్న నిర్ణయాన్ని కొన్ని సంస్థలు వ్యతిరేకించినా, ఢిల్లీ హైకోర్టు ఆదేశాలతో అవి అమలయ్యాయి. ఈ నేపథ్యంలో, సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట వేస్తూ, అలసట వల్ల తలెత్తే ముప్పును ముందుగానే నివారించే లక్ష్యంతో డీజీసీఏ ఈ కొత్త నిబంధనలను తీసుకొచ్చింది.

Printed, Published & Owned by **SIRIKONDA MARIA,** Printed at ASHISH PUBLICATIONS H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-1-12/45/1, P.H.C. Colony, Adilabad - 504001, Telangana. Editor : **SIRIKONDA AUGUSTIN . RNI No.: APTEL/2013/52694.** E-mail: voodayam2007@gmail.com, Cell : 9247698676, 7075458621. Telefax. No. 040-27678676.